అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com

సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:172 | హైదరాబాద్ 23 జనవరి 2026, శుక్రవారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-172 | Hyderabad 23 January 2026, Friday | Pages: 8, Rs. 5/-

అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com



వైసీపీ హయాంలో చేపట్టిన భూ-రీసర్వే ను తన ఖాతాలో వేసుకున్న చంద్ర బాబు | కేంద్రం 'ప్లాటినం గ్రేడ్' ఇచ్చిందని గుర్తు చేసిన జగన్ | రాళ్లపై పేర్లు చెరిపివేసేందుకు రూ. 15 కోట్లు వృధా

రాష్ట్రంలో 'రెడ్ బుక్' పాలన సాగుతోంది | ఇసుక, మద్యం, మైనింగ్‌లో విచ్చలవిడిగా అవినీతి | జూదం చట్టబద్ధమా? ప్రభుత్వమే వాటిని ప్రోత్సహించడమేంటి?

# క్రెడిట్ చోరీలో చంద్రబాబుది ప్రపంచ రికార్డు


**భూముల సమగ్ర రీసర్వే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 'క్రెడిట్ చోరీ'కి పాల్పడుతున్నారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన 'భూ రక్ష', 'భూ హక్కు' పథకాలను చంద్రబాబు హైజాక్ చేశారని, ఈ బృహత్కార్యంలో ఆయన పాత్ర ఏమాత్రం లేకపోయినా ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండి పడ్డారు.**

**తాడేపల్లి (ఏడీఎన్‌ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాడేపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన విప్లవాత్మక కార్యక్రమాలను చంద్రబాబు తన ఖాతాలో వేసుకునేందుకు నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. "ఈ భూమండలంపై క్రెడిట్ చోరీని అత్యంత సమర్థంగా చేయగలిగిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు మాత్రమే... అవసరానికి రంగులు మార్చే ఊసరవెల్లి కూడా ఈయన్ను చూసి సిగ్గుపడాల్సిందే," అని వై ఎస్ జగన్ ఎద్దేవా చేశారు. భూముల రీసర్వే అనేది రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ మహా యజ్ఞమని అభివర్ణించారు. 100 ఏళ్ల తర్వాత దేశంలోనే తొలిసారిగా అత్యంత పారదర్శకంగా, వివాదాల్లేకుండా సర్వే నిర్వహించామని తెలిపారు.

...::: తరువాయి 2వ పేజీలో..

# రాష్ట్రాల మధ్య భూ పంచాయితీ



## రూ. 4,000 కోట్ల కొండాపూర్ భూమి మాదేనన్న ఏపీ

హైదరాబాద్‌లోని అత్యంత విలువైన ఐటీ కారిడార్ కొండాపూర్‌లో గల రూ. 4,000 కోట్ల భూమి విషయంలో ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల మధ్య కొత్త వివాదం మొదలైంది. ఈ భూమిపై తమకే పూర్తి హక్కులు ఉన్నాయంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ ఇప్పుడు రాజకీయంగా ,న్యాయపరంగా సంచలనం సృష్టిస్తోంది.

...::: తరువాయి 2వ పేజీలో..

## జమ్ముకశ్మీర్ లో
# 10 మంది సైనికులు మృతి



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్) :**

జమ్మూకశ్మీర్‌లోని దోడా సెక్టార్‌లో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 10 మంది ఆర్మీ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు సంబంధించి సమాచారం అందిన వెంటనే జవాన్లు, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని ఉధంపూర్ మిలటరీ ఆస్పత్రికి తరలించారు. భదేర్వా-చంబా అంతర్రాష్ట్ర రహదారి వెంబడి ఖన్నీ టాప్ దగ్గర, డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం 200 అడుగుల లోయలో పడినట్లు ఆర్మీ వర్గాలు ప్రకటించాయి. గాయపడిన వారిలో జవాన్ల పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే సూచన ఉన్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఆర్మీ వాహనం మొత్తం 17 మంది జవాన్లతో హై ఆల్టిట్యూడ్ పోస్టుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

...::: తరువాయి 2వ పేజీలో..

## ముంబై మేయర్ పీఠం
# జనరల్ మహిళకే!



**ముంబై (ఏడీఎన్‌ఎన్) :**

దేశంలోనే అత్యంత సంపన్నమైన మున్సిపల్ కార్పొరేషన్ అయిన బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ తదుపరి మేయర్‌గా జనరల్ కేటగిరీకి చెందిన మహిళ ఎన్నిక కానున్నారు. మహారాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ గురువారం నిర్వహించిన రిజర్వేషన్ల లాటరీ ప్రక్రియలో ఈ మేరకు నిర్ణయం వెలువడింది. ఈ నిర్ణయంతో మేయర్ పీఠం కోసం పోటీ పడుతున్న రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెంచుతున్నాయి. ఈ రిజర్వేషన్ ప్రక్రియపై శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) తీవ్రస్థాయిలో మండిపడింది. మాజీ మేయర్ కిషోరి పెడ్నేకర్ ఈ లాటరీ ప్రక్రియను, "ముందుగా నిర్ణయించిన కుట్ర"గా అభివర్ణించారు. గత రెండు దఫాలుగా మేయర్ పదవి జనరల్ కేటగిరీకే దక్కిందని, రొటేషన్ పద్ధతిలో ఈసారి ఓబీసీ లేదా ఎస్టీ వర్గాలకు కేటాయించాల్సి ఉందని ఆమె వాదించారు.

...::: తరువాయి 2వ పేజీలో..



## సింగరేణిలో
# నైనీ టెండర్లు రద్దు

**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్) :**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లో బొగ్గు గనుల తవ్వకాల టెండర్ల వ్యవహారం పెను సంచలనం సృష్టిస్తోంది. గత కొద్ది రోజులుగా నైనీ కోల్ మైన్స్ టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, నిబంధనలను ఒకరిద్దరికే మేలు చేసేలా మార్చారంటూ విపక్షాల నుంచి తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. ఇంధన శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం నైనీ కోల్ మైన్స్ టెండర్లను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

నిజానికి గురువారం సాయంత్రం 5 గంటలకు ఈ టెండర్ల బిడ్లు ప్రారంభం కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ టెండర్ల ప్రక్రియపై కేంద్ర బొగ్గు గనుల శాఖ కూడా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ముఖ్యంగా టెండర్ నిబంధనలను రూపొందించే సమయంలో సింగరేణి పాలకమండలిలో ఎందుకు చర్చించలేదని కేంద్ర సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. అలాగే, టెండర్లలో పాల్గొనే కంపెనీలకు క్షేత్రస్థాయి సందర్శన ధృవీకరణ పత్రాలు ఇవ్వకపోవడాన్ని కేంద్రం తప్పుబట్టింది. నైనీ బొగ్గు గని టెండర్లు రద్దు కావడం ఇది రెండోసారి. లోగడ, 2016లో కూడా ఇటువంటి ఆరోపణల నేపథ్యంలోనే టెండర్లు రద్దయ్యాయి.

...::: తరువాయి 2వ పేజీలో..



## వరల్డ్ ఎకనామిక్ ఫోరం
# ఎండీతో సీఎం భేటీ

**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్) :**

ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతర్జాతీయ పెట్టుబడిదారులు , ఫోరం ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరల్డ్ ఎకనామిక్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్ తో భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రతిపాదనలను వారి ముందు ఉంచారు. దావోస్ సదస్సులో తీసుకునే నిర్ణయాలు , ఒప్పందాల పురోగతిని సమీక్షించడానికి ఏటా జూలై , ఆగస్టులో హైదరాబాద్‌లో ' వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సు' నిర్వహించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై జెరెమీ జర్గెన్స్ సానుకూలంగా స్పందిస్తూ, దీనిపై త్వరలోనే అధికారిక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికను వివరిస్తూ 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రదర్శించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన రోడ్‌మ్యాప్‌ను గ్లోబల్ లీడర్లకు వివరించారు.సీ4ఐఆర్ నెట్‌వర్క్ హెడ్ మంజు జార్జ్ తో జరిగిన భేటీలో,విద్యుత్ వాహనాలు , పునరుత్పాదక ఇంధనం, నైపుణ్యాభివృద్ధి, హెల్త్ కేర్ ఇన్నోవేషన్ రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి గురించి సీఎం ప్రస్తావించారు.

## మాజీ మంత్రి కేటీఆర్‌కు
# సిట్ నోటీసులు



**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్) :**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు క్లైమాక్స్ కు చేరుతోంది. భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు గురువారం జారీ చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ లోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అధికారులు ఆ నోటీసులో పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా ఆరోపణలు వస్తున్న ఈ అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై 2024 మార్చి 10 నుంచి విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు ఉన్నతాధికారులను విచారించి, కీలక నిందితులపై అభియోగపత్రాలను దాఖలు చేసిన సిట్, ఇప్పుడు రాజకీయ నాయకుల పాత్రపై దృష్టి సారించింది. ఫోన్ ట్యాపింగ్ అనేది నేరం కాదని, దేశ భద్రత , ప్రభుత్వాల రక్షణ కోసం 1952 నుంచే నిఘా వ్యవస్థలు ఈ పని చేస్తున్నాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలు జరిగినప్పుడు నిఘా పెట్టడం నిఘా వర్గాల విధి అని, ఇందులో మంత్రులకు లేదా ప్రభుత్వాలకు నేరుగా సంబంధం ఉండదని, అంతా పోలీసు వ్యవస్థ పరిధిలోనే జరుగుతుందని స్పష్టం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో..

# ట్రంప్ పీస్ బోర్డులో పాక్ - ఇజ్రాయెల్ రచ్చ



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్) :**

గాజా సంక్షోభానికి దీర్ఘకాలిక పరిష్కారం చూపేందుకు ఏర్పాటు చేసిన ‘ శాంతి మండలి ’లో, పాకిస్తాన్ కు సభ్య దేశంగా చోటు కల్పించడంపై ఇజ్రాయెల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పాక్ తో తమకెలాంటి దౌత్య సంబంధాలు లేవని, పైగా ఆ దేశం హమాస్ వంటి సంస్థలకు పరోక్ష మద్దతు ఇస్తోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఇజ్రాయెల్‌ను అధికారిక దేశంగా కూడా గుర్తించని పాకిస్తాన్, శాంతి చర్చల్లో ఎలా భాగస్వామి అవుతుందన్న ప్రశ్నను ఆదేశ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు లేవనెత్తారు. తమ భద్రతకు సంబంధించిన నిర్ణయాల్లో పాకిస్తాన్ పాత్రను ఇజ్రాయెల్ ఓ పట్టాన అంగీకరించకపోవడం గమనార్హం.

...::: తరువాయి 2వ పేజీలో..

## తెలుగు రాష్ట్రాలకు
# అమృత్ భారత్



**న్యూఢిల్లీ (ఏడీఎన్‌ఎన్) :**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం తిరువనంతపురంలోని పుతరికండం మైదానంలో ఉదయం 10.45 గంటలకు జరగనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌ను కలుపుతూ తిరువనంతపురం నార్త్-చర్లపల్లి-తిరువనంతపురం నార్త్ అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్‌ను ప్రధాని జెండా ఊపి ప్రారంభించనున్నారు. తిరువనంతపురం సెంట్రల్, తిరువనంతపురం నార్త్, త్రిస్సూర్ రైల్వే స్టేషన్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అక్కడ ప్రధాని ప్రసంగాన్ని లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రసారం చేస్తారు. తిరువనంతపురం సెంట్రల్-తాంబరం అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్, నాగర్‌కోయిల్ జంక్షన్-మంగళూరు జంక్షన్ అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ కూడా శుక్రవారం ప్రారంభం కాబోతున్నాయి. ప్రధాన వేదిక నుంచి ప్రధాన మంత్రి జెండా ఊపిన వెంటనే రైళ్లు బయలుదేరుతాయి. తిరువనంతపురం నార్త్-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ తొలి ప్రయాణం ఉదయం 10.45 గంటలకు ప్రారంభమవుతుంది. అదే సమయంలో త్రిస్సూర్-గురువాయూర్ ప్రయాణికుల రైలు సేవ కూడా మొదలవుతుంది. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, రైల్వే ప్రయాణికుల సంఘాలు, జోనల్, డివిజనల్ రైలు వినియోగదారుల కమిటీ సభ్యులు, సాధారణ ప్రజలు పాల్గొననున్నారు.

...::: తరువాయి 2వ పేజీలో..

## అన్నా చెల్లెళ్ల మధ్య విబేధాలు...
# అస్సాంలో హాట్ టాపిక్



**న్యూఢిల్లీ (ఏడీఎన్‌ఎన్) :**

కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల మధ్య విభేదాలకు తానే ప్రత్యక్ష బాధితుడినని అస్సాం ముఖ్యమంత్రి, బీజేపీ నేత హిమంత బిశ్వ శర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైన హిమంత బిశ్వ శర్మ, ఒక చానల్ ఇచ్చిన ఇంటర్వ్యూలో గాంధీ కుటుంబంపై ఆరోపణలు చేశారు. రాహుల్, ప్రియాంక మధ్య సఖ్యత లేదని, అందుకే ప్రియాంకను కేరళకు బదులుగా అస్సాం ఎన్నికల కమిటీ బాధ్యతల నిమిత్తం పంపారని అన్నారు. కేరళ ఎంపీ అయిన ప్రియాంకకు ఆ రాష్ట్రంలోనే బాధ్యతలు ఇవ్వకపోవడం వెనుక ఇదే కారణమని ఆయన చెప్పారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అస్సాం ఎన్నికల బాధ్యతలను ప్రియాంక గాంధీకి అప్పగించిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేయటం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది.

...::: తరువాయి 2వ పేజీలో..



## కమల్ కు టార్చ్...
# విజయ్ కు విజిల్

**చెన్నై (ఏడీఎన్‌ఎన్) :**

తమిళ నటులు కమల్ హాసన్, విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీలకు ఎన్నికల గుర్తులను కేటాయిస్తూ, కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తమిళనాట ఎన్నికల సందడి అధికారికంగా మొదలైనట్లయింది. తమిళనాడు శాసనసభ ఎన్నికలు 2026 మే నెలలో జరగనున్న నేపథ్యంలో, కమల్ హాసన్ నేతృత్వంలోని 'మక్కళ్ నీది మయ్యం' పార్టీకి ఎన్నికల కమిషన్ మరోసారి 'టార్చ్‌లైట్' గుర్తును కేటాయించింది. 2019 లోక్ సభ ఎన్నికలతో పాటు 2021 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కమల్ ఇదే గుర్తుపై పోటీ చేశారు. తన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా సమాజంలోని చీకట్లను పారద్రోలేందుకు ఈ గుర్తు సరైనదని కమల్ గతంలోనే అభిప్రాయపడ్డారు. ఈసారి కూడా అదే గుర్తు దక్కడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇక ఇదే ఎన్నికల ద్వారా రాజకీయ అరంగేట్రం చేస్తున్న తమిళ సూపర్ స్టార్ విజయ్ తన 'తమిళగ వెట్రి కళగం' పార్టీకి 'విజిల్' గుర్తును దక్కించుకున్నారు.

...::: తరువాయి 2వ పేజీలో..




# గ్రూప్-1పై తీర్పు వాయిదా

**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్) :**

తెలంగాణ గ్రూప్1 అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చే తీర్పుపై ఉత్కంఠ మరికొన్ని రోజులు కొనసాగనుంది. గ్రూప్1 నియామకాలకు సంబంధించి దాఖలైన అప్పీళ్లపై తీర్పును తెలంగాణ హైకోర్టు ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది.

గతంలో గ్రూప్1 పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని, నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఆరోపిస్తూ పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి, మార్కుల తుది జాబితాను, జనరల్ ర్యాంకులను రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చారు. జవాబుపత్రాలను పునర్ మూల్యాంకనంచేయాలని, లేనిపక్షంలో తాజాగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

...::: తరువాయి 2వ పేజీలో..



# ఏపీ సీఎం పై తమిళులు ఆగ్రహం

**కుప్పం (ఏడీఎన్‌ఎన్) :**

తమిళనాడులోని పారిశ్రామిక నగరం హోసూర్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించడం ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య సోషల్ మీడియా యుద్ధానికి దారితీసింది. ఈ నిర్ణయం వెనుక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హస్తం ఉందంటూ తమిళ నెటిజన్లు చేస్తున్న ఆరోపణలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. తమ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని కొందరు నెటిజన్లు ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు.

...::: తరువాయి 2వ పేజీలో..

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
శుక్రవారం | హైదరాబాద్
23.01.2026
www.manasarkar.com

## జమ్ముకశ్మీర్ లో 10 మంది సైనికులు మృతి

**మొదటిపేజీ తరువాయి....**
ఇప్పటికే పది మంది సైనికుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న అధికారులు.. ఘటనా స్థలిలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఘటనపై లెఫ్ట్‌నెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ధ్రువీకరించారు. దోడాలో చోటుచేసుకున్న దుర్ఘటనలో 10 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ ఘోర ప్రమాదం తీవ్ర విషాదకరమని పేర్కొన్నారు. మృత జవాన్ల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన సైనికులను ప్రత్యేక విమానంలో ఆస్పత్రికి తరలించామని, వారికి ఉత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని లెఫ్ట్ నెంట్ గవర్నర్ సిన్హా ఆకాంక్షించారు.

## ముంబై మేయర్ పీఠం జనరల్ మహిళకే!

**మొదటిపేజీ తరువాయి....**
నిబంధనలను ఎవరికీ చెప్పకుండా మార్చేశారని ఆరోపిస్తూ ఆమె అధికారులతో వాగ్వాదానికి దిగారు. కేవలం అధికార పక్షానికి మేలు చేకూర్చేందుకే ఈ మార్పులు చేశారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రకటించిన రిజర్వేషన్ ప్రకారం, జనరల్ కేటగిరీకి చెందిన మహిళా కార్పొరేటర్లు మేయర్ పదవికి నామినేషన్లు దాఖలు చేస్తారు. అనంతరం జరిగే ప్రత్యేక సమావేశంలో కార్పొరేటర్లు ఓటు వేస్తారు. మొత్తం ఓట్లలో సగం కంటే ఎక్కువ సాధించిన అభ్యర్థి ముంబై కొత్త మేయర్‌గా బాధ్యతలు చేపడతారు. ఇటీవల ముగిసిన బీఎంసీ ఎన్నికల్లో మహాయుతి కూటమి (BJP షిండే సేన) స్పష్టమైన మెజారిటీ దిశగా ఉన్నప్పటికీ, మేయర్ పీఠం దక్కించుకోవడానికి ప్రతి ఓటు కీలకం కానుంది. ఏ పార్టీకి సొంతంగా పూర్తి మెజారిటీ లేని పక్షంలో పొత్తులు, ఇతర పార్టీల మద్దతు మరియు ఫిరాయింపులు కూడా మేయర్ ఎన్నికను ప్రభావితం చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రిజర్వేషన్ నిర్ణయంతో అత్యంత ప్రజాదరణ ఉన్న మహిళా నేతలను బరిలోకి దింపేందుకు బీజేపీ, శివసేన వర్గాలు సన్నద్ధమవుతున్నాయి.

## సింగరేణిలో నైనీ టెండర్లు రద్దు

**మొదటిపేజీ తరువాయి....**
ప్రస్తుతం పాలనాపరమైన కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని, త్వరలోనే నిబంధనలపై పాలకమండలిలో కూలంకషంగా చర్చించి, పూర్తి పారదర్శకతతో కొత్త టెండర్లు పిలుస్తామని అధికారులు స్పష్టం చేశారు. వేల కోట్ల రూపాయల విలువైన ఈ ప్రాజెక్ట్ పదే పదే వివాదాల్లో చిక్కుకోవడం సింగరేణి వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## గ్రూప్-1పై తీర్పు వాయిదా

**మొదటిపేజీ తరువాయి....**
సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు, ఇప్పటికే ఎంపికైన పలువురు అభ్యర్థులు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘంగా విచారణ చేపట్టిన ధర్మాసనం, గతంలోనే వాదనలు పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది. నియామక ప్రక్రియపై సింగిల్ జడ్జి ఇచ్చిన స్టేను ఎత్తివేస్తూనే.. అపాయింట్‌మెంట్లు అన్నీ కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది.ఈ అప్పీళ్లపై గురువారం తీర్పు వెలువడుతుందని అభ్యర్థులందరూ ఆశగా ఎదురుచూశారు. అయితే తీర్పు కాపీ సిద్ధం కాకపోవడంతో న్యాయస్థానం మరో రెండు వారాల పాటు గడువు పొడిగించింది. దీంతో ఫిబ్రవరి 5న వచ్చే తీర్పు గ్రూప్ 1 పోస్టుల భవితవ్యాన్ని ఏ తీరానికి చేరుస్తుందోనన్న ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది.

## క్రెడిట్ చోరీలో చంద్రబాబుది ప్రపంచ రికార్డు

**మొదటిపేజీ తరువాయి...**
2019 మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 2020 డిసెంబర్‌లో ఈ ప్రక్రియను ప్రారంభించామని, ఇందుకోసం 40 వేల మంది సిబ్బందికి అత్యాధునిక టెక్నాలజీపై శిక్షణ ఇప్పించామన్నారు. హెలికాప్టర్లు, డ్రోన్ల వినియోగంతో పాటు రూ. 6 వేల కోట్లు ఖర్చు చేసి కోట్ల సంఖ్యలో సర్వే రాళ్లను రైతులకు ఉచితంగా అందించామని, ఈ కృషిని గుర్తించి కేంద్రమే ప్లాటినం గ్రేడ్ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని నీరుగారుస్తోందని జగన్ ఆరోపించారు. తాము పాతిన సర్వే రాళ్లపై ఉన్న పేర్లను తొలగించేందుకు ఏకంగా రూ. 15 కోట్లు ఖర్చు చేస్తున్నారని, గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పాస్ పుస్తకాలనే వాడుతూ కేవలం రంగు మార్చి తన ముద్ర వేసుకుంటున్నారని విమర్శించారు. ట్యాంపర్ చేయడానికి వీల్లేని పద్ధతిలో తాము పాస్ పుస్తకాలు ఇస్తే, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇస్తున్న పుస్తకాల్లో విపరీతమైన తప్పులు దొర్లుతున్నాయని దుయ్యబట్టారు. 22ఏ నిషేధిత జాబితాలో అడ్డగోలుగా భూములను పెట్టిన చరిత్ర బాబుదని, కానీ తాము లక్షలాది మంది రైతులకు భూములపై శాశ్వత హక్కులు కల్పించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఏపీలో 'రెడ్ బుక్' రాజ్యాంగం నడుస్తోందని మాజీ సీఎం ధ్వజమెత్తారు. గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామంలో వైసీపీ కార్యకర్త సాల్మన్‌ను టీడీపీ వర్గీయులు అత్యంత కిరాతకంగా రాడ్లతో కొట్టి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వ్యక్తి మృతదేహాన్ని కూడా ఊరిలోకి రానివ్వని దుస్థితి నెలకొందని, ఈ అరాచకాల్లో పోలీసు అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, సాక్షాత్తు చంద్రబాబు కూడా దోషేనని విమర్శించారు. ఈ ఘటనపై తాము కోర్టులను, మానవ హక్కుల సంఘాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్స్ వాడవాడలా వెలిశాయని జగన్ ఆరోపించారు. మద్యం, ఇసుక, మైనింగ్ రంగాల్లో మాఫియాలు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఇసుక ద్వారా ఖజానాకు రూ. 750 కోట్లు వచ్చేదని, ఇప్పుడు రేట్లు రెట్టింపు అయినా ఖజానాకు పైసా రావడం లేదని విమర్శించారు. సంక్రాంతి పండుగకు కూటమి ఎమ్మెల్యేలు దగ్గరుండి జూదాలను నడిపించారు. దాదాపు ప్రతీ నియోజకవర్గంలో ఇది జరిగింది. ఈ తతంగంతో సుమారు రూ.2 వేల కోట్ల రొటేషన్ జరిగింది. ఇందులో చంద్రబాబు, నేతలు, పోలీసులు కూడా వాటాలేసుకున్నారు. జూదం అనేది చట్టబద్ధమా?. ప్రభుత్వమే దగ్గరుండి ఇలాంటి వాటిని ప్రోత్సహించడమేంటి?. ఇది ప్రజలను తప్పుడు మార్గంలో దోచుకోవడం కిందకు రాదా?.. ఇది అవినీతి కిందకే వస్తుంది కదా.. లూటీ కదా!.. అని ఆయన ప్రశ్నించారు . ప్రతిపక్ష హోదా అంశంపై వేసిన ప్రశ్నకు బదులిస్తూ, ఈ ప్రశ్నకు గతంలో చాలాసార్లు సమాధానం ఇచ్చామని వై ఎస్ జగన్ గుర్తు చేశారు. రాష్ట్రంలో తాము తప్ప మరో ప్రతిపక్ష పార్టీ లేదనే విషయాన్ని మీడియా గుర్తించాలని, సభలో మైక్ ఇచ్చే పరిస్థితులు లేనందునే ప్రధాన ప్రతిపక్ష హోదా కోసం పోరాటం చేయాల్సి వస్తోందని వైఎస్ జగన్ అన్నారు. అమరావతి నిర్మాణాల పేరుతో జరుగుతున్నది కేవలం స్కామ్ మాత్రమేనని, నిర్మాణ ఖర్చుల పేరుతో ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారని జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

# స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం.. ఏడుగురు సజీవ దహనం

**ఛత్తీస్‌గఢ్ (ఏడీఎన్‌ఎన్) :**



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బలోడా బజార్ జిల్లాలో గురువారం ఉదయం పెను విషాదం చోటు చేసుకుంది. ప్రైవేట్ స్టీల్ ప్లాంట్‌లో బొగ్గు కొలిమి ఒక్కసారిగా పేలిపోవడంతో ఏడుగురు కార్మికులు మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారు. ఈ ప్రమాదంలో మరో పది మందికి పైగా కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. బలోడా బజార్ జిల్లాలోని బకులాహి ప్రాంతంలో ఉన్న రియల్ ఇస్పాట్ స్టీల్ ప్లాంట్‌లో ఈ దుర్ఘటన జరిగింది. గురువారం ఉదయం విధుల్లో భాగంగా కార్మికులు బొగ్గు కొలిమి చుట్టూ శుభ్రపరిచే పనులు చేస్తుండగా, అకస్మాత్తుగా భారీ శబ్దంతో కొలిమి పేలిపోయింది. పేలుడు సమయంలో మండుతున్న బొగ్గు, విపరీతమైన వేడి కార్మికులపై పడటంతో అక్కడే ఉన్న ఏడుగురు తప్పించుకునే అవకాశం లేక ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి ప్లాంట్ అంతటా దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. ఈ మంటలు కిలోమీటరు దూరం వరకు కనిపించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్లాంట్‌లో భద్రతా నిబంధనలు పాటించారా? సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమా? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. యాజమాన్యం నిర్లక్ష్యం తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రమాదంతో మృతుల కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.


## దావోస్‌లో తెలుగు రాష్ట్రాల నేతల ఆత్మీయ కలయిక



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్) :**

దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ ఆత్మీయంగా కలుసుకున్నారు. సదస్సు ప్రాంగణంలో కలుసుకున్న ఇద్దరు నేతలు స్నేహపూర్వకంగా పలకరించుకుని కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, లోకేష్‌ను శాలువాతో సత్కరించారు. ఇద్దరూ నవ్వుతూ మాట్లాడుకుంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మేడారం జాతరకు లోకేష్‌ను రేవంత్ రెడ్డి ఆహ్వానించినట్లు సమాచారం. ఇదే వేదికపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు మధ్య కూడా కీలక చర్చలు జరిగాయి. రాష్ట్ర విభజన తర్వాత ఇంకా పరిష్కారం కాని అంశాలు, అలాగే రెండు రాష్ట్రాలకు పెట్టుబడులు ఆకర్షించడంలో పరస్పర సహకారంపై నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్టర్ల ముందు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి బలాన్ని ప్రదర్శించేలా ఈ భేటీలు కొనసాగాయి. దావోస్ సదస్సులో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు పోటాపోటీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించగా, చంద్రబాబు నాయుడు ఏపీలోని స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, కొత్త పారిశ్రామిక విధానాలను పరిశ్రమల ప్రతినిధులకు వివరించారు. ఏఐ, లైఫ్ సైన్సెస్, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడుల కోసం గ్లోబల్ సీఈఓలతో విస్తృత చర్చలు సాగుతున్నాయి. తెలంగాణ పెవిలియన్‌లో జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. మరోవైపు ఏపీ పెవిలియన్‌లో మంత్రి లోకేష్ స్విస్ కంపెనీలతో నైపుణ్యాభివృద్ధి, డ్రోన్ టెక్నాలజీ రంగాల్లో సహకారంపై చర్చలు జరిపారు.

## మావోయిస్టుల ఏరివేత ముమ్మరం



ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. సింగ్‌భూం జిల్లాలో భద్రతా దళాలు జరిపిన ఆపరేషన్‌లో 15 మంది మావోయిస్టులు హతమయ్యారు. సారండా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, సింగ్‌భూం జిల్లాలోని సారండా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కోబ్రా బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలపై మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో, బలగాలు దీటుగా ప్రతిఘటించాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతోంది. 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సహా మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిర్మూలన చర్యలను ముమ్మరం చేశాయి. ఝార్ఖండ్‌లో జరిగిన ఈ తాజా ఎన్‌కౌంటర్‌ను కూడా ఈ ఆపరేషన్లలో భాగంగానే అధికారులు చూస్తున్నారు. మృతుల గుర్తింపు, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ ఘటనతో మావోయిస్టుల ఏరివేత దిశగా మరో కీలక ముందడుగు పడినట్లయిందని భద్రతా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## మాజీ మంత్రి కేటీఆర్‌కు సిట్ నోటీసులు

**మొదటిపేజీ తరువాయి...**
ఈ కేసును కేవలం ఒక 'ట్రాష్‌కేసు'గా కొట్టిపారేసిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి 'కార్తీకదీపం' సీరియల్‌లా ఈ వ్యవహారాన్ని సాగదీస్తోందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి తన బామ్మర్దికి సంబంధించిన సింగరేణి బొగ్గు కుంభకోణాన్ని తాము బయటపెట్టినందుకే కక్షపూరితంగా హరీష్ రావుకు మరియు తనకు నోటీసులు ఇచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సిట్ అనేది రేవంత్ రెడ్డి చెబితే కూర్చునేలా, నిలబడేలా తయారైందని విమర్శించారు. ఒకవేళ ట్యాపింగ్ నిజంగానే నేరం అయితే, ముందుగా ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డినే విచారించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రతిపక్ష నేతల ఫోన్లను రేవంత్ రెడ్డి కూడా ట్యాపింగ్ చేయిస్తున్నారని, భవిష్యత్తులో తాము అధికారంలోకి వచ్చాక విచారణ జరిపిస్తే వీళ్లంతా జైలుకు వెళ్లడం ఖాయమని హెచ్చరించారు. సిట్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం విచారణకు హాజరవుతానని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.




## ఉదయనిధి స్టాలిన్ రాజీనామా చేయాలి

### బీజేపీ నేత అన్నామలై డిమాండ్!

**చెన్నై (ఏడీఎన్‌ఎన్) :**

తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని , ఆయన తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై డిమాండ్ చేశారు. సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ నేత అమిత్ మాలవీయపై నమోదైన కేసును మద్రాస్ హైకోర్టు కొట్టేయడంతో అన్నామలై ఈ ఘాటు విమర్శలు చేశారు. గురువారం ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడిన అన్నామలై, మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. "సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు సమాజంలో విద్వేషానికి, జాతి నిర్మూలనకు దారితీసేలా ఉన్నాయని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఇది చట్టబద్ధమైన ప్రభుత్వం అయితే, కోర్టు వ్యాఖ్యలను గౌరవించి ఉదయనిధి నుంచి తక్షణమే రాజీనామా లేఖ తీసుకోవాలి," అని అన్నామలై డిమాండ్ చేశారు. మూడేళ్ల క్రితం చెన్నైలో జరిగిన ఒక సభలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. "సనాతన ధర్మం అనేది మలేరియా, డెంగ్యూ వంటిదని, దానిని నిర్మూలించాలి," అని వ్యాఖ్యానించారు. దీనిని మారణహోమానికి పిలుపుగా అమిత్ మాలవీయ అభివర్ణించగా, తమిళనాడు పోలీసులు ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసును హైకోర్టు కొట్టేయడమే కాకుండా, ఉదయనిధి వ్యాఖ్యలపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. స్టాలిన్ ప్రభుత్వానికి న్యాయవ్యవస్థపై గౌరవం లేదని అన్నామలై ఆరోపించారు. కోర్టులు ఇచ్చే తీర్పులను డీఎంకే ప్రభుత్వం ఖాతరు చేయడం లేదని, తిరుప్పరంకుండ్రం వంటి అనేక కేసుల్లో కోర్టు ఆదేశాలను అమలు చేయలేదని మండిపడ్డారు. "డీఎంకే , వామపక్ష పార్టీలు తమకు అనుకూలంగా తీర్పు రాకపోతే న్యాయమూర్తులపై కుల, మత పరమైన దూషణలకు దిగుతారు. పేదల కోసం పోరాడాల్సిన కమ్యూనిస్టులు ఇప్పుడు డీఎంకేకు తోక పార్టీలుగా మారిపోయారు," అని ఆయన ధ్వజమెత్తారు. ప్రజలు డీఎంకే అరాచకాలను గమనిస్తున్నారని, త్వరలోనే వీటికి ముగింపు వస్తుందని అన్నామలై పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు అమృత్ భారత్

**మొదటిపేజీ తరువాయి...**
వారానికి ఒకసారి నడిచే మూడు అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్ల షెడ్యూల్‌ను రైల్వే శాఖ త్వరలో ప్రకటించనుంది. ఈ మూడు రైళ్లు ప్రారంభం కావడంతో తమిళనాడుకు మొత్తం ఏడు అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో ఒకటి తిరువనంతపురం-తాంబరం మధ్య అధిక ప్రయాణికుల డిమాండ్ ఉన్న మార్గంలో నడుస్తుంది. మిగిలిన రెండు రైళ్లు తమిళనాడు దక్షిణ భాగాన్ని కేరళతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో అనుసంధానిస్తాయి. తిరువనంతపురం నార్త్-చర్లపల్లి రూట్‌లో నడిచే ఈ రైలు (17042/17041) కొల్లం, చెంగన్నూర్, కొట్టాయం, ఎర్నాకుళం టౌన్, త్రిస్సూర్, పాలక్కాడ్, కోయంబత్తూర్, సేలం, జోలార్‌పేట్టై, రేణిగుంట, నెల్లూరు, తెనాలి, గుంటూరు, నల్గొండ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ అమృత్ భారత్ రైళ్లు సాధారణ మెయిల్ ఎక్స్ ప్రెస్, ప్రీమియం రైళ్ల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తూ తక్కువ ఖర్చుతో మెరుగైన సౌకర్యాలు, భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని అందిస్తాయని ఇండియన్ రైల్వే తెలిపింది.

## కమల్ కు టార్చ్... విజయ్‌కు విజిల్

**మొదటిపేజీ తరువాయి...**
విజయ్ కోరుకున్న ప్రాధాన్యత క్రమంలోనే ఈ గుర్తును ఈసీ కేటాయించింది. తన సినిమాల్లోని 'విజిల్ పోడు' అనే మాస్ క్రేజ్‌ను రాజకీయాల్లోనూ క్యాష్ చేసుకునేందుకు ఈ గుర్తు బాగా పనికొస్తుందని విజయ్ వర్గీయులు భావిస్తున్నారు. విజయ్ ఈ ఎన్నికల్లో మొత్తం 234 నియోజకవర్గాల్లోనూ బరిలోకి దిగనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుత తమిళనాడు శాసనసభ పదవీకాలం 2026 మే 10తో ముగియనుంది. అధికార డీఎంకే, ప్రతిపక్ష ఏఐఏడీఎంకే మధ్య ప్రధాన పోరు ఉన్నప్పటికీ, కమల్ హాసన్ మరియు విజయ్ వంటి స్టార్లు ఈసారి ఏ స్థాయిలో ఓట్లను చీల్చుతారో లేదా ప్రభావితం చేస్తారోనన్నది ఆసక్తికరంగా మారింది. గత ఎన్నికల్లో కమల్ ఓటింగ్ శాతాన్ని పెంచుకోగా, ఈసారి విజయ్ ఎంట్రీతో సమీకరణలు పూర్తిగా మారే అవకాశం ఉంది. రాబోయే మే నెలలో ఈ ఇద్దరు హీరోల 'పొలిటికల్ పర్ఫామెన్స్' ఎలా ఉండబోతుందోనని అభిమానులు మరియు రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## రాష్ట్రాల మధ్య భూ పంచాయితీ

**మొదటిపేజీ తరువాయి....**
హైదరాబాద్ కొండాపూర్‌లోని 42.03 ఎకరాల భూమిపై తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి హక్కు లేదని ఏపీ ప్రభుత్వం జనవరి 19, 2026న కోర్టుకు తెలిపింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2005లో అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టం కింద ఈ మిగులు భూమిని కర్నూలుకు చెందిన 'భగవాన్ శ్రీ బాలాసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్'కు కేటాయించి క్రమబద్ధీకరించింది. 2018లో బాలాసాయిబాబా మరణించిన తర్వాత , ఆ ట్రస్ట్ ఆస్తులను ఏపీ ప్రభుత్వం తమ దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చింది. అయితే, 2023లో తెలంగాణ ప్రభుత్వం తమకు సమాచారం లేకుండా రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసి, ఈ భూమిని 'భూపతి ఎస్టేట్స్' అనే ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తోంది. దేవాదాయ శాఖకు చెందిన భూములను హైకోర్టు అనుమతి లేకుండా ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేయడం చట్టవిరుద్ధమని ఏపీ తన వాదనలో పేర్కొంది. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఇచ్చిన లేఖను కూడా ఏపీ ప్రభుత్వం సాక్ష్యంగా సమర్పించింది, దాని ప్రకారం కూడా ఈ భూమి ఏపీ దేవాదాయ శాఖ పరిధిలోకే వస్తుంది. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇప్పటికే ఆదేశించినా విఫలమైనందుకు ఒక్కో పిటిషన్‌కు రూ. 5,000 చొప్పున జరిమానా విధిస్తూ తెలంగాణ ప్రభుత్వానికి చివరి అవకాశం ఇచ్చింది. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఈ ఖరీదైన ఆస్తిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన పట్టు బిగించడంతో, ఈ వివాదం రెండు రాష్ట్రాల మధ్య మరోసారి విభజన సంబంధిత చట్టాలపై చర్చకు దారితీసేలా ఉంది. కోర్టు విచారణలో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే వివరణపైనే ఈ రూ. 4,000 కోట్ల భూమి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

## ట్రంప్ పీస్ బోర్డులో పాక్ - ఇజ్రాయెల్ రచ్చ

**మొదటిపేజీ తరువాయి...**
గాజాలో శాంతి నెలకొనాలంటే ఇస్లామిక్ దేశాల సహకారం తప్పనిసరి అన్నదే ట్రంప్ వ్యూహమని అంటున్నారు. పాకిస్తాన్ ను బోర్డులో చేర్చడం ద్వారా ముస్లిం ప్రపంచానికి సానుకూల సంకేతం పంపాలని అమెరికా భావిస్తున్నట్లు తెలుస్తోంది. విభిన్న అభిప్రాయాలు ఉన్న దేశాలను శాంతి మండలిలో చేర్చితే శాంతి ప్రక్రియకు విశ్వసనీయత పెరుగుతుందన్నది ట్రంప్ ఆలోచనగా చెబుతున్నారు. ఇజ్రాయెల్ అభ్యంతరాలను పక్కన పెట్టి డోనాల్డ్ ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడంపై అంతర్జాతీయంగా మిశ్రమ స్పందన వ్యక్తం అవుతోంది. మధ్యప్రాచ్యంలో గాజా పునర్నిర్మాణం, కాల్పుల విరమణ పర్యవేక్షణ, మానవతా సాయంపై ఈ శాంతి మండలి ప్రత్యేక దృష్టి సారించనుంది. ఈ పీస్ బోర్డ్ గాజాలో కాల్పుల విరమణ అమలు, మానవతా సహాయం, హమాస్ తర్వాత పాలనా వ్యవస్థపై ప్రణాళికలు సిద్ధం చేయనుంది. అమెరికా, ఇజ్రాయెల్, పాకిస్తాన్ తో పాటు పలు అరబ్ దేశాలు శాంతి మండలిలో భాగస్వాములయ్యే అవకాశం ఉంది. ట్రంప్ తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయం గాజా సంక్షోభానికి ముగింపు పలుకనుందా లేక ఇజ్రాయెల్ -అమెరికా సంబంధాల్లో కొత్త ఉద్రిక్తతలకు దారితీయనుందా అన్నది వేచి చూడాల్సిందే.

## అన్నా చెల్లెళ్ల మధ్య విబేధాలు... అస్సాంలో హాట్ టాపిక్

**మొదటిపేజీ తరువాయి...**
'కేరళ వ్యవహారాల్లో ప్రియాంక జోక్యం చేసుకోవడం రాహుల్‌కు ఇష్టం లేదని, నేను 22 ఏళ్లు కాంగ్రెస్‌లో పనిచేశాను. పార్టీ లోపలి విషయాలన్నీ నాకు తెలుసు. కేసీ వేణుగోపాల్, ఆయన వర్గాన్ని ఇబ్బంది పెట్టడం రాహుల్ కోరుకోడు. అందుకే ప్రియాంకను అసోంకి పంపారు. గాంధీ కుటుంబాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్లాప్ కుటుంబమని విమర్శించిన ఆయన, 'నా కుటుంబం వారి కుటుంబం కంటే మెరుగైంది. మేము కష్టాల్లో పెరిగాం' అంటూ శర్మ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అసోం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గోగోయ్‌తో తనకు వ్యక్తిగత వైరం లేదని శర్మ స్పష్టం చేశారు. గోగోయ్, ఆయన భార్యకు పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐతో సంబంధాలున్నాయని తాను గతంలో చేసిన ఆరోపణలపై వివరణ ఇచ్చారు. 'శత్రు దేశానికి సంబంధించిన విషయం తెలిసినప్పుడు కేంద్రానికి సమాచారం ఇవ్వడం నా బాధ్యత. అలా చేయకపోతే రాజ్యాంగానికి, ప్రజలకు ద్రోహం చేసినట్టే. పాకిస్తాన్ మన శత్రు దేశం. దీన్ని సాధారణ అవినీతి ఆరోపణలతో పోల్చలేం' అని శర్మ అన్నారు. 'ఒక గూఢచారిని పట్టుకుంటే, బయటపెట్టకపోతారా?' అని ప్రశ్నించారు. బంగ్లాదేశ్‌తో క్షీణిస్తున్న సంబంధాలపైనా హిమాంత ఆందోళన వ్యక్తం చేశారు. షేక్ హసీనా ప్రభుత్వం సహకారంతోనే అసోంలో తీవ్రవాదాన్ని అదుపు చేయగలిగామని చెప్పారు. అక్కడ ప్రభుత్వం మారి భారత్ పట్ల శత్రుత్వం పెరిగితే ఈశాన్య రాష్ట్రాలకు ముప్పు తప్పదని హెచ్చరించారు. 800 కిలోమీటర్ల సరిహద్దు ఉన్నందున పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. దావోస్‌లో తన తొలి ప్రసంగంలో అసోం అభివృద్ధి ప్రణాళికలను వివరించిన హిమాంత, హైడ్రోకార్బన్లకు మించి సెమీకండక్టర్ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవడమే లక్ష్యమని చెప్పారు. 'అసోం ప్రజల గుర్తింపు, జాతీయ భద్రత మాకు అత్యంత ముఖ్యమైనవి. జనాభా మార్పు పెద్ద ఆందోళన. అభివృద్ధి, గుర్తింపు కోసం మేం పోరాడుతున్నాం' అని అసోం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వ శర్మ స్పష్టం చేశారు.

## ఏపీ సీఎం పై తమిళులు ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి...**
తమిళ నెటిజన్ల ప్రధాన ఆరోపణ ఏమిటంటే, చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో నిర్మిస్తున్న విమానాశ్రయానికి హోసూర్ పోటీగా మారుతుందనే ఉద్దేశంతోనే ఈ ప్రాజెక్టును అడ్డుకున్నారని వారు భావిస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతో, ఈ విమర్శలకు మరింత బలం చేకూర్చేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఆశించిన స్థాయిలో ప్రయాణికులు లేకున్నా కుప్పం ఎయిర్‌పోర్ట్ అవసరమా? అంటూ ప్రశ్నలు సంధిస్తూ, హోసూర్ ప్రాజెక్టు నిలిపివేతకు ఏపీ ప్రభుత్వమే కారణమని ప్రచారం చేస్తున్నారు. అయితే, రక్షణ శాఖ అనుమతి నిరాకరించడం వెనుక పూర్తిగా సాంకేతిక మరియు భద్రతాపరమైన కారణాలు ఉన్నాయని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. హోసూర్ ప్రాంతంలోని గగనతలం ప్రస్తుతం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ నియంత్రణలో ఉండటమే దీనికి ప్రధాన కారణం. రక్షణ రంగ శిక్షణ, విమానాల టెస్టింగ్ మరియు జాతీయ భద్రతా అవసరాల దృష్ట్యా ఈ ప్రాంతంలో పౌర విమానయానానికి అవకాశం లేదని రక్షణ శాఖ తన స్వతంత్ర నిర్ణయాన్ని వెల్లడించింది. అంతేకాకుండా, బెంగళూరు విమానాశ్రయ ఒప్పందం ప్రకారం 150 కిలోమీటర్ల పరిధిలో మరో పౌర విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన కూడా ఒక అడ్డంకిగా మారింది. మరోవైపు, కుప్పం విమానాశ్రయ లక్ష్యం పూర్తిగా భిన్నమైనదని నిపుణులు గుర్తు చేస్తున్నారు. చంద్రబాబు ప్రతిపాదిస్తున్న కుప్పం ప్రాజెక్టు ప్రధానంగా ప్రయాణికుల కోసం కాకుండా, 'అగ్రికల్చరల్ ఎక్స్‌పోర్ట్ హబ్' గా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించినది. కుప్పం పరిసరాల్లో పండే పూలు, కూరగాయలు మరియు పండ్లను విదేశాలకు ఎగుమతి చేయడం దీని ముఖ్య ఉద్దేశం. రక్షణ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆపాదించడం సరికాదని, ఇలాంటి తప్పుడు ప్రచారాలు రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలను దెబ్బతీసే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.



## ఆస్ట్రేలియాలో కాల్పులు..
# ముగ్గురు మృతి

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ఆస్ట్రేలియాలో మరోసారి కాల్పుల మోత మోగింది. న్యూ సౌత్ వేల్స్ రాష్ట్రంలోని లేక్ కార్గేలిగో ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు అధికారులు ప్రకటించారు. ఘటన చోటుచేసుకున్న ప్రాంతంలో ప్రస్తుతం పోలీసుల సహాయక చర్యలు చేపట్టారు. లేక్ కార్గేలిగోలో దాదాపు 1500 మంది నివసిస్తుండగా, ఇలాంటి చిన్న ప్రాంతంలో కాల్పులు జరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కాల్పుల ఘటనలో మృతి చెందిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దుండగులు కాల్పుల తర్వాత అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం అందుతోంది. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. భద్రతా కారణాల దృష్ట్యా స్థానికులు ఇళ్లలోనే ఉండాలని, బయటకు రావద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రాంతం ఆస్ట్రేలియా రాజధాని సిడ్నీకి సుమారు 611 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక గతేడాది డిసెంబర్ 14న సిడ్నీలోని బోండీ బీచ్‌లో జరిగిన కాల్పుల ఘటన ఇంకా దేశాన్ని వెంటాడుతూనే ఉంది. ఆ ఘటన మృతులకు నివాళిగా దేశవ్యాప్తంగా జాతీయ సంతాప దినం పాటిస్తున్న సమయంలోనే తాజాగా మరోసారి కాల్పులు జరగడం ఆందోళన కలిగిస్తోంది. తాజా ఘటన ఉగ్రదాడా లేక వ్యక్తిగత కక్షల నేపథ్యంలో జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఆస్ట్రేలియాలో తరచుగా జరుగుతున్న ఇలాంటి కాల్పుల ఘటనలు ప్రజల భద్రతపై మీమాంస ఏర్పడింది.



## రష్యా- ఉక్రెయిన్- అమెరికా..
# త్రైపాక్షిక భేటీ

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు దిశగా అమెరికా చేస్తున్న ప్రయత్నాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా, ఉక్రెయిన్, అమెరికా తొలిసారిగా త్రైపాక్షిక సమావేశానికి సిద్ధమయ్యాయి. యూఏఈ వేదికగా జరగనున్న ఈ భేటీలో మూడు దేశాల ఉన్నతస్థాయి ప్రతినిధులు పాల్గొననున్నారు. శుక్రవారం నుంచి రెండు రోజులపాటు ఈ సమావేశం జరుగుతుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీ దావోస్ వేదికగా ప్రకటించారు. శాంతి ఒప్పందం దిశగా ముందుకెళ్లాలంటే ఉక్రెయిన్ మాత్రమే కాకుండా రష్యా కూడా రాజీకి సిద్ధంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కీలక భేటీకి ముందు దావోస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జెలెన్స్కీలు ద్వైపాక్షికంగా సమావేశమయ్యారు. ఈ సమావేశం చాలా సానుకూలంగా జరిగిందని ట్రంప్ వెల్లడించారు. ''ఈ యుద్ధం తప్పకుండా ముగియాలి. ఇప్పటికే అపారమైన ప్రాణనష్టం జరిగింది. కేవలం గత నెలలోనే 30 వేలమంది చనిపోయారు. అందులో ఎక్కువమంది సైనికులే. ఈ యుద్ధం కొనసాగితే అది మనందరికీ అవమానకరం'' అంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఉద్దేశించి ట్రంప్ వ్యాఖ్యానించారు. త్వరలోనే అమెరికా బృందం పుతిన్‌తో కూడా భేటీ అవుతుందని తెలిపారు. ట్రంప్‌తో భేటీ ఉక్రెయిన్‌కు అనుకూలంగా సాగిందని జెలెన్స్కీ చెప్పారు. యుద్ధాన్ని ముగించేందుకు అవసరమైన ఒప్పంద పత్రాలు దాదాపు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. మరోవైపు ఐరోపా దేశాల వైఖరిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాంతీయ భద్రత విషయంలో ఐరోపా దేశాలు ఇంకా స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవడం లేదని విమర్శించారు. గత ఏడాది దావోస్ సదస్సులోనే ''ఐరోపా తనను తాను ఎలా రక్షించుకోవాలో తెలుసుకోవాలి'' అని చెప్పానని, ఏడాది గడిచినా పరిస్థితిలో పెద్ద మార్పు లేదని జెలెన్స్కీ వ్యాఖ్యానించారు. తక్షణమే కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.



## ముసెవెని విజయం..
# దేశవ్యాప్తంగా హింస

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ఉగాండాలో గత వారం జరిగిన ఎన్నికల తర్వాత చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలకు సంబంధించి ఆ దేశ ప్రతిపక్ష నేత బాబీ వైన్ సన్నిహిత సహచరుడు, ఎంపీ మువాంగా కివుంబీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేషనల్ యూనిటీ ప్లాట్‌ఫారమ్ డిప్యూటీ లీడర్‌గా ఉన్న కివుంబీపై ఎన్నికల అక్రమాలకు పాల్పడటంతో పాటు పోలీస్ స్టేషన్లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలపై దాడులు నిర్వహించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ హింసాత్మక ఘటనల్లో ఏడుగురు మరణించినట్లు పోలీసులు ధృవీకరించగా, ఎంపీ కివుంబీ మాత్రం భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. ఎన్నికల ఫలితాల కోసం వేచి చూస్తున్న సమయంలో తన నివాసం వద్దే 10 మందిని కాల్చి చంపారని ఆయన ఆరోపించారు. కాగా, కివుంబీని త్వరలోనే కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఉగాండా పోలీస్ ఫోర్స్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడు యోవేరి ముసెవెని వరుసగా ఏడోసారి విజయం సాధించారు. అయితే ఈ ఫలితాలను ప్రతిపక్ష నేత బాబీ వైన్ "ఫేక్" అని కొట్టిపారేశారు. ఎన్నికల్లో భారీగా రిగ్గింగ్ జరిగిందని ఆయన ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం బాబీ వైన్ తన ప్రాణాలకు ముప్పు ఉందని అజ్ఞాతంలోకి వెళ్లారు. దేశవ్యాప్తంగా సామాన్యులను లక్ష్యంగా చేసుకుని సామూహిక హత్యాకాండ జరుగుతోందని, వందకు పైగా ప్రతిపక్ష కార్యకర్తలు మరణించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉగాండా ఆర్మీ చీఫ్ , ముసెవెని కుమారుడు జనరల్ ముహూజీ కైనెరుగాబా మాట్లాడుతూ.. భద్రతా దళాలు 22 మంది ప్రతిపక్ష మద్దతుదారులను హతమార్చినట్లు అంగీకరించారు. 1986లో తిరుగుబాటు నేతగా అధికారంలోకి వచ్చిన ముసెవెని, తాజా విజయం ద్వారా 2031 నాటికి 45 ఏళ్ల సుదీర్ఘ పాలనను పూర్తి చేసుకోనున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఉగాండాలో ఒక్కసారి కూడా శాంతియుతంగా అధికార మార్పిడి జరగకపోవడం గమనార్హం.

# 'బోర్డ్ ఆఫ్ పీస్'లో 8 ఇస్లామిక్ దేశాలు చేరిక..?

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



పాక్ సహా ఎనిమిది ఇస్లామిక్ దేశాలు 'గాజా శాంతిమండలి' లో చేరేందుకు రంగం సిద్ధమైంది. గాజా యుద్ధానికి ముగింపు పలికి, పశ్చిమాసియాలో శాంతిని పునరుద్ధరించాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 'బోర్డ్ ఆఫ్ పీస్'లో చేరేందుకు అంగీకారం తెలిపాయి. బుధవారం ఈ దేశాల విదేశాంగ మంత్రులు సంయుక్త ప్రకటన విడుదల చేస్తూ , ట్రంప్ చేరిక ఆహ్వానాన్ని స్వాగతిస్తున్నట్లు ఇస్లామిక్ దేశాలు వెల్లడించాయి. ఈ నిర్ణయం అంతర్జాతీయ రాజకీయాల్లో మరో కీలక పరిణామంగా మారింది. శాంతి మండలిలో చేరేందుకు అంగీకరించిన దేశాల్లో ఖతార్, తుర్కియే, ఈజిప్ట్, జోర్డాన్, ఇండోనేషియా, పాకిస్తాన్ , సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉన్నాయి. గాజాలో కొనసాగుతున్న యుద్ధానికి శాశ్వత ముగింపు పలికేందుకు జరుగుతున్న అంతర్జాతీయ శాంతి ప్రయత్నాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈ దేశాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే ఈజిప్ట్, పాకిస్తాన్ , యూఏఈలు అధికారికంగా బోర్డులో చేరేందుకు తమ అంగీకారాన్ని ట్రంప్‌కు తెలిపాయి. మిగిలిన దేశాలు తమ దేశీయ చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి త్వరలోనే అధికారికంగా చేరనున్నట్లు ప్రకటించాయి. ట్రంప్ నేతృత్వంలో ఏర్పాటవుతున్న ఈ శాంతి బోర్డు పశ్చిమాసియాలో భద్రతను బలోపేతం చేస్తుందని ఎనిమిది దేశాల విదేశాంగ మంత్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేవలం యుద్ధానికి స్వస్తి పలకడమే కాకుండా, ఈ ప్రాంతాన్ని ఆర్థికంగా నిలబెట్టేందుకు కూడా ఈ బోర్డు దోహదపడుతుందని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించడం, భారీ నిధులను సమీకరించడం ద్వారా గాజా పునర్నిర్మాణానికి పునాది వేయాలన్నదే ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యంగా తెలిపారు. హమాస్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత గాజాలో తాత్కాలిక పరిపాలనా యంత్రాంగంగా ఈ బోర్డు పనిచేయనుంది. యుద్ధంతో ధ్వంసమైన మౌలిక సదుపాయాలను పునర్నిర్మించడం, పాలనా వ్యవస్థను చక్కదిద్దడం, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 2803కు అనుగుణంగా శాశ్వత శాంతిని నెలకొల్పడం వంటి బాధ్యతలను ఈ బోర్డు చేపట్టనుంది. ఈ చర్యలు పశ్చిమాసియాలో స్థిరత్వానికి దోహదపడతాయని ఇస్లామిక్ దేశాలు అభిప్రాయపడ్డాయి. ఇదిలా ఉండగా, బోర్డ్ ఆఫ్ పీస్‌లో చేరడంపై పాకిస్తాన్ విదేశాంగ శాఖ ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది. ట్రంప్ పంపిన ఆహ్వానాన్ని ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకరించినట్లు వెల్లడించింది. ఈ బోర్డు ద్వారా యుద్ధానికి పూర్తిస్థాయిలో స్వస్తి పలకడం, పాలస్తీనియన్లకు మానవతా సహాయాన్ని పెంచడం, ధ్వంసమైన మౌలిక వసతులను తిరిగి నిర్మించడం సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. 1967కు ముందు సరిహద్దులతో, అల్‌ఖుద్స్ అల్‌షరీఫ్ రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడాలన్న తన పాత డిమాండ్‌ను మరోసారి పునరుద్ఘాటించింది. శాంతిమండలిలో చేరేందుకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కూడా అంగీకరించారు. తుర్కియే వంటి ప్రత్యర్థి దేశాలకు బోర్డులో చోటు కల్పించడంపై ఆయన కార్యాలయం అభ్యంతరం వ్యక్తం చేసింది. అదే సమయంలో నెతన్యాహు భాగస్వామ్యం వల్ల బోర్డు నిష్పాక్షికతపై సందేహాలు తలెత్తుతున్నాయని కొన్ని ఇస్లామిక్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రతిపాదించిన బోర్డ్ ఆఫ్ పీస్ పశ్చిమాసియా రాజకీయాల్లో ఎలాంటి మార్పులు తీసుకొస్తుందో అన్న అంశం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిగా మారింది.

# భారత్‌తో ఈయూ అజెండా

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

భారత్ పర్యటనకు ముందు ఒక సమగ్ర, చారిత్రక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని యూరోపియన్ యూనియన్ సంచలన వ్యాఖ్యలు చేసింది. రాబోయే ఈయూ బృందం భారత్ పర్యటనలోనే ఈ ఒప్పందం ఖరారయ్యే సూచనలు కనిపిస్తున్నాయని ఈయూ విదేశాంగ, భద్రతా విధానాల ప్రతినిధి కాజా కల్లాస్ పేర్కొన్నారు. యూరోపియన్ పార్లమెంట్‌లో మాట్లాడిన ఆమె, భారత్-ఈయూ సంబంధాలు కొత్త దశకు చేరుకోబోతున్నాయని తెలిపారు. భారత్-ఈయూ మధ్య 16వ శిఖరాగ్ర సమావేశం ఢిల్లీలో జరగనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథులుగా యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియా కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లియన్ భారత్‌కు రానున్నారు. ఈ పర్యటనలోనే భారత్-ఈయూ వ్యూహాత్మక అజెండాను ఆమోదించే అవకాశం ఉంది. అందుకే కాజా కల్లాస్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ, దౌత్య వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ''భారత్‌తో పటిష్టమైన, నూతన వాణిజ్య అజెండాను అమలు చేయడానికి యూరప్ సిద్ధంగా ఉంది. భారత్‌తో భద్రత, రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఈయూ నిర్ణయించింది. సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం, సైబర్ సెక్యూరిటీ వంటి కీలక రంగాల్లో సహకారాన్ని విస్తరించే ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. వచ్చే వారం ఢిల్లీలో జరిగే ఈయూ-ఇండియా సమ్మిట్ లో ఈ ఒప్పందంపై సంతకాలు చేసే అవకాశాన్ని ఎదురుచూస్తున్నాం'' అని కాజా కల్లాస్ వెల్లడించారు. ఇదే సమయంలో భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాండెర్ లియన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్-ఈయూ మధ్య కుదిరే వాణిజ్య ఒప్పందం చివరి దశకు చేరుకుందని, దీన్ని 'అన్ని ఒప్పందాలకు తల్లి'గా కొందరు అభివర్ణిస్తున్నారని ఆమె గుర్తుచేశారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ ఒకటి రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ''మేం చారిత్రక వాణిజ్య ఒప్పందానికి అంచున ఉన్నాం. ఈ ఒప్పందం ద్వారా 2 బిలియన్ జనాభా గల మార్కెట్ ఏర్పడుతుంది. ఇది ప్రపంచ జీడీపీలో దాదాపు 25 శాతానికి సమానం. ఒప్పందానికి సంబంధించి ఇంకా కొంత పని మిగిలి ఉంది. వచ్చే వారంలో భారత్‌కు వస్తున్నాను. ఈ పర్యటనలో వాణిజ్య ఒప్పందంతో పాటు భారత్-యూరప్ ఆర్థిక, వ్యూహాత్మక సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే నా లక్ష్యం'' అని వాండెర్ లియన్ స్పష్టం చేశారు. జనవరి 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు ఈయూ అగ్రనేతలు భారత్‌లో పర్యటించనున్నారు.



జనవరి 27న జరిగే 16వ భారత్-ఈయూ సమ్మిట్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో విస్తృత చర్చలు జరపనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కూడా సమావేశం కానున్నారు. 2004 నుంచి భారత్-ఈయూ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోంది. ఇప్పటివరకు 15 శిఖరాగ్ర సమావేశాలు జరిగాయి. 17 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ మెగా ఎఫ్‌టీఏ ఈదఫా కుదిరితే , అది ప్రపంచంలోనే అతిపెద్ద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో ఒకటిగా చరిత్రలో నిలిచే అవకాశముందని దౌత్య వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

# ట్రంప్ ఏడాది పాలన.. భారత్‌కు లాభమా? నష్టమా?


**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. 'అమెరికా ఫస్ట్' నినాదంతో సాగుతున్న ట్రంప్ 2.0 పాలన భారత్‌కు అనుకూలమా.. ప్రతికూలమా అన్న అంశంపై రాజకీయ, ఆర్థిక వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీతో ట్రంప్‌కు వ్యక్తిగత స్నేహం ఉన్నప్పటికీ, విధానాల పరంగా మాత్రం భారత్‌కు మిశ్రమ ఫలితాలే ఎదురయ్యాయి. ఈ ఏడాది ట్రంప్ పాలనలో ప్రధానంగా 'టారిఫ్ వార్' కొనసాగింది. భారత్‌ను 'టారిఫ్ కింగ్'గా అభివర్ణించిన ట్రంప్, భారతీయ ఎగుమతులపై 25 నుంచి 50 శాతం వరకు అదనపు సుంకాలు విధించారు. ముఖ్యంగా వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, ఐటీ సేవల రంగాలు తీవ్రంగా నష్టపోయాయి. రష్యా నుంచి చమురు దిగుమతుల అంశంలో భారత్‌పై పెనాల్టీలు విధిస్తామని హెచ్చరించడం రెండు దేశాల మధ్య దౌత్య ఉద్రిక్తతలకు దారి తీసింది. అమెరికాలో నివసిస్తున్న భారతీయులకు ఈ ఏడాది గడ్డు కాలంగా మారింది. H1B వీసా నిబంధనలను కఠినతరం చేయడం, కనీస వేతన పరిమితిని పెంచడం వల్ల భారతీయ ఐటీ నిపుణుల నియామకాలు తగ్గాయి. అక్రమ వలసల పేరుతో వేలాది మంది భారతీయులను వెనక్కి పంపడం ప్రవాసుల్లో ఆందోళన పెంచింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో భారత్ ఇంధన అవసరాలను ట్రంప్ ప్రభుత్వం చివరకు అర్థం చేసుకుంది. మరోవైపు పారిస్ పర్యావరణ ఒప్పందంపై అమెరికా వైఖరి మారడం గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులపై ప్రభావం చూపింది. పాకిస్తాన్ తో ట్రంప్ స్నేహం భారత్‌కు మింగుడుపడని అంశంగా మారింది. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. చైనాను అడ్డుకునే విషయంలో మాత్రం భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం బలంగానే కొనసాగుతోంది. 'క్వాడ్' కూటమి ద్వారా ఇండోపసిఫిక్ ప్రాంతంలో రక్షణ సహకారం కొనసాగుతోంది. మొత్తంగా ట్రంప్ తొలి ఏడాది పాలన భారత్‌తో సంబంధాలను స్నేహం కంటే లావాదేవీల దిశగా మళ్లించింది. ఇది భారత్‌కు ఒకవైపు అవకాశంగా, మరోవైపు సవాల్‌గా మారింది.

# చంద్రుడిపై హోటల్.. బుకింగ్స్ స్టార్ట్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



చంద్రమండలంలో అమెరికాకు చెందిన ఓ స్టార్టప్ కంపెనీ జాబిలీ పై ఏకంగా హోటల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కాలిఫోర్నియాకు చెందిన 'గెలాక్సీ రిసోర్స్ యుటిలైజేషన్ స్పేస్' గతేడాది ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రకటించింది. చంద్ర పర్యాటకాన్ని లూనార్ ఎకానమీకి తొలి అడుగుగా భావిస్తున్న ఈ సంస్థ , సైన్స్ ఫిక్షన్‌గా కనిపించిన ఆలోచనలను వాస్తవంగా మార్చే దిశగా ముందుకెళ్తోంది. హోటల్ నిర్మాణమే కాదు.. ఇప్పటికే బుకింగ్స్ కూడా ప్రారంభించడం విశేషం. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం చంద్రుడిపై హోటల్ రిజర్వేషన్ ధరలు రూ.2.2 కోట్ల నుంచి రూ.9 కోట్ల వరకు ఉంటాయి. అయితే ఇది కేవలం హోటల్ స్టే ఖర్చు మాత్రమే. భూమి నుంచి చంద్రుడికి వెళ్లి తిరిగి వచ్చే మొత్తం ప్రయాణ వ్యయం రూ.90 కోట్లను దాటే అవకాశం ఉందని కంపెనీ అంచనా వేస్తోంది. దీనితో పాటు తిరిగి చెల్లించని వెయ్యి డాలర్ల దరఖాస్తు ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది. అయితే డబ్బు ఉంటే సరిపోదు. చంద్రయాత్రకు వెళ్లాలనుకునేవారికి కఠినమైన అర్హత ప్రమాణాలు విధించారు. ప్రయాణికులపై గట్టి బ్యాక్‌గ్రౌండ్ చెకింగ్‌తో పాటు శారీరక, మానసిక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. అంతరిక్ష ప్రయాణానికి వారు పూర్తిగా సిద్ధంగా ఉన్నారని నిర్ధారించిన తర్వాతనే అనుమతి ఇస్తారు. మరోవైపు చంద్రుడిపై హోటల్ నిర్మాణానికి భూమి నుంచి ఇటుకలు తీసుకెళ్లడం లేదు. చంద్రుడిలోనే లభించే ధూళిని ప్రత్యేక సాంకేతికతతో ఇటుకలుగా మార్చి, రేడియేషన్, తీవ్ర ఉష్ణోగ్రతలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టనున్నారు. 2029 నాటికి తొలి పేలోడ్ ద్వారా ఈ సాంకేతికతను అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది కేవలం అంతరిక్ష పర్యాటకం మాత్రమే కాదని, భూమికి ప్రత్యామ్నాయంగా చంద్రుడిపై నివాసయోగ్యమైన వాతావరణాన్ని ఏర్పరచే తొలి ప్రయత్నమని జీఆర్‌యూ స్పేస్ స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుతో ఆర్థిక స్తోమతతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం ఉన్న సాధారణ ప్రజలు కూడా చంద్రుడిపై కాలు మోపే అరుదైన అనుభూతిని పొందే అవకాశం ఉందని కంపెనీ వెల్లడించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తున్న ఈ కాలంలో.. చంద్రుడిపై కాలు మోపడం మాత్రమే కాదు, అక్కడ జీవనం ఏర్పాటు చేయడం కూడా అసాధ్యం కాదన్న స్థాయికి శాస్త్రసాంకేతికత చేరుకుంది. భూమి కాకుండా మనిషి ఎక్కడ జీవించగలడన్న దానిపై దశాబ్దాలుగా సాగుతున్న పరిశోధనల్లో , చంద్రుడిపై నివాసానికి అనుకూలమైన అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు ఇప్పటికే గుర్తించారు. చంద్రమండలంపై నీరు, ఖనిజ వనరుల అన్వేషణ కొనసాగుతున్న వేళ , ఇప్పుడు అక్కడ పర్యాటకానికి తెరలేపే ప్రయత్నాలు మొదలయ్యాయి.



## అగ్రరాజ్యాన్ని
# వెనక్కి నెట్టిన డ్రాగన్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

సాంకేతిక ప్రపంచంలో ఆధిపత్యాన్ని మరింత బలంగా చాటుకునే దిశగా చైనా శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే 5జీ రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహిస్తున్న డ్రాగన్ దేశం, ఇప్పుడు 6జీ నెట్‌వర్క్ దిశగా మరో కీలక ముందడుగు వేసింది. ప్రపంచ దేశాల కంటే ముందే 6జీ ట్రయల్స్ లో తొలి దశను విజయవంతంగా పూర్తి చేసిన చైనా, తాజాగా రెండో దశ పరీక్షలను కూడా ప్రారంభించింది. చైనా పరిశ్రమ, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, తొలి దశ 6జీ ట్రయల్స్‌లో 300కు పైగా కీలక సాంకేతికతలను భద్రపరిచారు. ఈ విజయంతో దేశంలోని కమ్యూనికేషన్ రంగం మరింత బలోపేతం కానుంది. ప్రస్తుతం చైనా నిర్మించిన సమాచార మౌలిక సదుపాయాలు ప్రపంచంలోనే అతిపెద్దవిగా నిలుస్తున్నాయి. దేశవ్యాప్తంగా 4.83 మిలియన్లకు పైగా 5జీ బేస్ స్టేషన్లు పనిచేస్తుండగా, 5జీ వినియోగదారుల సంఖ్య 1.2 బిలియన్లను దాటింది. అంతేకాదు, ప్రపంచవ్యాప్తంగా 5జీకి సంబంధించిన పేటెంట్లలో 42 శాతం వాటా ఒక్క చైనాదే కావడం విశేషం. మొదటి దశ విజయంతో ఉత్సాహం పొందిన చైనా, ఇప్పుడు రెండో దశ ట్రయల్స్‌లో కేవలం వేగంపైనే కాకుండా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా 6జీ వినియోగాన్ని విస్తరించే 'ఇండస్ట్రీ ఎకోసిస్టమ్' నిర్మాణంపై దృష్టి పెట్టింది. తయారీ, వైద్యం, రవాణా, రక్షణ రంగాల్లో 6జీ వినియోగానికి మార్గం సుగమం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దూకుడు చూస్తుంటే, అమెరికా, భారత్‌ల కంటే ముందే చైనా 6జీని వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా 2030 నాటికి 6జీ సేవలు ప్రారంభమవుతాయని నిపుణుల అంచనా. అయితే చైనా ప్రయత్నాలు చూస్తే అంతకంటే ముందే అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం కన్పిస్తోంది. డేటా వేగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికే 6జీ పోరులో అగ్రరాజ్యం అమెరికాను చైనా నిజంగానే వెనక్కి నెడుతుందా..? భారత్ కు పెను సవాల్ గా మారిన ఈ పోటీలో ఎలా నిలుస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.



## ఈయూపై
# వెనక్కి తగ్గిన అమెరికా

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

గ్రీన్‌లాండ్ వ్యవహారంలో యూరోపియన్ దేశాల నుంచి మద్దతు లభించలేదన్న కారణంతో ఈయూపై భారీ సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , అనూహ్యంగా ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రెట్టేతో జరిగిన ద్వైపాక్షిక సమావేశం తర్వాత గురువారం ఈ కీలక ప్రకటన చేశారు. గ్రీన్‌లాండ్ అంశంలో తొందరపాటు అవసరం లేదన్న అవగాహన ట్రంప్‌కు వచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో ఇంతకు ముందు చూపిన దూకుడును తగ్గించినట్లు తెలుస్తోంది. గ్రీన్‌లాండ్, డెన్మార్క్ ప్రజలంటే తనకు గౌరవం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత గ్రీన్‌లాండ్‌ను డెన్మార్క్ కు అప్పగించామని, అయితే వ్యూహాత్మకంగా అది అమెరికాకు అత్యంత కీలక ప్రాంతమని వ్యాఖ్యానించారు. ఇది అమెరికా, రష్యా, చైనా మధ్య కీలక భౌగోళిక స్థానం కలిగి ఉందని, అరుదైన ఖనిజాల కోసమే కాదు , జాతీయ భద్రత కోసమే అవసరమని స్పష్టం చేశారు. బలవంతంగా స్వాధీనం చేసుకునే ఉద్దేశం లేదని, ఈ అంశంపై చర్చలు జరపాల్సిన అవసరం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈయూపై విధించిన సుంకాలను కూడా వెనక్కి తీసుకుంటున్నట్లు ట్రంప్ వెల్లడించారు. నాటో చీఫ్ మార్క్ రెట్టేతో చర్చలు సానుకూలంగా జరిగాయని ట్రూత్ సోషల్ వేదికగా పోస్ట్ చేశారు. గ్రీన్‌లాండ్, ఆర్కిటిక్ ప్రాంతాలపై ఒక ఫ్రేమ్‌వర్క్ రూపొందించామని, అది అమలులోకి వస్తే అమెరికాతో పాటు నాటో మిత్రదేశాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అందుకే ఫిబ్రవరి 1 నుంచి టారిఫ్‌లు అమల్లోకి రావని స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్‌కు సంబంధించిన 'గోల్డెన్ డోమ్' నిర్మాణంపై చర్చలు కొనసాగుతున్నాయని, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్‌లు ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. ట్రంప్ నిర్ణయాన్ని డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లోకే రాస్ముస్సేన్ స్వాగతించారు. డోనాల్డ్ ట్రంప్ దూకుడుకు ఈయూ గట్టిగా కౌంటర్ ఇచ్చింది. అమెరికాతో ట్రేడ్ డీల్‌కు సంబంధించిన ప్రక్రియను ఈయూ పార్లమెంట్ ఫ్రీజ్ చేసింది. డీల్‌లో భాగంగా అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు ఎత్తివేయాల్సిన ఓటింగ్‌ను నిలిపివేసింది. దీంతో వాణిజ్య ఒప్పందం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.



## భారత్ ఎంబసీపై
# ఖలిస్థానీ విధ్వంసం

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ఐరోపా దేశమైన క్రొయేషియాలో ఖలిస్థానీ వేర్పాటువాదులు దుశ్చర్యకు పాల్పడ్డారు. రాజధాని జాగ్రెబ్‌లోని భారత రాయబార కార్యాలయంలోకి చొరబడి విధ్వంసం సృష్టించినట్లు సమాచారం. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐరోపా కూటమి ప్రతినిధులు త్వరలో భారత్‌లో పర్యటించనున్న తరుణంలో ఈ ఘటన జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఘటనను భారత విదేశాంగశాఖ ఖండించింది. ''భారత వ్యతిరేక శక్తులు మా రాయబార కార్యాలయంలోకి చొరబడి విధ్వంసానికి పాల్పడిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. వియన్నా ఒప్పందం ప్రకారం దౌత్య ప్రాంగణాల భద్రతను ఆయా దేశాలు కట్టుదిట్టంగా నిర్వహించాలి. ఈ వ్యవహారాన్ని క్రొయేషియా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరాం'' అని విదేశాంగశాఖ ప్రకటనలో తెలిపింది. ఇటువంటి ఘటనలు వాటి వెనుక ఉన్న వ్యక్తుల ఉద్దేశాలను స్పష్టంగా తెలియజేస్తాయని భారత్ పేర్కొంది. ఇదే తరహాలో గతంలో కెనడా, బ్రిటన్, అమెరికా వంటి దేశాల్లోనూ ఖలిస్థానీ వేర్పాటువాదులు భారత దౌత్య కార్యాలయాలపై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలను భారత్ పదే పదే ఖండించింది. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కెనడా నాలుగు దశాబ్దాలుగా విఫలమవుతోందని అక్కడి భారత హైకమిషనర్ దినేశ్ పట్నాయక్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత్‌పై కెనడా చేస్తున్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. అంతర్జాతీయంగా ఖలిస్థానీ కార్యకలాపాలపై కఠిన చర్యలు అవసరమని భారత్ స్పష్టం చేసింది.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
శుక్రవారం | హైదరాబాద్
23.01.2026
www.manasarkar.com



# వైద్య విద్యలో హైటెక్ నిఘా

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య విద్యా రంగంలో పారదర్శకతను పెంపొందించేందుకు మరియు పరీక్షల నిర్వహణలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఒక కీలక అడుగు వేసింది. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్'ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన వైద్య విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సాంకేతికత సాయంతో విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 37 వైద్య విద్యా కళాశాలల్లో జరిగే పరీక్షలను నిరంతరం పర్యవేక్షించవచ్చని మంత్రి వివరించారు. పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ లేదా మాల్ ప్రాక్టీస్ వంటి అవాంఛనీయ ఘటనలు జరిగితే, ఈ సెంటర్ ద్వారా తక్షణమే గుర్తించి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. నిత్య జీవితంలో సాంకేతికత కీలక భూమిక పోషిస్తోందని, విద్యార్థులు తమ ప్రతిభతో ఉన్నత ప్రమాణాలతో వైద్యులుగా ఎదగాలనే ఉద్దేశంతోనే ఈ పటిష్టమైన నిఘా వ్యవస్థను తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. సాంకేతికపరమైన అంశాలను వివరిస్తూ, పరీక్షా కేంద్రాల్లో హైక్వాలిటీ చిత్రీకరణ జరుగుతుందని, ఈ డేటాను సుమారు 70 రోజుల పాటు భద్రపరుచుకునే వెసులుబాటు ఉందని మంత్రి తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన అత్యాధునిక నిఘా వ్యవస్థ కారణంగా, గతంలో పరీక్షల పర్యవేక్షణ కోసం క్షేత్రస్థాయిలో అవసరమయ్యే సిబ్బంది సంఖ్య కూడా గణనీయంగా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల మానవ వనరుల వినియోగం తగ్గుతూనే, పర్యవేక్షణలో కచ్చితత్వం పెరుగుతుందని వివరించారు. ప్రస్తుతానికి ప్రయోగాత్మకంగా 5 వైద్య విద్యా కళాశాలలను ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిధిలోకి తీసుకువచ్చామని, భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు ఈ సేవలను విస్తరిస్తామని మంత్రి వెల్లడించారు. అంతేకాకుండా, త్వరలోనే ఆయుష్ మరియు నర్సింగ్ కళాశాలలను కూడా ఈ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ పరిధిలోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. వైద్య విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి సేవ చేసేలా తీర్చిదిద్దేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఏపీలో 'గాంధీ సందేశ యాత్ర'

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవం కోసం కసరత్తు ప్రారంభించింది. ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రఘువీరారెడ్డి నేతృత్వంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు 'గాంధీ సందేశ యాత్ర' పేరుతో పాదయాత్ర చేపట్టాలని గురువారం నిర్ణయించింది. ఈ కార్యక్రమం ద్వారా అట్టడుగు స్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం నింపి, పార్టీని మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది.కాంగ్రెస్ హయాంలో ప్రవేశపెట్టిన పథకాల గుర్తులను తుడిచివేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును తొలగించిందని ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది కేవలం పేరు మార్పు మాత్రమే కాదని, దేశ పితను అగౌరవపరచడమేనని వారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకుని పాత పేరును కొనసాగించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నెల 28న ప్రారంభం కానున్న ఈ పాదయాత్రలో పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. చాలా కాలంగా స్తబ్దుగా ఉన్న పార్టీని ఈ యాత్ర ద్వారా మళ్లీ క్రియాశీలం చేయడమే కాకుండా, ప్రజల పక్షాన నిలబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది.



# మంగళగిరిలో కి'లేడీ' గుట్టురట్టు

### జనసేన నాయకురాలినని నమ్మించి లక్షల్లో వసూళ్లు

**మంగళగిరి (ఏడీఎన్ఎన్) :**

జనసేన పార్టీ పేరును , రాష్ట్రస్థాయి ఉన్నత పోలీసు అధికారుల హోదాలను అడ్డం పెట్టుకుని భారీ ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న మోదుగు సుమలత అనే మహిళపై మంగళగిరి పట్టణ , రూరల్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నిందితురాలు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. తనకు రాజకీయ పలుకుబడి ఉందని, డీజీపీ స్థాయి అధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని మాయమాటలు చెబుతూ ఆమె పలువురిని మోసం చేసినట్లు విచారణలో తేలింది. పాత మంగళగిరికి చెందిన వై. నాగరాజు అనే వ్యక్తిపై గతంలో బంగారం విషయంలో ఒక ఫిర్యాదు నమోదైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న సుమలత, తనకు డీజీపీ , స్థానిక సీఐలు బాగా తెలుసని, కేసు నుంచి బయటపడేస్తానని నమ్మి పలికింది. అధికారులకు లంచం ఇవ్వాలనే సాకుతో అతని వద్ద నుండి సుమారు రూ. 1.83 లక్షలు వసూలు చేసింది. అయితే, నాగరాజు తన సమస్యను స్వర్ణకార సంఘం ద్వారా స్వయంగా పరిష్కరించుకున్న తర్వాత సుమలత మోసాన్ని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. ఈమె మోసాలు ఇంతటితో ఆగలేదు. మంగళగిరి మండలం బేతపూడికి చెందిన సాంబయ్య అనే వ్యక్తిని కూడా నమ్మించి రూ. 1.13 లక్షలు తీసుకుని మోసగించినట్లు గత నెలలోనే రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అంతేకాకుండా, గుంటూరుకు చెందిన స్వర్ణలత అనే మహిళకు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఆమె దగ్గర కూడా భారీగా నగదు వసూలు చేసినట్లు మరో ఫిర్యాదు అందింది. ఇలా ఒక్కొక్కరిని ఒక్కో రకమైన మాయమాటలతో బురిడీ కొట్టించడంలో సుమలత ఆరితేరినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం పోలీసులు సుమలతపై చీటింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. జనసేన నాయకురాలినని చెప్పుకుంటూ ఆమె ఇంకా ఎంతమందిని మోసం చేసిందనే కోణంలో సమగ్ర విచారణ జరుపుతున్నారు. రాజకీయ పార్టీల పేర్లు లేదా అధికారుల పేర్లు చెప్పి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ప్రజలు నమ్మవద్దని, వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

# సోషల్ మీడియాపై వయసు పరిమితి?

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**



ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియా వినియోగం పెరిగిపోతున్న తరుణంలో, దానివల్ల కలిగే అనర్థాల నుంచి చిన్న పిల్లలను కాపాడేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. స్విట్జర్లాండ్‌లోని డావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొన్న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, సోషల్ మీడియా నియంత్రణపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించకుండా కఠినమైన నిషేధాన్ని అమలు చేస్తోంది. ఈ విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసే అంశంపై ప్రభుత్వం సీరియస్ గా ఆలోచిస్తోందని మంత్రి తెలిపారు. "ఒక నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్నవారు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఉండకూడదని మేము భావిస్తున్నాము. ఆస్ట్రేలియాలో అమలు చేస్తున్న చట్టాలను, అక్కడి పరిస్థితులను మేము ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నాము," అని లోకేశ్ వెల్లడించారు. మన దేశంలో కూడా సోషల్ మీడియా ప్రభావంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యువత సోషల్ మీడియా అవసరమని వాదిస్తుండగా, పెద్దలు మాత్రం అందులోని కంటెంట్‌పై కఠిన నిబంధనలు ఉండాలని కోరుతున్నారు. అయితే, చిన్న పిల్లల విషయంలో మాత్రం సోషల్ మీడియా హానికరంగా మారుతోందన్న ఆందోళన అన్ని వర్గాల్లోనూ కనిపిస్తోంది. సైబర్ వేధింపులు, అశ్లీల కంటెంట్, మానసిక ఒత్తిడి వంటి సమస్యల నుంచి పిల్లలను రక్షించాలంటే వయసు పరిమితి తప్పనిసరనే డిమాండ్ వినిపిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే చిన్న పిల్లల రక్షణ కోసం ప్రత్యేకంగా వయసు పరిమితి నిబంధనను తీసుకురావాలని భావిస్తోంది. త్వరలోనే దీనిపై నిపుణుల కమిటీతో చర్చించి, ఒక నివేదికను రూపొందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# పార్లమెంట్‌లో ఏపీ గళం వినిపించండి

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై పార్లమెంట్ ఉభయ సభల్లో రాజీలేని పోరాటం చేయాలని వైసీపీ ఎంపీలకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన అధ్యక్షతన గురువారం జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలకు భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను జాతీయ స్థాయిలో చాటిచెప్పే బాధ్యత ఎంపీలదేనని, ప్రజల పక్షాన నిలబడి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, గత ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మారుస్తూ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తున్న తీరును పార్లమెంట్ వేదికగా ఎండగట్టాలని ఆదేశించారు. యువత, మహిళలు, కార్మికుల సమస్యలపై కూడా గళమెత్తాలని కోరారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా పడిపోయిందని, "రెడ్ బుక్ పాలన" ముసుగులో రాజకీయ కక్ష సాధింపు చర్యలు మితిమీరిపోయాయని జగన్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులపై కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఇటీవల పిన్నెల్లి గ్రామంలో దళిత కార్యకర్త మందా సల్మాన్ హత్య ఉదంతాన్ని తీవ్రంగా పరిగణించిన ఆయన, ఈ ఘటనపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడాలని ఎంపీలకు సూచించారు. చివరగా, ప్రజాస్వామ్య విలువలు , సామాజిక న్యాయం పరిరక్షణ కోసం వైఎస్సార్‌సీపీ నిరంతరం శ్రమిస్తుందని జగన్ పేర్కొన్నారు. పార్లమెంట్‌ను ఒక శక్తివంతమైన వేదికగా వాడుకుని ఏపీ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీకి చెందిన రాజ్యసభ మరియు లోక్‌సభ ఎంపీలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# కేసుల విషయంలో నంబర్ 2,లాభాల విషయంలో 100

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు హాజరైన తర్వాత మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధిష్టానంపై జగన్ మోహన్ రెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. పార్టీలో తన ప్రాధాన్యతను తగ్గించడం వెనుక ఒక 'కోటరీ' కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. "2018 వరకు నేను జగన్ మనసులో నంబర్ 2 స్థానంలో ఉన్నాను. కానీ పార్టీ అధికారంలోకి వచ్చాక చుట్టూ ఉన్న కోటరీ నన్ను క్రమంగా సైడ్ చేస్తూ వచ్చింది," అని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఏ రకంగా అయితే ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచారో, తాను కూడా జగన్‌ను అలాగే వెన్నుపోటు పొడుస్తాననే అభద్రతా భావాన్ని జగన్‌లో ఆ కోటరీ కల్పించిందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీలో తాను నంబర్ 2 అని ఈడీ అధికారులు ప్రశ్నించగా, దానికి ఆయన వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. "కేసుల విషయంలో నేను నంబర్ 2 కావచ్చు కానీ, లాభాల విషయంలో మాత్రం 100వ స్థానంలో కూడా ఉండను. నన్ను నంబర్ 2 అని మీడియా, సోషల్ మీడియా మాత్రమే ప్రచారం చేస్తున్నాయి తప్ప, జగన్ ఎప్పుడూ నన్ను ఆ స్థానంలో చూడలేదు," అని స్పష్టం చేశారు. "కూటమి విడిపోతేనే జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారు. కూటమి ఇలాగే కొనసాగితే జగన్ మళ్లీ సీఎం కావడం అసాధ్యం," అని విశ్లేషించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, జగన్ 20 ఏళ్లు ఉంటాననుకున్నారని, ఇప్పుడు చంద్రబాబు కూడా 25 ఏళ్లు ఉంటానని అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీని 'ఉత్తమ ప్రధాని'గా కొనియాడిన విజయసాయిరెడ్డి, తన భవిష్యత్తు రాజకీయాలపై కీలక ప్రకటన చేశారు. "నేను రాజకీయాల నుండి తప్పుకోలేదు. ఈ నెల 25 తర్వాత నా రాజకీయ రంగ ప్రవేశం ఉంటుంది. బీజేపీ నుండి ఆహ్వానం అందితే ఆ పార్టీలోకి వెళ్లే అంశాన్ని ఖచ్చితంగా ఆలోచిస్తాను," అని తన మనసులో మాట బయటపెట్టారు. అదే సమయంలో చంద్రబాబు ప్రభుత్వం తనను లేని కేసుల్లో ఇరికిస్తోందని ఆరోపించారు.

# జగన్ ఒక 'అసత్యాల పుట్ట'

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన విమర్శలపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో విజయసాయిరెడ్డి ఈడీ ముందు హాజరైనప్పటి నుంచి జగన్ ప్రశాంతత కోల్పోయారని విమర్శించారు. తన పేరు ఎక్కడ బయటపడుతుందో అనే భయంతోనే ప్రజల దృష్టిని మరల్చేందుకు జగన్ మోహన్ రెడ్డి బురద రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. "క్రెడిట్ చోరీ" వ్యాఖ్యలపై పయ్యావుల ఎద్దేవా చేశారు. "కనీస విశ్వసనీయత లేని వ్యక్తి క్రెడిట్ చోరీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా రాష్ట్రంలో భూదోపిడీకి తెరలేపింది జగన్ కాదా?" అని నిలదీశారు. రీసర్వేకు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు మధ్య తేడా తెలియకుండా జగన్ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల పాస్ పుస్తకాలపై తన బొమ్మలు వేసుకోవడానికి జగన్‌కు అధికారం ఎవరిచ్చారని మంత్రి ప్రశ్నించారు. కేవలం తన ప్రచారం కోసం రూ. 700 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి రైతుల ఆస్తులపై బొమ్మలు వేయించుకోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ప్రజల ఆస్తుల మీద తన ముద్ర వేయించుకోవడం మాజీ సీఎం అహంకారానికి నిదర్శనమని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎక్కడ చిన్న ఘర్షణ జరిగినా దానికి రాజకీయ రంగు పులుముతూ, కులాలు మరియు మతాల మధ్య జగన్ చిచ్చు పెడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. "సొంత బాబాయిని చంపిన వారిని పక్కన పెట్టుకున్న వ్యక్తి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది" అని ఘాటుగా విమర్శించారు. జగన్‌కు కేవలం రాజకీయ లబ్ధి తప్ప ప్రజా సంక్షేమం పట్టదని, తన వ్యక్తిగత బాధను ప్రజల బాధగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# ఏలూరు జిల్లాలో పులి కలకలం

### అటవీ గ్రామాలకు హై అలర్ట్..

**ఏలూరు (ఏడీఎన్ఎన్) :**



ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల సరిహద్దుల్లో పులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. తెలంగాణలోని కావడిగుండ్ల అటవీ ప్రాంతం నుంచి బుధవారం ఏలూరు జిల్లాలోకి ప్రవేశించిన పులి, అటవీ గ్రామాల్లో పశువులపై దాడికి తెగబడింది. ఈ పరిణామాలపై జిల్లా అటవీ శాఖాధికారి సందీప్ రెడ్డి జంగారెడ్డిగూడెంలో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. పులి కదలికలను నిరంతరం గమనిస్తున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. గురువారం తెల్లవారుజామున అంతర్వేదిగూడెంలో ఒక ఆవును, నాగులగూడెం శివారులో మరో ఆవు , ఆవుదూడను పులి చంపివేసిందని డిఎఫ్ఓ తెలిపారు. పులి అడుగుజాడల (పగ్ మార్క్స్) ఆధారంగా అది ములగలంపల్లి సెక్షన్ దాటి బెడదనూరు రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలోకి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం అటవీ శాఖ సిబ్బంది బృందాలుగా విడిపోయి పులి కదలికలను క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న బెడదనూరు, పాకలగూడెం, అంకన్నగూడెం వంటి గ్రామాల ప్రజలకు అధికారులు పలు జాగ్రత్తలు సూచించారు. అటవీ ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లకూడదని, ఆవులు, గేదెలు, మేకలను అడవిలోకి తోలుకెళ్లొద్దని ఆదేశించారు. రాత్రి సమయంలో పశువుల పాకల వద్ద వెలుతురు ఎక్కువగా ఉండేలా దీపాలను ఏర్పాటు చేసుకోవాలని, ఎవరూ రాత్రిపూట బయట తిరగవద్దని స్పష్టం చేశారు. పులికి సంబంధించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే అటవీ శాఖకు తెలియజేయాలని కోరారు. పులి కదలికలను గుర్తించేందుకు ఎన్.టి.పి.ఎ నిబంధనల ప్రకారం అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు. గ్రామాల్లో మైకులు, టాంటాం ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. అదే సమయంలో, వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం పులికి ఎవరైనా హాని తలపెడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అవాస్తవ ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్, గంజాయిపై పోలీసుల మెరుపు దాడులు

### నలుగురు అరెస్ట్, 500 కేజీల గంజాయి స్వాధీనం

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**



రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టినప్పటికీ, స్మగ్లర్లు కొత్త దారుల్లో రవాణా సాగిస్తూనే ఉన్నారు. విశాఖ జిల్లా గురువారం పెందుర్తిలో డ్రగ్స్ కలకలం రేగగా, మరోవైపు అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. విశాఖ జిల్లా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుజాత నగర్‌లో టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఒక నివాసంలో సోదాలు చేయగా, ఓ వ్యక్తి వద్ద నుంచి 3.5 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని లోతుగా విచారించగా, ఈ ముఠాలో ఉన్న మరో ముగ్గురి పేర్లు బయటపడ్డాయి. దీంతో పోలీసులు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి, ఈ డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్టు సమీపంలోని లబ్బూరు జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి ఆంధ్రా సరిహద్దులోకి ప్రవేశిస్తున్న ఒక బొలెరో వాహనాన్ని, బైక్‌ను అడ్డుకుని సోదాలు చేయగా, సుమారు 500 కేజీల గంజాయి లభ్యమైంది. పోలీసులు ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు పరారయ్యారు. పట్టుబడిన గంజాయితో పాటు వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. రాష్ట్రంలో డ్రగ్స్ రహిత సమాజం కోసం పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడి యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగిస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు.



# కువైట్‌లో తల్లి మృతి.. మృతదేహం కోసం నిరీక్షణ

**నెల్లూరు (ఏడీఎన్ఎన్) :**

ఉపాధి కోసం సుదూర ప్రాంతం వెళ్లిన ఒక నిరుపేద కుటుంబానికి మంత్రి నారాయణ ఆపద్బాంధవుడిలా అండగా నిలిచారు. కువైట్‌లో గుండెపోటుతో మరణించిన నెల్లూరు మహిళ మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించేందుకు ఆయన తక్షణమే స్పందించి, తన మానవత్వాన్ని చాటుకున్నారు. నెల్లూరు నగరంలోని జనార్ధన్ రెడ్డి కాలనీకి చెందిన షేక్ షెహనాజ్ అనే మహిళ తన కుటుంబాన్ని పోషించుకోవడం కోసం కువైట్ వెళ్లారు. అక్కడ పని చేస్తూ కుటుంబాన్ని ఆదుకుంటున్న క్రమంలో ఆమె అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించారు. అప్పటి వరకు తల్లి పంపే డబ్బుతోనే జీవనం సాగిస్తున్న కుమార్తె రిజ్వానాకు, ఈ వార్త పిడుగులా తగిలింది. పరాయి దేశంలో తమకు తెలిసిన వారెవరూ లేకపోవడంతో, తల్లి భౌతికకాయాన్ని నెల్లూరుకు ఎలా తీసుకురావాలో తెలియక ఆ యువతి కన్నీరుమున్నీరుగా విలపించింది. చివరిసారిగా తన తల్లిని చూసుకునే అవకాశం కల్పించాలని, మృతదేహాన్ని నెల్లూరుకు రప్పించాలని కోరుతూ రిజ్వానా మంత్రి నారాయణను ఆశ్రయించింది. బాధితురాలి ఆవేదన చూసి చలించిపోయిన మంత్రి, వెంటనే రంగంలోకి దిగారు. కువైట్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారులతో ఫోన్లో మాట్లాడి, దౌత్యపరమైన అడ్డంకులను తొలగించాలని కోరారు. షెహనాజ్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు పంపేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మంత్రి నారాయణ వ్యక్తిగత చొరవతో మృతదేహాన్ని రప్పించే ప్రక్రియ వేగవంతమైంది. ఆపదలో ఉన్నప్పుడు "నేనున్నాను" అంటూ భరోసా ఇచ్చిన మంత్రి తీరుపై నెల్లూరు వాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు. కొండంత కష్టంలో ఉన్న తమకు అండగా నిలిచినందుకు షెహనాజ్ కుటుంబ సభ్యులు మంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



# ధర్మం, ధైర్యం, సేవే నా మార్గం

**నరసరావుపేట (ఏడీఎన్ఎన్) :**

ధర్మం.. ధైర్యం.. సేవ" అనే మూడు సూత్రాలే తన మార్గమని, తన రాజకీయ ప్రస్థానం ఎప్పుడూ ఇదే బాటలో సాగుతుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోటప్పకొండను గురువారం దర్శించుకున్న ఆయన, త్రికోటేశ్వర స్వామివారిని దర్శించుకోవడం తన రాజకీయ జీవితంలో ఒక ముఖ్య ఘట్టమని అభివర్ణించారు. కోటప్పకొండకు చేరుకున్న పవన్ కల్యాణ్‌కు ఆలయ జమిందార్ రామకృష్ణ కొండలరావు, ఈఓ చంద్రశేఖర్ , వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకునే క్రమంలో పవన్ తన కారు ఫుట్ రెస్ట్‌పై నిలబడి అభిమానులకు, ప్రజలకు అభివాదం చేస్తూ ఉత్సాహపరిచారు. ఆలయ మర్యాదల ప్రకారం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్, ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల తర్వాత పవన్ కల్యాణ్ అభివృద్ధి పనులపై దృష్టిసారించారు. కోటప్పకొండ నుంచి కొత్తపాలెం వరకు నిర్మించిన నూతన రహదారిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్రాల అభివృద్ధి ద్వారానే ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక రంగం కూడా పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "నేను ఎప్పుడూ ధర్మం వైపే ఉంటాను. భయం లేని ధైర్యంతో, నిస్వార్థమైన సేవతో ప్రజల కోసం నడుచుకుంటాను," అని పవన్ తన పర్యటనలో పునరుద్ఘాటించారు. ఈ పర్యటనలో భారీగా తరలివచ్చిన జనసేన కార్యకర్తలు, అభిమానుల కోలాహలంతో కోటప్పకొండ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.



# వాడుక భాషకు గిడుగు సేవలు చిరస్మరణీయం

**తెనాలి (ఏడీఎన్ఎన్) :**


వాడుక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి తెలుగుకు వెలుగునిచ్చిన మహనీయుడని పలువురు వక్తలు అన్నారు. ఇస్కఫ్ సమావేశ హాల్లో అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ తెలుగు భాషకు దశ, దిశా నిర్దేశించిన భాషా వైతాళికులు గిడుగు రామ్మూర్తి అని కొనియాడారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాషకు పెను ప్రమాదం పొంచి ఉందనీ, తెలుగు భాషను బతికించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దర్శకులు దేవిశెట్టి కృష్ణారావు సూచించారు. మాతృభాష తీయ్యదనం, తెలుగు భాషలో ఉన్న సొగసులు, పద్య నాటికలు, భాష ప్రక్రియలు, అష్టావధానాలు మరే భాషలోనూ లేవని, మాతృభాషలో పట్టుఉంటే ఇతర భాషలు తేలిగ్గా వస్తాయని, భాష పై ఉద్యమాలు తేవాలని ప్రతి ఒక్కరు భాష కోసం నడుము కట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుగు ఉపాధ్యాయులు ,రచయిత సోమరౌతు శ్రీనివాసరావు అన్నారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగు భాష గేయాలను బెల్లంకొండ వెంకట్ ఆలపించారు.ఈ కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ మాష్టర్, మార్కండేయులు ఓతుకోలు, రామరాజు, రీహన్ తదితరులు పాల్గొన్నారు.



## రూ. 3.10 కోట్లతో
# వండర్ పార్క్
### ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా జూబ్లీహిల్స్ ప్రాంతంలోని చిన్నారులకు క్రీడాకారులకు ఆహ్లాదాన్ని పంచేందుకు రూ. 3.10 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక చిల్డ్రన్ ప్లే పార్కును హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ప్రారంభించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో ఒక ఎకరం 40 గుంటల విస్తీర్ణంలో గతంలో నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాబోయే తరాల అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలను పెంచుతూ సమగ్ర అభివృద్ధి సాధించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పార్కులో కేవలం పిల్లల ఆట స్థలాలు మాత్రమే కాకుండా, పలు అత్యాధునిక వసతులను కూడా కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 10 లక్షల లీటర్ల వర్షపు నీటిని నిల్వ చేసే సామర్థ్యం కలిగిన స్టోరేజ్ ప్లాంటును ఇక్కడ ఏర్పాటు చేయడం విశేషం.



## ధాన్యం సేకరణ
# విజయవంతం
### ఖరీఫ్ ధాన్యం సేకరణపై మంత్రి ఉత్తమ్ సమీక్ష
### 14.2 లక్షల మంది రైతులకు అందిన మద్దతు ధర

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ, ప్రభుత్వం ధాన్యం సేకరణను అత్యంత విజయవంతంగా పూర్తి చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. బేగంపేటలో పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి స్టీఫెన్ రవీంద్ర , ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన 2025-26 ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణపై సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు.ఈ సీజన్‌లో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 14.2 లక్షల మంది రైతులకు నేరుగా లబ్ధి చేకూరిందని మంత్రి వెల్లడించారు. రైతులకు అందాల్సిన నగదు చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూశామని, ఇప్పటివరకు రూ.18,444 కోట్ల మేర నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ అంశాలను కూడా ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు.ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురైన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న పౌరసరఫరాల శాఖ అధికారులను మంత్రి అభినందించారు. రాబోయే కాలంలో కూడా ధాన్యం నిల్వలు, మిల్లింగ్ మరియు రవాణా విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతిగా ఉంటుందని, అన్నదాతలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.



## బావమరిది కోసమే
# 'సైట్ విజిట్' డ్రామా
### కొప్పుల ఈశ్వర్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

సింగరేణి బొగ్గు బ్లాకుల టెండర్లలో జరుగుతున్న అవకతవకలపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి సంస్థ కుంభకోణాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బావమరిదికి ఆర్థికంగా లబ్ధి చేకూర్చేందుకే టెండర్ నిబంధనల్లో 'సైట్ విజిట్ సర్టిఫికేషన్' వంటి నిబంధనలను ప్రవేశపెట్టారని ఆయన విమర్శించారు. ఈ వ్యవహారంలో సుమారు రూ. 6,000 కోట్ల మేర కుంభకోణం జరిగినట్లు తమకు సమాచారం ఉందని ఆయన పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టినందుకే మాజీ మంత్రి హరీశ్ రావును సిట్ అధికారులు గంటల తరబడి విచారణ పేరుతో వేధిస్తున్నారని కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. హరీశ్ రావు ఆధారాలు చూపగానే నైని బొగ్గు బ్లాక్ టెండర్లను రద్దు చేసిన ప్రభుత్వం, మిగిలిన బ్లాకుల విషయంలో ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు.

# రైతులకు సాగు ఖర్చు తగ్గడమే లక్ష్యం
### ఆయిల్ పామ్ సాగుపై మంత్రి సమీక్ష

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు రైతులకు సాగు ఖర్చు తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. సచివాలయంలో టీజీ ఆయిల్ ఫెడ్, మార్క్ ఫెడ్ , విత్తనోత్పత్తి సంస్థల అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైన ప్రైవేట్ ఆయిల్ పామ్ కంపెనీల జోన్లను ఇప్పటికే రద్దు చేశామని వెల్లడించారు. కరీంనగర్, ఆసిఫాబాద్, వరంగల్ మరియు హన్మకొండ జిల్లాల్లోని ఈ జోన్లను ఆయిల్ ఫెడ్ సంస్థకు అప్పగించామని, ఒకవేళ ఆయిల్ ఫెడ్ కూడా లక్ష్యాలను చేరుకోలేకపోతే ఆ సంస్థపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణ కోసం అవసరమైతే అవుట్ సోర్సింగ్ ద్వారా సిబ్బందిని నియమించుకుని పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులపై పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు ఆయిల్ పామ్ సాగుకు అవసరమైన పనిముట్లను వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగం చేయాలని మంత్రి సూచించారు. రైతులకు అవసరమైన బయో ఫర్టిలైజర్లను 50 శాతం సబ్సిడీతో అందించాలని, అలాగే కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు దిగుబడి పెంచడానికి , ప్రాసెసింగ్ వ్యర్థాల నుండి ఉప ఉత్పత్తులను తయారు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. స్థానిక రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి పామ్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని ప్రస్తుతం ఉన్న 16.5 శాతం నుండి 44 శాతానికి పెంచాలని కోరుతూ ప్రధాని మోడీతో పాటు కేంద్ర మంత్రులకు ఇప్పటికే లేఖలు రాసినట్లు మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరోవైపు మార్క్ ఫెడ్ , విత్తనాభివృద్ధి సంస్థల పనితీరుపై కూడా మంత్రి తుమ్మల పలు కీలక సూచనలు చేశారు. మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన జొన్న, మొక్కజొన్న ధాన్యాన్ని ఎక్కువ కాలం గోదాముల్లో నిల్వ ఉంచకుండా, పంట పాడవకముందే టెండర్లు పిలిచి విక్రయించాలని ఆదేశించారు. విత్తనాభివృద్ధి సంస్థ కూడా ప్రైవేట్ కంపెనీలకు ధీటుగా నాణ్యమైన , అధిక దిగుబడినిచ్చే విత్తనాలను ఉత్పత్తి చేయాలని, సీజన్ ప్రారంభానికి ముందే రైతుల అవసరాలను అంచనా వేసి విత్తనాలను సిద్ధం చేయాలని సూచించారు. పెరుగుతున్న సాంకేతికతను వినియోగించుకుని పాత పద్ధతులకు స్వస్తి పలికి, ప్రభుత్వ సంస్థలపై రైతులకు నమ్మకం కలిగేలా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

# ఎన్ని కేసులు పెట్టినా భయపడం


**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టిన భయపడమని పోరాటం మరింత ఉధృతం చేస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు . తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. మాజీ మంత్రి కేటీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం సాయంత్రం ఆయన 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును 'రాజకీయ కక్షసాధింపు'గా ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న వరుస కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే తమకు నోటీసులు ఇస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి బామ్మర్దికి సంబంధించిన 'బొగ్గు కుంభకోణం' దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని, దానిపై సమాధానం చెప్పే దమ్ము లేకనే రేవంత్ రెడ్డి ఇలాంటి 'నోటీసుల డ్రామా' ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. పాలనా వైఫల్యాలు, కాంగ్రెస్ స్కామ్‌ల నుంచి తప్పించుకోవడానికి పోలీసులను ఆయుధాలుగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతీకారం అనేది బలహీనుల ఆయుధమని దమ్మున్న నాయకుడి ఆయుధం ఎప్పుడూ ప్రజాపోరాటమేనని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. పోలీసుల వెనుక దాక్కుని రాజకీయం చేస్తున్న రేవంత్ రెడ్డి బలహీనుడని, తాము ధైర్యవంతులం కాబట్టే ప్రజల మధ్య నిలబడి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, విచారణల పేరుతో ఎంత వేధించినా భయపడే ప్రసక్తే లేదని, బీఆర్ఎస్ నాయకులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేసే దాకా కాంగ్రెస్ సర్కార్‌ను వదిలిపెట్టేది లేదని హరీశ్ రావు హెచ్చరించారు. ప్రభుత్వ కుంభకోణాలను, వాటాల పంచాయతీలను ఎప్పటికప్పుడు బట్టబయలు చేస్తూనే ఉంటామన్నారు.

# ఫ్యూచర్ సిటీలో రూ .5000 కోట్ల పెట్టుబడి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2026 వార్షిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వం మరో విజయాన్ని సాధించింది. నెదర్లాండ్స్ కు చెందిన 'యూపీసీ రిన్యూవబుల్స్' , 'వోల్ట్ డేటా సెంటర్స్'ల ఉమ్మడి సంస్థ అయిన యూపీసీ వోల్ట్ , తెలంగాణలో రూ.5,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ ఒప్పందం ప్రకారం, హైదరాబాద్ శివార్లలో నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో 100 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన అత్యాధునిక ఏఐ డేటా సెంటర్‌ను ఈ సంస్థ నెలకొల్పనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును వచ్చే ఐదేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ డేటా సెంటర్ ప్రత్యేకత ఏమిటంటే, దీనికి అవసరమైన పూర్తి విద్యుత్ శక్తిని అందజేయడానికి యూపీసీ వోల్ట్ సంస్థే సొంతంగా 100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయనుంది. ఇది ఫ్యూచర్ సిటీని పర్యావరణహితంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఉండనుంది. ఉపాధి పరంగా చూస్తే, ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే సుమారు 3,000 మందికి పైగా ప్రత్యక్షంగా , పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అంచనా. డేటా సెంటర్ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి పైగా సాంకేతిక ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. దావోస్ పర్యటనలో ఇప్పటివరకు తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ.20,000 కోట్లకు పైగా పెట్టుబడి ఒప్పందాలను కుదుర్చుకోవడం గమనార్హం.

# సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
### రూ. 2.14 కోట్లు పోగొట్టుకున్న వైనం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. అందమైన మహిళ ఫోటోను ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకుని మాయమాటలు చెప్పిన సైబర్ నేరగాళ్ల వలలో పడి, ఒక సాఫ్ట్ వేర్ ఇంజినీర్ ఏకంగా రూ. 2.14 కోట్లు పోగొట్టుకున్నారు. టిఎన్‌జీవో కాలనీకి చెందిన 44 ఏళ్ల సాఫ్ట్ వేర్ ఉద్యోగికి గతేడాది డిసెంబర్‌లో సోషల్ మీడియా ద్వారా ఒక మహిళ పరిచయమైంది. తాను స్టాక్ ట్రేడింగ్ ద్వారా భారీగా లాభాలు గడిస్తున్నానని నమ్మబలికిన ఆ మహిళ, బాధితుడితో ఒక యాప్ డౌన్‌లోడ్ చేయించింది. ఆమె మాటలు నమ్మి తొలుత రూ. 31.5 లక్షలు పెట్టుబడి పెట్టగా, యాప్‌లో లాభాలు వచ్చినట్లు వర్చువల్‌గా కనిపించాయి. దీంతో మరింత ఆశపడ్డ బాధితుడు, రెండో విడతలో రూ. 42.27 లక్షలు బదిలీ చేశాడు. అయితే, వచ్చిన లాభాలను విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా,యూఏఈ ప్రభుత్వానికి 30 శాతం పన్ను కట్టాలంటూ కేటుగాళ్లు కొత్త పల్లవి అందుకున్నారు. నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న సదరు ఇంజినీర్, తన ఆఫీసులోని సహచరుల దగ్గర రూ. 90 లక్షలు అప్పు చేయడమే కాకుండా, కుటుంబ సభ్యుల దగ్గర డబ్బు తీసుకుని, ఆఖరికి ఆస్తులు అమ్మి మొత్తం 8 విడతల్లో రూ. 2.14 కోట్లు పంపాడు. మళ్ళీ విత్‌డ్రా కోసం ప్రయత్నించగా, అదనంగా రూ. 68 లక్షలు కట్టాలని వారు డిమాండ్ చేయడంతో బాధితుడికి అనుమానం వచ్చింది. తీరా ఆ మహిళ ఫోటోను ఇంటర్నెట్‌లో సెర్చ్ చేయగా, అది ఇన్‌స్టాగ్రామ్‌లోని ఒకరి ప్రొఫైల్ నుంచి దొంగిలించినట్లు తేలింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సింగరేణి దోపిడీపై సీబీఐ విచారణకు సిద్ధమా?
### సీఎంకు రాంచందర్ రావు సవాల్


**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లో బొగ్గు గనుల టెండర్ల వ్యవహారంపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం , ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి దోచుకున్నాయని ఆయన ఆరోపించారు. ఇటీవల నైనీ కోల్ మైన్స్ టెండర్ల రద్దు నేపథ్యంలో ఆయన స్పందిస్తూ, కేవలం ఒకట్రెండు టెండర్ల రద్దుతో సరిపెట్టకుండా, 2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో జరిగిన అన్ని టెండర్లపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేస్తూ, అనవసరంగా బురద జల్లవద్దని సూచించారు. సింగరేణి అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని రాంచందర్ రావు సవాల్ విసిరారు. రాష్ట్రంలోకి సీబీఐ రాకుండా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనలు పెట్టిందని, ఆ సమయంలో హరీశ్ రావు వంటి నేతలు ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వానికి పారదర్శకతపై నమ్మకం ఉంటే, వెంటనే సీబీఐ విచారణకు మొగ్గు చూపాలని సూచించారు. రేవంత్ రెడ్డి అనుమతి ఇస్తే ఇప్పుడంటే ఇప్పుడే కేంద్రం విచారణకు ఆదేశిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కంటోన్మెంట్ల భవిష్యత్తుపై కేంద్ర ప్రభుత్వం త్వరలోనే ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతోందని రాంచందర్ రావు వెల్లడించారు. స్థానిక ప్రజల ప్రయోజనాలను మరియు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఈ అడుగు వేయబోతోందని ఆయన పేర్కొన్నారు. సింగరేణి దోపిడీపై జరుగుతున్న ఈ పోరులో బీజేపీ ఎక్కడా వెనక్కి తగ్గదని, దోషులను కఠినంగా శిక్షించే వరకు పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.

# హైడ్రా 'డబుల్' యాక్షన్
### గచ్చిబౌలిలో పార్కు సేఫ్ , శామీర్‌పేటలో రోడ్డు క్లియర్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**




హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన ఆస్తుల పర్యవేక్షణ సంస్థ గురువారం ఒకేరోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో భారీ ఆపరేషన్ నిర్వహించి ప్రభుత్వ ఆస్తులను ప్రజా రహదారులను ఆక్రమణల నుండి విముక్తం చేసింది. గచ్చిబౌలి , శామీర్‌పేట ప్రాంతాల్లో జరిగిన ఈ తొలగింపు చర్యలతో స్థానిక నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గచ్చిబౌలిలోని టెలికాంనగర్‌లో 1982లో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో సుమారు 4,000 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, ఇందులో ఇప్పటికే 1,500 గజాల స్థలం ఆక్రమణకు గురై నివాసాలు వెలిశాయి. మిగిలిన 2,500 గజాల స్థలాన్ని కూడా కొంతమంది ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడంతో స్థానికులు 'హైడ్రా ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు, ఆ స్థలం పార్కుకే చెందుతుందని నిర్ధారించి ఆక్రమణలను తొలగించారు. భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా అక్కడ ఫెన్సింగ్ వేసి, అది పార్కు స్థలమని తెలిపే బోర్డులను ఏర్పాటు చేశారు. మరోవైపు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఫ్రెండ్స్ కాలనీలో రోడ్డు ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 1987లో వేసిన ఈ లేఅవుట్‌లో 20 అడుగుల రహదారిని ఆక్రమించి ప్రహరీ గోడలు, గేట్లు నిర్మించడంతో పక్కనే ఉన్న ప్లాట్ల వారికి దారి మూసుకుపోయింది. గత 15 ఏళ్లుగా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. చివరికి హైడ్రా జోక్యంతో గురువారం ఆ ఆక్రమణ గోడలను కూల్చివేసి, కాలనీ వాసులకు దారి చూపారు. ఇన్నాళ్లకు తమ సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు.



## సింగరేణి అప్పులకు
# బీఆర్ఎస్ పాలనే కారణం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

సింగరేణి కాలరీస్ సంస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం తన గుప్పిట్లో పెట్టుకుని సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణి అప్పులు అమాంతం పెరిగాయని, గత పదేళ్ల కాలంలో సుమారు రూ.32 వేల కోట్లకు పైగా అప్పులు పెరిగాయని కిషన్‌రెడ్డి గణాంకాలతో వివరించారు. సంస్థ బోర్డు కేవలం నామమాత్రంగా ఉండేదని, టెండర్లు, కాంట్రాక్టుల కేటాయింపుల్లో కేసీఆర్ కుటుంబ సభ్యుల అజమాయిషీనే నడిచిందని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా సంస్థ నిధులను దుర్వినియోగం చేశారని, సీఎస్ఆర్ నిధులను కూడా తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ధ్వజమెత్తారు.సింగరేణి నుంచి విద్యుత్ వాడుకున్న జెన్‌కో, ట్రాన్స్ కో సంస్థలు సకాలంలో డబ్బులు చెల్లించలేదని, ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.47 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. జిల్లాల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన రూ.1500 కోట్ల డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్‌ను కూడా నిధులు లేక నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఒకే వ్యక్తిని సీఎండీగా అదనంగా నాలుగేళ్లు కొనసాగించారని, ఇప్పుడు ఇన్‌ఛార్జ్ సీఎండీతో కాలం వెళ్లదీస్తున్నారని దుయ్యబట్టారు.సింగరేణిపై కేంద్ర ప్రభుత్వం అజమాయిషీ ఎప్పుడూ లేదని, బోర్డు సమావేశాల వివరాలు కూడా కనీసం తన దృష్టికి రావడం లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రైవేటు కంపెనీలకు పనులు కట్టబెట్టడంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యుత్సాహం చూపిందని, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని, సింగరేణిలో పారదర్శకత కోసం కేంద్రం నిరంతరం నిఘా ఉంచుతుందని ఆయన హెచ్చరించారు.



## సిట్ నోటీసులు
# అంతా ఒక నాటకం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ 'నోటీసుల నాటకం' ఆడుతోందని ఆయన విమర్శించారు. ఒకవైపు రాష్ట్రంలో యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని గాలికి వదిలేసి విదేశీ పర్యటనల్లో జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. సంక్రాంతి ముగిసి వారం దాటినా 'రైతు భరోసా' ఊసే లేదని, ప్రజా సమస్యలను పరిష్కరించడం చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలను వేధించడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎటువంటి పస లేదని అత్యున్నత న్యాయస్థానాలు తేల్చి చెప్పినా, ప్రభుత్వం దీనిని ఒక టీవీ సీరియల్‌లా సాగదీస్తోందని నిరంజన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రెండేళ్లుగా దర్యాప్తు చేస్తున్నా ఒక్క ఆధారాన్ని కూడా చూపలేకపోయారని, కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసమే పోలీస్ యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, కేసులు పెట్టినా న్యాయపరంగా ఎదుర్కొంటామని, హామీల అమలు కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



## ఆ రెండు పార్టీలకు
# మజ్లిస్ పార్టీతో దోస్తీ

**కరీంనగర్ (ఏడీఎన్ఎన్) :**

మున్సిపల్ ఎన్నికల నగారా మోగుతున్న తరుణంలో కరీంనగర్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మీడియా సమావేశంలో గురువారం మాట్లాడుతూ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ రెండు పార్టీలు మజ్లిస్ పార్టీతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకున్నాయని, మతం పేరుతో కుట్రలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈసారి కరీంనగర్ అభివృద్ధి కోసం బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరిన ఆయన, అధికారంలోకి వస్తే నగరం రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చారు. ఉత్తర తెలంగాణలో అత్యంత కీలకమైన కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని దక్కించుకోవడం ఇప్పుడు మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, అదే సమయంలో కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ కేంద్రమంత్రిగా కొనసాగుతుండటం, ఇక్కడ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ సీనియర్ నేత గంగుల కమలాకర్ ఉండటంతో త్రిముఖ పోరు అనివార్యమైంది. ఈ నేపథ్యంలో కరీంనగర్ కార్పొరేషన్ పై గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్ఎస్, అధికార బలాన్ని చాటుకోవాలని కాంగ్రెస్, కేంద్ర మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో పట్టు నిలుపుకోవాలని బీజేపీ వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. ప్రస్తుతం అన్ని పార్టీలు డివిజన్ల వారీగా బలమైన అభ్యర్థుల వేటలో ఉన్నాయి. ఈ క్రమంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతుండటంతో 'జంప్ జిలానీల' సంఖ్య పెరిగిపోతోంది. ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి వలసలు కొనసాగుతుండటంతో అభ్యర్థుల ఎంపిక కేడర్‌లో అయోమయాన్ని, నేతల్లో ఉత్కంఠను కలిగిస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లోనే అత్యంత ఆసక్తికరంగా మారిన కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో ఓటరు తీర్పు ఎటువైపు ఉంటుందోనని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

మనసర్కార్
Follow: manasarkar
శుక్రవారం | హైదరాబాద్
23.01.2026
www.manasarkar.com

## రాశి ఫలాలు

**23-01-2026 శుక్రవారం**

**మేషం:**
వృత్తి, వ్యాపారాల్లో రాబడి బాగా వృద్ధి చెందుతుంది. ముఖ్యమైన వ్యవహారాలు విజయవంతంగా ముందుకు సాగుతాయి. మిత్రులు, కుటుంబ సభ్యుల నుంచి ఆర్థికంగా కొద్దిగా ఒత్తిడి ఉంటుంది. దైవ దర్శనాలు చేసుకుంటారు. కొందరు బంధువులకు సంబంధించిన శుభ కార్యాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. కొత్త ఉద్యోగ ప్రయత్నాలకు ఆశించిన సానుకూల స్పందన లభిస్తుంది.

**వృషభం:**
అనేక విధాలుగా ఆదాయం పెరిగే అవకాశం ఉన్నా అందుకు తగ్గ కుటుంబ ఖర్చులుంటాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నాయి. వ్యాపారాల్లో లాభాలు బాగానే వృద్ధి చెందుతాయి. ఉద్యోగంలో పదోన్నతికి, స్థాన చలనానికి అవకాశం ఉంది. వృత్తి జీవితం బిజీగా సాగిపోతుంది. ఆర్థిక లావాదేవీలు పెట్టుకోకపోవడం మంచిది. ఆరోగ్యం బాగానే ఉంటుంది.

**మిథునం:**
ఆస్తి, ఆర్థిక వ్యవహారాలలో జీవిత భాగస్వామి తోడ్పాటు తీసుకోవడం మంచిది. ఆదాయం బాగా వృద్ధి చెందుతుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. తలపెట్టిన పనులు, వ్యవహారాలు సజావుగా పూర్తవుతాయి. వాహన యోగం పడుతుంది. వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాల్లో అనుకూల వాతావరణం ఉంటుంది. ఆశించిన స్థాయిలో ఆర్థిక పురోగతి ఉంటుంది.

**కర్కాటకం:**
వృత్తి, వ్యాపారాల్లో మీ ఆలోచనలు ఆశించిన ఫలితాలనిస్తాయి. ఇంటా బయటా కొద్దిగా ఒత్తిడి ఉండే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా, అనుకూలంగా ఉంటుంది. ఒకటి రెండు అదనపు ఆదాయ మార్గాల నుంచి సత్ఫలితాలు లభిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో శ్రమాధిక్యత ఉంటుంది. ప్రయాణాల్లో కాస్తంత జాగ్రత్తగా ఉండడం మంచిది.

**సింహం:**
వృత్తి, ఉద్యోగాల్లో ఆర్థిక పురోగతి కలుగుతుంది. వ్యాపారాలు బాగా లాభసాటిగా పురోగమిస్తాయి. అనుకోకుండా మంచి పెళ్లి సంబంధం కుదిరే అవకాశం ఉంది. శుభ కార్యాలకు సంబంధించి బంధువుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. అదనపు ఆదాయ మార్గాలు ఆశించిన ఫలితాలనిస్తాయి.

**కన్య:**
వృత్తి, ఉద్యోగాల్లో పని భారం బాగా పెరుగుతుంది. వ్యాపారాల్లో ఒకటి రెండు ఆర్థిక సమస్యలు ఎదురవుతాయి. ఆదాయం, ఆరోగ్యం సజావుగా సాగిపోతాయి. వ్యయ ప్రయాసలతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. అవసరాలకు తగ్గట్టుగా డబ్బు అందుతుంది. మొండి బాకీ ఒకటి వసూలు అవుతుంది. కుటుంబంలో అపార్థాలు చోటు చేసుకుంటాయి. ఆచితూచి వ్యవహరించడం మంచిది.

**తుల:**
ఉద్యోగంలో ప్రాధాన్యం పెరుగుతుంది. వ్యాపారాలు లాభసాటిగా పురోగమిస్తాయి. నిరుద్యోగులకు మంచి ఆఫర్లు అందుతాయి. విదేశీ కంపెనీల నుంచి కూడా ఆఫర్లు అందే అవకాశం ఉంది. బంధువుల నుంచి శుభ వార్తలు వింటారు. పెండింగ్ పనులన్నిటినీ పట్టుదలగా పూర్తి చేస్తారు. ఆదాయం, ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటాయి.

**వృశ్చికం:**
వృత్తి, వ్యాపారాల్లో కార్యకలాపాలు వృద్ధి చెందుతాయి. రాబడికి లోటుండదు. అవసరానికి ధనం వసూలవుతుంది. రావలసిన డబ్బు చేతికి అందుతుంది. తలపెట్టిన వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. జీవిత భాగ స్వామి నుంచి ఆశించిన సమాచారం అందుతుంది. ఆస్తి, ఆర్థిక వ్యవహారాలు చక్కబడ తాయి.

**ధనస్సు:**
వ్యక్తిగత సమస్యలు తగ్గుముఖం పడతాయి. అదనపు ఆదాయ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక లావాదేవీల వల్ల ప్రయోజనం ఉంటుంది. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది. మిత్రుల నుంచి ఒత్తిడి ఉంటుంది. ఆశించిన శుభవార్తలు వింటారు.

**మకరం:**
వృత్తి, ఉద్యోగాల్లో అధికారుల నమ్మకాన్ని చూరగొంటారు. వ్యాపారాలు నిలకడగా ముందుకు సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు సంతృప్తికరంగా ఉంటాయి. పెళ్లి ప్రయత్నాలు ఇబ్బంది పెడతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో దైవ దర్శనాలు చేసుకునే అవకాశం ఉంది. ఇష్టమైన మిత్రులతో విందు కార్యక్రమంలో పాల్గొంటారు.

**కుంభం:**
వృత్తి, ఉద్యోగాల్లో శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఇంటా బయటా ఉత్సాహంగా, ఉల్లా సంగా గడిచిపోతుంది. ఉద్యోగంలో అధికారుల నుంచి ప్రోత్సాహకాలు లభిస్తాయి. వ్యాపారాల్లో కొద్దిగా లాభాలు పెరుగుతాయి. నిరుద్యోగులకు ఆశించిన సమాచారం అందుతుంది. ఆర్థిక వ్యవహారాలను విజయవంతంగా పూర్తి చేస్తారు.

**మీనం:**
తలపెట్టిన పనుల్లో కార్యసిద్ధి ఉంటుంది. చిన్ననాటి మిత్రులతో ఒక విందులో పాల్గొంటారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నాయి. ఆరోగ్యం పరవాలేదు. ఎవరికీ వాగ్దానాలు చేయవద్దు. ఏ వృత్తి అయినప్పటికీ, తీరిక ఉండని పరిస్థితి ఏర్పడుతుంది. వ్యాపారాల్లో లాభాలు పెరుగుతాయి

## చిన్న గుడిసెలు కూలుస్తున్న హైడ్రా..

**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్):**

హైడ్రా టెలికాంనగర్ సర్వేనెంబర్ 91 లో కూల్చివేతలను చేపట్టింది. టెలికాం నగర్‌లో 2000 గజాల్లో పార్కు ఉండగా.. పార్కులో 5 గుడిసెలున్నాయి. తాము గత 30 సంవత్సరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని.. హైడ్రా అధికారులు తమకు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా కూల్చివేతలను చేపడుతున్నారని స్థానిక బాధితులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే మరోవైపు హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల మేరకు కూల్చివేతలను చేపడుతున్నామని అధికారులు చెబుతున్నారు. 59 జీవో కింద తాము ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నామని.. ప్రభుత్వం నుండి 125 గజాలు పైన భూమి ఉంటే దానికి డబ్బులు కట్టాలని మాకు నోటీసులు ఇచ్చారని అంటున్నారు బాధితులు. టెలికాం నగర్ 91 సర్వే నంబర్‌లో ఎన్నో పెద్ద పెద్ద అక్రమాలు ఉన్నాయని, అవి వారికి కనబడటం లేదని, మాలాంటి పేద బడుగు వర్గాల గుడిసెలు మాత్రమే కనబడుతున్నాయని.. కానీ హైడ్రా అధికారులు పెద్ద పెద్ద ఇళ్ల జోలికి వెళ్లకుండా చిన్న గుడిసెలు వేసుకుంటే వాటిని కూలుస్తున్నారు అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఎంఎంటీఎస్, మెట్రో, సిటీ బస్సుల అన్నింటికీ ఒకటే టికెట్!

**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్):**



హైదరాబాద్‌లో రవాణా సౌకర్యం మరింత మెరుగ్గా చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ రైలు, మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ సిటీ బస్సులను కనెక్ట్ చేసేలా ప్రభుత్వం ప్లానింగ్ చేస్తోంది. వీటన్నింటినీ అనుసంధానిస్తూ.. సమగ్ర ప్రజా రవాణా వ్యవస్థను రూపొందించేందుకు ప్రణాళిక ప్రారంభించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని ఎంఎంటీఎస్ సబర్బన్ రైలు, మెట్రో రైలు, సిటీ బస్సు సేవలను అనుసంధానించడానికి ప్రణాళికపై కసరత్తు మొదలుపెట్టింది. దీని ద్వారా మొదటి నుంచి చివరివరకు కనెక్టివిటీ మెరుగుపడనుంది. ప్రజా రవాణా వినియోగాన్ని పెంచడానికి ఇది ఉపయోగపడుతుంది. రవాణా, రోడ్లు, భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. జనాలు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి సేఫ్‌గా వెళ్లేందుకు, సురక్షితమైన రోడ్లు, నమ్మకమైన సేవలపై దృష్టి సారించారు. ఈ ప్రణాళిక ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 51 ఎంఎంటీఎస్ స్టేషన్ల చుట్టూ అప్రోచ్ రోడ్లు, పాదచారుల మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేస్తుంది ప్రభుత్వం. అయితే దక్షిణ మధ్య రైల్వే ఫుట్‌ఫాల్, క్యాచ్‌మెంట్ డేటాను పంచుకుంటుంది. దీని ఆధారంగా ఎంఎంటీఎస్ స్టేషన్లకు దగ్గరగా ఉన్న బస్ స్టాప్‌లు, మార్గాలను టీజీఎస్ఆర్టీసీ బస్సులు కనెక్ట్ చేస్తాయి. ప్రభుత్వం జీపీఎస్ పర్యవేక్షణతో ప్రైవేట్ ఫీడర్ సేవలను కూడా ప్రవేశపెట్టాలని చూస్తోంది. దీనిద్వారా ఎంఎంటీఎస్ స్టేషన్ల నుంచి సమీప కాలనీలు సర్వీసులు నడిపే అవకాశం ఉంది. ఎంఎంటీఎస్, మెట్రో, బస్సులలో ఇంటిగ్రేటెడ్ టికెటింగ్ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తుంది ప్రభుత్వం. దీనిద్వారా అన్నింటికీ కలిపి ఒకే టికెట్ తీసుకోవచ్చు. ప్రయాణానికి ముందు టికెట్ తీసుకుని.. ఒకేసారి మెట్రో, బస్సు, ఎంఎంటీఎస్ సేవలను వినియోగించుకోవచ్చు. మీ సేవా కమిషనర్‌కు మెట్రో, ఎంఎంటీఎస్ రైలు, బస్ ఇంటిగ్రేటెడ్ టికెటింగ్ వ్యవస్థను పరిశీలించాలని సూచనలు చేసిన ప్రభుత్వం, త్వరలోనే అవి ప్రతిపాదనలోకి వస్తాయని అనుకుంటున్న ప్రజలు.

## రాష్ట్రంలో మల్టిజోన్-2లో 14 మంది పోలీసులకు బదిలీలు

**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్):**




రాష్ట్రంలోని పోలీసు ఉద్యోగుల మల్టీజోన్2 పరిధిలో పనిచేస్తున్న 14 మంది పోలీసు అధికారులను బదిలీచేస్తూ అడిషనల్ డీజీపీ ఉత్తర్వులు జారీచేశారు. జోన్ పరిధిలోని మహబూబ్‌నగర్ జిల్లాలో సీసీఎస్‌లో పనిచేస్తున్న కె.సుగంధ రత్నంను వనపర్తి జిల్లాకు బదిలీ చేశారు. వనపర్తి సర్కిల్‌లో పనిచేస్తున్న ఎం. కృష్ణయ్యను, మహబూబ్‌నగర్ డీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఎండీ మగ్దూం అలీని, వికారాబాద్ టౌన్ పీఎస్‌లో పనిచేస్తున్న బి.భీంకుమార్‌ను, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలో సర్కిల్‌లో పనిచేస్తున్న డి.విష్ణువర్ధన్ రెడ్డిని, నల్గొండ జిల్లా నకిరేకల్ పీఎస్‌లో ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న జి.రవిబాబును మల్టిజోన్2లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. నల్గొండలో వెయిటింగ్‌లో ఉన్న సీహెచ్ మోతీరాంను మహబూబ్‌నగర్ సీసీఎస్‌కు, ఎం.నర్సింహులును మహబూబ్‌నగర్ డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. హైదరాబాద్‌లో వెయిటింగ్‌లో ఉన్న కె.రఘుకుమార్‌ను వికారాబాద్ టౌన్ పీఎస్, నారాయణపేట జిల్లా మరికల్ సర్కిల్‌లో పనిచేస్తున్న కె.రాజేందర్ రెడ్డిని మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా ట్రాఫిక్ పీఎస్‌లో ఉన్న ఎం. భగవంత రెడ్డిని నారాయణపేట జిల్లా మరికల్ సర్కిల్‌కు, నల్గొండ డీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఈ. రఘువీరారెడ్డిని నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండకు బదిలీ చేశారు. హైదరాబాద్ సిటీలో వెయిటింగ్‌లో ఉన్న వి. ప్రదీప్ కుమార్‌ను గద్వాల జిల్లా ఆలంపూర్ సర్కిల్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## భక్తులకు క్షమాపణలు చెప్పిన నటి టీనా శ్రావ్య

**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్):**



మేడారం జాతర నేపథ్యంలో తలెత్తిన వివాదంపై 'కమిటీ కుర్రాళ్లు', 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' చిత్రాల ఫేమ్ నటి టీనా శ్రావ్య స్పందిస్తూ బహిరంగ క్షమాపణలు చెప్పింది. ఇటీవల మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న ఆమె తన పెంపుడు కుక్క బరువుకు సమానంగా బెల్లాన్ని (బంగారం) తూకం వేసి మొక్కు చెల్లించుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వివాదం చెలరేగింది. గిరిజన ఆచారాల ప్రకారం కుక్కను తక్కెడలో పెట్టి తూచి మొక్కు చెల్లించడం దేవతలను అవమానించడమేనని భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదంపై వివరణ ఇస్తూ టీనా శ్రావ్య ఒక వీడియో సందేశాన్ని విడుదల చేసింది. తన పెంపుడు కుక్కకు 12 ఏళ్ల వయసు ఉందని ఇటీవల దానికి పెద్ద ట్యూమర్ సర్జరీ జరిగి ప్రాణాపాయం నుంచి కోలుకోవాలని తాను అమ్మవార్లకు మొక్కుకున్నానని ఆమె తెలిపారు. ఆ భక్తితోనే తాను ఈ పని చేశానని, ఎవరినీ కించపరచాలనే ఉద్దేశం తనకు లేదని వివరించారు. మేడారం సాంప్రదాయాల ప్రకారం ఇది తప్పని తనకు తర్వాతే తెలిసిందని, తన వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే మనస్ఫూర్తిగా క్షమించాలని ఆమె కోరారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగనివ్వనని, మన సంప్రదాయాలను ఎప్పుడూ గౌరవిస్తానని ఆమె హామీ ఇవ్వడంతో ఈ వివాదానికి తెరపడింది.

## రోడ్లన్నీ గుంతల మయం, రోడ్లు వేయరా?


**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్):**



'గ్రేటర్ హైదరాబాద్‌లో రహదారుల నిర్వహణ అధ్వానంగా ఉంది? ఎక్కడ చూసినా.. గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి? అధికారులు ఏం చేస్తున్నట్లు? మెరుగైన రహదారులే లక్ష్యంగా పనిచేయండి? హైదరాబాద్‌లో వాయు కాలుష్యం నానాటికీ పెరుగుతూ గాలి నాణ్యత క్షీణిస్తోంది? జీహెచ్ఎంసీ వాయు నాణ్యతను కాపాడడంలో ప్రధాన బాధ్యత తీసుకోవాలం'టూ జీహెచ్ఎంసీ అధికారుల పనితీరుపై హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. నగరంలో హెచ్ సిటీ ప్రాజెక్టుల్లో జాప్యం జరగవద్దని, పనులను వేగవంతం చేయాలన్నారు. ఫిబ్రవరి 10తో ప్రస్తుత జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు ముగియనున్న నేపథ్యంలో మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్‌తో కలిసి అధికారులకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. నగరంలో గాలి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి అధికారులకు సూచించారు. కాలుష్యానికి ప్రధాన కారణమైన పాత వాహనాలపై నిఘా ఉంచాలని, ఫిట్‌నెస్ లేని వాహనాలపై కఠినంగా వ్యహరించాలన్నారు. ప్రకృతిని కాపాడుకునేందుకు ప్రాధాన్యత నివ్వాలని మంత్రి అధికారులకు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇంకుడు గుంతల నిర్మాణ అంశంలో కఠినంగా వ్యవహరించాలని, ఇంటి నిర్మాణ సమయంలోనే ఇంకుడు గుంతలను తప్పనిసరిగా నిర్మించుకునేలా చూడాలని మంత్రి సూచించారు. విద్యుద్దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని, పూర్తిస్థాయిలో వెలిగేలా చూడాలన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణపైనే హైదరాబాద్ స్వచ్ఛ బ్రాండ్ ఇమేజ్ ఆధారపడి ఉందని చెప్పారు. స్వచ్ఛత కార్యక్రమాలు క్రమం తప్పకుండా ప్రభావంతంగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. బస్తీ దవాఖానా, ఇందిరమ్మ క్యాంటీన్‌లు సజావుగా నిర్వహించేలా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. అభివృద్ధి పనులపై ఆరా ఈ సమావేశంలో కేవలం పాలనాపరమైన అంశాలే కాకుండా, నగరంలో జరుగుతున్న ఎస్ఆర్‌డీపీ, హెచ్ సిటీ, ఎన్ఎస్‌డీపీ తదితర అభివృద్ధి పనులపైనా మంత్రి పొన్నం ప్రభాకర్ సుదీర్ఘంగా ప్రతిష్టాత్మక హెచ్‌సిటీ, ఎస్ఆర్‌డీపీ, ఎన్ఎస్‌డీపీ నాలా పనుల పురోగతిని సమీక్షించారు. పనులు ఏ దశలో ఉన్నాయి? ఎక్కడెక్కడ జాప్యం జరుగుతోంది? అనే విషయాలపై అదనపు కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. ఫిబ్రవరి 10న విభజనపై క్లారిటీ బల్దియా విభజనపై వచ్చే నెల ఫిబ్రవరి 10న ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. విభజన విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదని, ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుత పాలక వర్గం పదవీ కాలం మరో 20 రోజుల్లో ముగియనుండడంతో అధికారులపై మరింత బాధ్యత పెరగనుందన్నారు. నిత్యం అప్రమత్తంగా ఉంటూ పబ్లిక్ గ్రీవెన్స్ పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇకపై మీదే బాధ్యత హైదరాబాద్ మహానగరాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 డివిజన్లుగా విభజించిన నేపథ్యంలో.. ఆయా జోనల్ కమిషనర్లు, సర్కిల్ అధికారులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. పాలకమండలి గడువు ముగిసిన తర్వాత ప్రజా సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా అధికారుల భుజస్కంధాలపైనే ఉంటుందని తేల్చిచెప్పారు. ప్రజాప్రతినిధులు లేని సమయంలో ప్రజల నుంచి ఒత్తిడి పెరుగుతుందని, పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు వంటి అంశాలపై ప్రశ్నించేవాళ్లు ఎక్కువ అవుతారని హెచ్చరించారు. ప్రజల ప్రశ్నలకు, సమస్యలకు బదులు ఇచ్చేందుకు, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. జోనల్ స్థాయిలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ, వారిచేత పనిచేయించే బాధ్యత కమిషనర్‌దేనని మంత్రి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న అధికారులంతా కేవలం ఉద్యోగ బాధ్యతగానే కాకుండా, సామాజిక బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల తమ పాలకవర్గంలో సహకరించిన ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 22 మందికి మంత్రి పొన్నం, మేయర్ కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. గ్రేటర్‌లో స్వచ్ఛత కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా జరిగేందుకు పర్యవేక్షణ బాధ్యతలను మెడికల్ అధికారుల నుంచి ఇంజినీర్లకు అప్పగించినట్లు కమిషనర్ ఆర్ వీ కర్ణన్ తెలిపారు. హెచ్ సిటీ, ఎస్ఆర్‌డీపీ, డీసిల్టింగ్ పనులను టైమ్ బాండ్‌తో పూర్తి చేస్తామన్నారు. గ్రేటర్‌లో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను దశల వారీగా పెంచుతున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా మెరుగుపరిచేందుకు ఎంఎంటీఎస్ స్టేషన్, మెట్రో స్టేషన్‌లకు బస్ కనెక్టివిటీ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, అదనపు కమిషనర్లు సృజన, వినయ్ కృష్ణారెడ్డి, అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## 13 నెలల చిన్నారి అపహరణ

**తిరుపతి (ఏడీఎన్‌ఎన్):**




పదమూడు నెలల చిన్నారిని పొరుగు వారే అపహరించిన ఘటన తిరుపతిలో బుధవారం చోటుచేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... శ్రీకాళహస్తికి చెందిన మస్తాన్, సుచిత్ర దంపతులు ఉపాధి నిమిత్తం మూడు నెలల క్రితం తిరుపతికి వచ్చారు. చింతలచేను ప్రాంతంలో ఓ చిన్న గదిలో నివాసం వుంటూ వాడి పడేసిన వాటర్ బాటిళ్లు ఏరుకుని విక్రయించి జీవనం సాగిస్తున్నారు. వారికి జయశ్రీ అనే 13 నెలల పాప ఉంది. మస్తాన్ వుంటున్న గది పక్కనే మరో గదిలో తమిళనాడుకు చెందిన భార్యాభర్తలు మురుగన్ అలియాస్ కందన్, మారెమ్మ నివాసం ఉంటున్నారు. వీరు కూడా వ్యర్థ పదార్థాల వ్యాపారమే చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు జయశ్రీతో ప్రేమగా వుంటూ ఆడించేవారు. బుధవారం ఉదయం జయశ్రీని మారెమ్మ తీసుకెళ్లింది. ఇంటి పనులు ముగిశాక పాపను తెచ్చుకునేందుకు చూడగా మురుగన్, మారెమ్మ కనిపించలేదు. బయటకు వెళ్లారేమో అని చాలాసేపు ఎదురు చూసి ఎంతసేపటికీ రాకపోవడంతో వారి సెల్‌ఫోన్లకు ఫోన్ చేయగా అవి స్విచ్‌ఆఫ్ చేసి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చిన మస్తాన్, సుచిత్ర మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. పరిసర ప్రాంతాల సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. చిన్నారి జయశ్రీని మురుగన్, మారెమ్మ ఉదయం 10.30 గంటలకు టీవీఎస్ స్కూటీపై తీసుకెళ్లినట్లు సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. ప్రాథమిక విచారణలో మురుగన్, మారెమ్మ వేలూరు కాంచీపురం ప్రాంతానికి చెందినవారని పోలీసులు నిర్ధారించారు. మారెమ్మకు మురుగన్ నాల్గవ భర్త అని గుర్తించిన పోలీసులు ఆమె మునుపటి భర్తలు, వారి పిల్లలతో ఫోన్‌లో మాట్లాడగా.. ఆమెతో ఎటువంటి సంబంధం లేదని వారు చెప్పినట్టు తెలిసింది. మురుగన్, మారెమ్మ ప్రస్తుత జాడ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు తమిళనాడు కాంచీపురం చేరుకున్నాయి. త్వరలోనే జయశ్రీని సురక్షితంగా తీసుకొస్తామని మీరేమి భయపడనక్కరలేదని సీఐ శ్రీనివాసులు భరోసాగా చెప్పారు.



### కరాటే కళ్యాణిపై దాడి
## ఘటనలో నరేందర్ అరెస్ట్

**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్):**

సినీ నటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణిపై దాడి ఘటనలో యూట్యూబర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సిద్ధమౌని నరేందర్‌ను పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం పేరును దుర్వినియోగం చేస్తూ లక్కీ డ్రా పేరుతో కోట్ల రూపాయలు వసూళ్లు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడని నరేందర్‌పై కరాటే కళ్యాణి గతంలో పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. రూ.399 కే ఫార్చ్యూనర్ కారు, ఐఫోన్ వంటి బహుమతులు గెలుచుకోవచ్చని తప్పుడు ప్రచారం చేస్తూ అమాయకుల నుంచి నరేందర్ డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆదిభట్ల సమీపంలోని వండర్లా పరిసరాల్లో ఫార్చ్యూనర్ కారు పేరుతో లక్కీ డ్రా ప్రచారం చేస్తుండగా.. నరేందర్‌ను కరాటే కళ్యాణి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అదే సమయంలో ఆమెతో పాటు పంజాగుట్ట పోలీసులు వెళ్లారు. ఈ క్రమంలో కళ్యాణిపై దాడి చేసేందుకు 10 మంది యత్నించారు. ఆమె చున్నీ లాగేసి భయపెట్టే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. దీంతో తనపట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ కళ్యాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు నరేందర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అతడిపై బీఎన్ఎస్ సెక్షన్లు 74, 75, 79, 115(2), 132, 351(2), 352 కింద కేసు నమోదు చేశారు. నరేందర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అతడిపై మోసాలు, దాడి ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.



### తిరుమలలో
## కొనసాగుతున్న భక్తుల రద్దీ

**తిరుమల (ఏడీఎన్‌ఎన్):**

శ్రీ శ్రీనివాస గోవిందా.. శ్రీ వేంకటేశా గోవిందా అంటూ భక్తులు తిరుమల సన్నిధికి చేరుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 17 కంపార్టుమెంట్లు పూర్తిగా నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి 18 గంటలు సమయం పడుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని (జనవరి 21) 74,056 మంది భక్తులు దర్శించుకోగా 27,517 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ.3.98 కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు. కాగా, నేడు ఏప్రిల్ నెల దర్శనం టికెట్లు విడుదల కానున్నాయి. వీటికి సంబంధించిన టెక్కెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ఆర్జిత సేవా టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవా టిక్కెట్లు విడుదల కానున్నాయి. భక్తులు టీటీడీ అధికార వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు. అలాగే ఈ నెల 25వ తేదీన శ్రీవారి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. దీంతో ఎల్లుండి నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలో సర్వదర్శనం కోసం భక్తులకు జారీచేసే టోకెన్లను రద్దు చేశారు. 25వ తేదీన ప్రత్యేక దర్శనాలు, ఆర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తులు ఈ మార్పులను గమనించాలని సూచించారు.

### మా ఆయన్ని ఏం చేశారు అంటూ
## పోలీసులను అడిగిన మహిళ..?

**అనంతపురం (ఏడీఎన్‌ఎన్):**



'వాకింగ్‌కు వెళ్లిన నా భర్తను పోలీసులు తీసుకెళ్లి మూడు రోజులైంది. పిల్లలు ఏడుస్తున్నారు. ఏం సమాధానం చెప్పాలి?' అని టమోటా మండీ మేనేజర్ రాజేంద్రనాయుడు భార్య దుర్గాభవాని కన్నీటి పర్యంతమయ్యారు. తన పిల్లలు, బంధువులతో కలిసి ఆమె బుధవారం సాయంత్రం ఎస్పీ బంగ్లా వద్ద ధర్నాకు దిగారు. తమది పశ్చిమ గోదావరి జిల్లా తణుకు అని, 12 ఏళ్ల కిందట అనంతపురం వచ్చామని ఆమె అన్నారు. తన భర్త జీఎన్ఆర్ మండీలో మేనేజర్‌గా పనిచేస్తున్నారని, సోమవారం వాకింగ్‌కు వెళ్లినప్పుడు పోలీసులు తీసుకెళ్లారని తెలిపారు. ఆయన ఏమయ్యాడో పోలీసులు చెప్పడం లేదని, ఎందుకు తీసుకెళ్లారో చెప్పాలని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు అక్కడికి చేరుకుని, ఆందోళన విరమించాలని వారిని కోరారు. రాజేంద్ర ఇంటికి వస్తాడని, ఇంటికి వెళ్లాలని ఆయన హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించి, ఇంటికి వెళ్లిపోయారు.

### ప్రైవేట్ బస్సు టైరు పేలి దగ్ధం..
## ముగ్గురి మృతి

**నంద్యాల (ఏడీఎన్‌ఎన్):**



ఆళ్లగడ్డ - అర్ధరాత్రి సమయం.. ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్ టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డు అవతలి వైపు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని కాలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు నుంచి 36 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ఎఆర్‌బీసీవీఆర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బుధవారం అర్ధరాత్రి 2 గంటలు దాటాక నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం శిరివెళ్లమెట్ట వద్ద ప్రమాదానికి గురైంది. టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు లారీ డ్రైవర్, క్లీనర్ మృతి చెందారు. ప్రమాదం జరిగిన తర్వాత బస్సుకు మంటలు వ్యాపించాయి. ఆ దారిన వెళ్తున్న డీసీఎం డ్రైవర్ వాహనాన్ని ఆపి బస్సు అద్దాలను పగలగొట్టడంతో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. కిటికీల్లోంచి దూకేయడంతో పదిమందికి పైగా ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. మంటలు విస్తరించడంతో లారీ కూడా కాలిపోయింది. బస్సు డ్రైవర్‌తో పాటు లారీ చోదకుడు, క్లీనర్ మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయి. ప్రయాణికుల లగేజీ మొత్తం కాలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించారు.



## యూరప్‌లో మరో టీ20 లీగ్‌కు ఐసీసీ గ్రీన్ సిగ్నల్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచవ్యాప్తంగా టీ20 క్రికెట్‌కు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో, యూరప్‌లో మరో టీ20 లీగ్ పోటీకి సిద్ధమయ్యింది. 'యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్' (ETPL) పేరుతో కొత్త టీ20 లీగ్ నిర్వహణకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ లీగ్‌ను 'రూల్స్ గ్లోబల్' సంస్థతో కలిసి ఐర్లాండ్ క్రికెట్ బోర్డు నిర్వహించనుంది. యూరప్ లో క్రికెట్ విస్తరణే లక్ష్యంగా ఈ టోర్నీని ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ లీగ్ కు బాలీవుడ్ ప్రముఖ నటుడు అభిషేక్ బచ్చన్ కూడా మద్దతుగా నిలవడం విశేషం. ఆయనతో పాటు పలువురు అంతర్జాతీయ వ్యాపారవేత్తలు 'రూల్స్ గ్లోబల్' సంస్థలో భాగస్వాములుగా ఉన్నారు. ఇప్పటికే ఈ లీగ్ కు సంబంధించిన మూడు ఫ్రాంచైజీల కొనుగోలు ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం. ఆమ్ స్టర్ డామ్ ఫ్రాంచైజీకి ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ స్టీవ్ వా యజమానిగా వ్యవహరిస్తున్నారు. ఆయనతో పాటు మూడు ఒలింపిక్ పతకాలు, రెండు ప్రపంచకప్పులు గెలిచిన జట్లలో సభ్యుడైన ఆస్ట్రేలియా హాకీ దిగ్గజం జేమీ డ్వేయర్ కూడా సహ యజమానిగా ఈ జట్టుతో చేతులు కలపడం గమనార్హం. ఇక ఎడిన్ బర్గ్ జట్టును న్యూజిలాండ్ మాజీ క్రికెటర్లు నాథన్ మెకల్లమ్, కైల్ మిల్స్ కలిసి సొంతం చేసుకున్నారు. బెల్ఫాస్ట్ జట్టుకు ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ గ్లెన్ మ్యాక్స్ వెల్ యజమానిగా వ్యవహరిస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈటీపీఎల్ ఈ ఏడాది ఆగస్టు నెలలో జరగనుంది. ఇటీవల యూరప్‌లో కూడా క్రికెట్‌కు ఆదరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఈ లీగ్ విజయవంతం అవుతుందనే నమ్మకాన్ని నిర్వాహకులు వ్యక్తం చేస్తున్నారు. యూరోప్ క్రికెట్ భవిష్యత్తులో ఈ టోర్నీ కీలక మైలురాయిగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## రాణించిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మూడు రోజుల నష్టాలకు బ్రేక్ ఇస్తూ గురువారం స్టాక్ మార్కెట్లు లాభాల బాట పట్టాయి. అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, వాణిజ్య రంగంలో సానుకూల సంకేతాలు కనిపించడంతో మార్కెట్లో పాజిటివ్ సెంటిమెంట్ ఏర్పడింది. ఈయూపై విధించిన టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గడం, అలాగే భారత్‌తో త్వరలోనే "అద్భుతమైన ట్రేడ్ డీల్" కుదరబోతోందంటూ దావోస్ వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపాయి. ఫలితంగా వరుసగా మూడు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. కరెన్సీ మార్కెట్లో డాలరుతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠాల నుంచి కొంత కోలుకుని 91.62 వద్ద కొనసాగింది. సెన్సెక్స్ 30 షేర్లలో బీఈఎల్, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇక ఎటర్నెల్, టైటాన్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 64.55 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు ధర 4,824 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ పరిణామాలు అనుకూలంగా కొనసాగితే వచ్చే సెషన్లలో కూడా మార్కెట్లో స్థిరమైన పాజిటివ్ ట్రెండ్ కనిపించే అవకాశముందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




## జియో బ్లాక్‌రాక్ ఏఎంసీకి 10 లక్షల ఇన్వెస్టర్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

జియో బ్లాక్‌రాక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ చాలా తక్కువ సమయంలోనే భారీగా ఇన్వెస్టర్లను సంపాదించింది. ఈ ఏడాది మే నెలలో సేవలు ప్రారంభించి ఇప్పటివరకు సంస్థ 10 లక్షల మంది ఇన్వెస్టర్లను సొంతం చేసుకున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో సిద్ స్వామినాథన్ వెల్లడించారు. ఈ మొత్తం ఇన్వెస్టర్లలో 18 శాతం మంది తొలిసారి మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడులు పెట్టినవారని ఆయన తెలిపారు. ముఖ్యంగా 40 శాతం మంది టాప్30 పట్టణాలకు వెలుపలి ప్రాంతాల నుంచి రావడం విశేషమని పేర్కొన్నారు. ఇది పరిశ్రమ సగటు 28 శాతంతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉందన్నారు. టెక్నాలజీ వినియోగాన్ని విస్తృతంగా అమలు చేయడం, ఇన్వెస్టర్లకు అవగాహన పెంచడంపై దృష్టి పెట్టడమే ఈ మార్కెట్ విస్తరణకు ప్రధాన కారణమని సిద్ స్వామినాథన్ వివరించారు. ప్రస్తుతం జియో బ్లాక్‌రాక్ ఏఎంసీ నిర్వహణలోని మొత్తం పెట్టుబడులు రూ.13,700 కోట్లకు చేరుకున్నట్లు తెలిపారు. ఇందులో ఈక్విటీ ఆస్తులు సుమారు 30 శాతం వాటాను కలిగి ఉన్నాయని వెల్లడించారు. భవిష్యత్‌లో స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (SIF), ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ETF)లను ప్రవేశపెట్టడంతో పాటు, గిఫ్ట్ సిటీ (GIFT City) ద్వారా అంతర్జాతీయ పెట్టుబడి అవకాశాలను కూడా ఇన్వెస్టర్లకు అందించనున్నట్లు ఆయన చెప్పారు. స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ ప్రారంభానికి సంబంధించి సెబీ నుంచి ఇటీవలే నిరభ్యంతర పత్రం (NOC) లభించినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే జియో బ్లాక్‌రాక్ సెక్టార్ రొటేషన్ ఫండ్ ఎన్ఎఫ్ ఈ నెల 27న ప్రారంభం కానుండటం గమనార్హం. ఈ ఫండ్ రంగాల వారీగా, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా పెట్టుబడుల్లో మార్పులు చేస్తూ, దీర్ఘకాలంలో అధిక రాబడులు అందించే లక్ష్యంతో పనిచేయనుంది.

## 500 విజయాలతో చరిత్ర సృష్టించిన పీవీ సింధు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



భారత బ్యాడ్మింటన్‌కు గర్వకారణమైన పీవీ సింధు మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఇండోనేసియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్ లో ఆమె కెరీర్‌లో 500వ మ్యాచ్ విజయాన్ని నమోదు చేసింది. ఈ ఘనత సాధించిన ఆరో మహిళల సింగిల్స్ షట్లర్‌గా, అలాగే తొలి భారతీయురాలిగా సింధు చరిత్ర సృష్టించింది. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్స్ లో డెన్మార్క్ కు చెందిన లైన్ హోజా మార్క్ జాయర్ఫెల్డ్ తో తలపడిన సింధు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 43 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో 21-19, 21-18 తేడాతో ప్రత్యర్థిని వరుస సెట్లలో ఓడించింది. ఈ విజయంతోనే సింధు కెరీర్‌లో 500 మ్యాచ్‌ల గెలుపు మైలురాయిని అందుకుంది. ఇప్పటివరకు లైన్ హోజా మార్క్ తో జరిగిన ఆరు మ్యాచ్‌లలో ఇది సింధుకు ఐదో విజయం కావడం విశేషం. ప్రారంభ రౌండ్‌లో జపాన్‌కు చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారిణి మనామీ సుయిజు చేతిలో ఓటమి పాలైనప్పటికీ, కీలక పోరులో సింధు తన అనుభవం, పట్టుదలను చూపించింది. ఇటీవల మలేసియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్‌లో సెమీఫైనల్స్ వరకూ చేరిన సింధు, గత వారం ఇండియా ఓపెన్‌లో మాత్రం తొలి రౌండ్‌లోనే నిష్క్రమించి నిరాశపరిచింది. ప్రస్తుతం ప్రపంచ 13వ ర్యాంకులో ఉన్న ఆమె, ఈ టోర్నీలో టాప్ సీడ్ ప్రపంచ నం.4 చైనా స్టార్ షట్లర్ చెన్ యు ఫీతో తలపడనుంది. సింధు-చెన్ యు ఫీ ఇప్పటివరకు 13 సార్లు ఒకరినొకరు ఎదుర్కొన్నారు. ఇందులో సింధు 7 మ్యాచ్‌లు గెలవగా, ఫీ 6 విజయాలు సాధించింది. చివరిసారిగా 2019లో ఫీపై గెలిచిన సింధు, మరోసారి ఆమెను ఓడించి తన రికార్డును మరింత మెరుగుపరుచుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

## టీమిండియా అంటే తప్పలేదు: సుప్రీం కోర్టు



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారత క్రికెట్ నియంత్రణ మండలి జట్టును 'టీమ్ ఇండియా'గా పిలవకుండా ప్రసార భారతిని ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ అభ్యర్థనలో ఎలాంటి చట్టపరమైన బలం లేదని స్పష్టం చేసింది. బీసీసీఐ ఒక ప్రైవేట్ సంస్థ కాబట్టి దాని జట్టును జాతీయ జట్టుగా 'టీమ్ ఇండియా'గా పిలవకూడదని పిటిషనర్ వాదించాడు. అయితే ఈ వాదనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ఇలాంటి పిటిషన్లు న్యాయవ్యవస్థ సమయాన్ని వృథా చేస్తున్నాయని వ్యాఖ్యానించింది. అంతకుముందు ఇదే అంశంపై ఢిల్లీ హైకోర్టు కూడా పిటిషన్‌ను తిరస్కరించిన విషయం తెలిసిందే. ఆ తీర్పును సుప్రీంకోర్టు సమర్థిస్తూ, ప్రసార భారతి బీసీసీఐ జట్టును 'టీమ్ ఇండియా'గా పిలవడంలో ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేసింది. దీంతో, భారత క్రికెట్ జట్టును ప్రసార మాధ్యమాలు 'టీమ్ ఇండియా'గా పేర్కొనడంపై ఉన్న వివాదానికి ముగింపు పలికినట్లైంది.

## డకౌట్‌గా వెనుదిరిగిన శుభ్‌మన్ గిల్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**




రాజ్ కోట్‌లోని నిరంజన్ షా స్టేడియం వేదికగా జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో సౌరాష్ట్ర-పంజాబ్ జట్ల మధ్య పోరు ఆసక్తికరంగా మారింది. ఈ మ్యాచ్ లో శుభ్ మన్ గిల్ అభిమానులను నిరాశ పరిచాడు. ఒక్క పరుగు కూడా తీయకుండా డకౌట్‌గా వెనుదిరిగాడు. తొలి ఇన్నింగ్స్ లో సౌరాష్ట్ర కేవలం 172 పరుగులకే ఆలౌట్ కావడంతో పంజాబ్ భారీ ఆధిక్యం సాధిస్తుందని అంచనాలు వినిపించాయి. స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ జట్టులోకి రావడంతో పాటు కెప్టెన్సీ బాధ్యతలు కూడా అతనికే అప్పగించడంతో పంజాబ్ మరింత బలంగా కనిపించింది. అయితే మ్యాచ్‌లో అనూహ్య మలుపు తిరిగింది. సౌరాష్ట్ర బౌలర్లు అద్భుతంగా రాణిస్తూ పంజాబ్ బ్యాటింగ్‌ను కుదిపేశారు. ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన శుభ్‌మన్ గిల్ పూర్తిగా విఫలమయ్యాడు. సౌరాష్ట్ర స్పిన్నర్ పార్థ్ భుత్ వేసిన అద్భుతమైన బంతికి గిల్ ఎల్బీడబ్ల్యూగా అవుట్ అయ్యాడు. కేవలం రెండు బంతులు మాత్రమే ఎదుర్కొన్న గిల్ ఖాతా తెరవకుండానే డకౌట్ అయిపోయాడు. గిల్ వికెట్ పంజాబ్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. అంతకుముందే నేహాల్ వధేరాను అవుట్ చేసిన పార్థ్ భుత్, వెంటనే గిల్‌ను కూడా పెవిలియన్‌కు పంపి మ్యాచ్‌ను సౌరాష్ట్ర వైపు తిప్పాడు. ఒక ఇన్నింగ్స్ లో 44 పరుగులిచ్చి 7 వికెట్లు తీసిన ఘనత పార్థ్ భుత్‌కు ఉండడం విశేషం. పంజాబ్ జట్టు కేవలం 73 పరుగులకే ఐదు కీలక వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. ముందుగా సౌరాష్ట్ర బ్యాటింగ్‌ను హర్ ప్రీత్ బ్రార్ ఆరు వికెట్లతో కట్టడి చేయగా, ఇప్పుడు సౌరాష్ట్ర బౌలర్లు అదే స్థాయిలో ప్రతిఘటించారు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ నేపథ్యంలో బిజీగా ఉంటాడని భావించినప్పటికీ, దేశవాళీ క్రికెట్‌పై ఉన్న మక్కువతో గిల్ ఈ రంజీ మ్యాచ్‌లో పాల్గొనడం విశేషంగా నిలిచింది. అయితే అతని ఈ మ్యాచ్ ప్రదర్శన మాత్రం అభిమానులను నిరాశపరిచింది.

## ఆస్ట్రేలియా సిరీస్ ప్రోమో వీడియోలో భారత్‌ను లాగిన పాక్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



ఆస్ట్రేలియాతో జరగనున్న టీ20 సిరీస్ ప్రచారంలో భాగంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) విడుదల చేసిన ఏఐ వీడియో వివాదాస్పదమైంది. మొదట ఇది సాధారణ క్రికెట్ ప్రమోషన్‌లా కనిపించినప్పటికీ, వీడియోలోని ఒక సంభాషణ రాజకీయ అర్థాలకు దారి తీసింది. భారత్ పాక్ మ్యాచ్ లోని హ్యాండ్ షేక్ వివాదాన్ని గుర్తు చేసే ఈ వీడియో నిమిషాల్లోనే వైరల్‌గా మారింది. సినిమాటిక్ టచ్‌తో రూపొందించిన ఈ వీడియోలో పాకిస్తాన్ వీధులు, క్రికెట్ వాతావరణం, అతిథి సంస్కృతి చూపిస్తూ ఆస్ట్రేలియా జట్టుకు ఇచ్చే స్వాగతాన్ని హైలైట్ చేశారు. అంతర్జాతీయ క్రికెట్ మళ్లీ పాకిస్తాన్‌కు వస్తోందన్న సందేశాన్ని బలంగా చాటే ప్రయత్నం చేశారు. అయితే వీడియోలో కొన్ని సెకన్ల పాటు వచ్చే ఒక సన్నివేశమే సోషల్ మీడియాలో చర్చకు కేంద్రంగా మారింది. ఓ వ్యక్తి ఆస్ట్రేలియన్ టూరిస్టుతో "మీరు హ్యాండ్‌షేక్ మర్చిపోయారు... పక్క దేశం వాళ్ల దగ్గర కూడా ఆగి వచ్చారా?" అని అనడం భారత్-పాక్ హ్యాండ్‌షేక్ వివాదాన్ని ఉద్దేశించినట్టుగా ఉందని నెటిజన్లు అభిప్రాయపడ్డారు. దీంతో ఈ వీడియోపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మార్కెటింగ్ పరంగా ఈ వీడియో పీసీబీకి విస్తృత ప్రచారాన్ని తెచ్చిపెట్టింది. అదే సమయంలో క్రికెట్ ప్రచారాన్ని మించి రాజకీయ కోణంలోకి వెళ్లిందన్న విమర్శలు కూడా ఎదురయ్యాయి. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరగనుంది. టీ20 వరల్డ్ కప్‌కు ముందు ఈ సిరీస్ ఇరు జట్లకు కీలకంగా మారిన వేళ, పీసీబీ ప్రమో వీడియో అనవసర వివాదాన్ని రేపినట్లు క్రీడా వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

## బడ్జెట్ లో రైతన్నలకు గుడ్ న్యూస్ చెప్తారా?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ 2026 సమర్పించనున్నారు. దేశ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణం నేపథ్యంలో ఈ బడ్జెట్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రైతుల నుంచి ఉద్యోగులు, నిపుణుల వరకు అన్ని వర్గాలకు ఊరట కలిగించే కీలక ప్రకటనలు ఉంటాయని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రైతులు ఈ బడ్జెట్‌పై ప్రత్యేక ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా పీఎం కిసాన్ పథకం కింద ప్రస్తుతం అందుతున్న వార్షిక రూ.6,000 సాయాన్ని పెంచాలని కోరుతున్నారు. పెరిగిన వ్యవసాయ ఖర్చుల నేపథ్యంలో ఈ మొత్తాన్ని రెట్టింపు చేయాలన్నా లేదా కనీసం రూ.10,000కు పెంచాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. మన దేశానికి వెన్నెముక అయిన వ్యవసాయ రంగంలో ఈసారి భారీ మార్పులు రాబోతున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. ఇప్పటివరకు "ఎక్కువ పంట పండించాలి" అనే దిశగా సాగిన అడుగులు, ఇప్పుడు "నాణ్యమైన, పోషకాలున్న పంటలు పండించాలి" అనే వైపు మళ్లుతున్నాయి. పురుగుమందులపై జీఎస్టీని 18శాతం నుండి 5శాతానికి తగ్గించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే బయో పెస్టిసైడ్స్ పై పన్ను తగ్గించిన ప్రభుత్వం.. ఈ సారి బడ్జెట్ లో సాధారణ పురుగుమందులపై కూడా ఊరటనిస్తుందని రైతులు ఆశిస్తున్నారు. భారతదేశం ఇంత అభివృద్ధి చెందుతున్నప్పటికీ వ్యవసాయ రంగంలో కొంత వెనుకబడే ఉన్నాం. మనం ఇప్పటికీ ఎరువుల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతున్నాం. ఈ బడ్జెట్ లో 'ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్' (PLI) స్కీమ్ ను బయోఫెర్టిలైజర్ రంగానికి కూడా విస్తరించాలని డిమాండ్ వినిపిస్తోంది. దీనివల్ల మన దేశంలోనే ఎరువుల తయారీ పెరుగుతుంది, ఫలితంగా ప్రభుత్వంపై సబ్సిడీ భారం కూడా తగ్గుతుంది.

## గ్రీన్ లాండ్‌లో విచిత్రమైన భూమి చట్టాలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలతో గ్రీన్ లాండ్ అంతర్జాతీయంగా వార్తల్లో నిలుస్తోంది. ఈ విస్తారమైన ద్వీప ప్రాంతాన్ని తిరిగి చేజిక్కించుకోవాలన్న ఆశని ట్రంప్ పలుమార్లు వ్యక్తం చేయడంతో నెటిజన్లు గ్రీన్ లాండ్ గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. డెన్మార్క్ రాజ్యంలో భాగమైన ఈ స్వయంప్రతిపత్త ప్రాంతాన్ని కొనుగోలు చేయాలని అమెరికా ఆసక్తి చూపుతున్నా, ఇక్కడ అమలులో ఉన్న భూ యాజమాన్య చట్టాలు ప్రపంచంలోనే అత్యంత కఠినంగా, విచిత్రంగా ఉండడం వల్ల అంత తేలిగ్గా సాధ్యమయ్యే పని కాదు. ఎందుకంటే గ్రీన్లాండ్‌లో ఎవరైనా ఇల్లు కొనుగోలు చేయవచ్చు. కానీ భూమిని స్వంతం చేసుకోవడం మాత్రం సాధ్యం కాదు. ఎందుకంటే ఈ ద్వీపంలోని మొత్తం భూమి ప్రభుత్వానిదే. ప్రైవేట్ భూ యాజమాన్యానికి ఇక్కడ అనుమతి లేదు. స్థానికులు, సంస్థలు లేదా సహకార గృహ సంఘాలకు భూమిని వినియోగించుకునే హక్కు మాత్రమే ఉంటుంది. కానీ భూమి అసలు యజమాని ప్రభుత్వమే. గ్రీన్లాండ్ భూ చట్టాలు ఒక స్పష్టమైన తాత్విక సిద్ధాంతంపై ఆధారపడి ఉన్నాయి. అదేంటంటే - భూమి వ్యక్తిగత యాజమాన్యంలో ఉండకూడదు. అది సమష్టిగా ప్రజలందరికీ చెందాలి. ఈ భావన ఇక్కడి చట్ట వ్యవస్థలో లోతుగా నాటుకుపోయింది. గ్రీన్లాండ్, డెన్మార్క్ లేదా ఫారో దీవుల పౌరులు ఇక్కడ ఆస్తిని కొనుగోలు చేయవచ్చు. అలాగే కనీసం రెండు సంవత్సరాలు గ్రీన్లాండ్‌లో నివసించి, పన్నులు చెల్లించిన వారు కూడా సైట్ కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి ఇల్లు కేటాయిస్తారు. గ్రీన్లాండ్‌లోని పెద్ద పట్టణాలు ప్రస్తుతం తీవ్రమైన గృహాల కొరతను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ప్రభుత్వమే లేదా ప్రైవేట్ కంపెనీలు ప్రత్యేక వసతి సదుపాయాలను కల్పిస్తున్నాయి. రాజధాని నుక్‌లో ఇంటికి సైట్ కేటాయింపు రావడానికి సగటున 10 నుంచి 12 సంవత్సరాల వరకు వేచి చూడాల్సి వస్తోంది. గ్రీన్లాండ్ లో హౌసింగ్ కంపెనీలు పబ్లిక్ హౌసింగ్‌తో పాటు ఇతర ఆస్తులను నిర్వహిస్తాయి. మీరు ఒక ఇల్లు కొనుగోలు చేసినా, ఆ ఇంటి కింద ఉన్న భూమి వినియోగానికి సంబంధించి స్థానిక మునిసిపాలిటీ నుంచి "సైట్ కేటాయింపు" తప్పనిసరిగా పొందాలి. ఈ అనుమతి వచ్చిన తర్వాత మాత్రమే ఆ భూమిని ఉపయోగించుకునే హక్కు ఉంటుంది. అయితే దాన్ని కొనుగోలు చేయడం మాత్రం సాధ్యం కాదు.



## నెట్టింట హాట్ టాపిక్‌గా శశిథరూర్‌కు గంభీర్ రిప్లై

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్, టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పందనతో ప్రస్తుతం నెట్టింట పెద్ద చర్చకు దారితీస్తోంది. న్యూజిలాండ్ తో జరగనున్న తొలి టీ20 మ్యాచ్ కు ముందు శుభాకాంక్షలు తెలియజేస్తూ శశిథరూర్ 'ఎక్స్' వేదికగా గంభీర్‌ను ప్రశంసించారు. బుధవారం నాగ్ పూర్లో గంభీర్‌తో సమావేశమైన అనంతరం థరూర్ ఈ పోస్ట్ చేశారు. "ప్రధానమంత్రి తర్వాత భారతదేశంలో అత్యంత కష్టమైన ఉద్యోగాల్లో ఒకటి టీమ్ ఇండియా హెడ్ కోచ్ బాధ్యత. ప్రతిరోజూ లక్షలాది మంది అతడి నిర్ణయాలను విమర్శించినా, గంభీర్ ఎంతో ప్రశాంతంగా, దృఢ సంకల్పంతో, నిశ్శబ్దంగా ముందుకు సాగుతున్నాడు. అతడి సమర్థవంతమైన నాయకత్వానికి నా అభినందనలు" అంటూ ఆయన కొనియాడారు. ఈ ప్రశంసలకు గంభీర్ కూడా వెంటనే స్పందించాడు. "కృతజ్ఞతలు. అంతా పూర్తిగా సెటిల్ కావడానికి ఇంకాస్త సమయం పడుతుంది. అప్పుడు కోచ్‌కు అవసరమైన అధికారాలు సాకారమవుతాయి. అయితే ఈలోగా నన్ను నా సొంత జట్టు సభ్యులకే వ్యతిరేకంగా చూపించడం ఆశ్చర్యంగా ఉంది" అంటూ రిప్లై ఇచ్చాడు. గంభీర్ ఈ వ్యాఖ్యల్లో ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించకపోయినా, ప్రస్తుతం తనకు కోచ్ గా పూర్తి స్థాయి స్వేచ్ఛ, అధికారాలు లేవన్న సంకేతాన్ని మాత్రం స్పష్టంగా ఇచ్చాడు. అతడి సమాధానం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీస్తోంది. ఇటీవల కాలంలో గంభీర్ కోచింగ్ విధానంపై టీమ్ ఇండియా అభిమానుల నుంచి మిశ్రమ స్పందన వస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా న్యూజిలాండ్‌లో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 12 తేడాతో కోల్పోయిన తర్వాత, గంభీర్‌పై సోషల్ మీడియాలో ట్రోలింగ్ మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో శశిథరూర్ ప్రశంసలు, గంభీర్ స్పందన క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమయ్యాయి.




## టీ20 నుండి బంగ్లాదేశ్ డ్రాప్.. స్కాట్లాండ్‌కి ఛాన్స్

### వేదిక మార్పు విజ్ఞప్తిని తిరస్కరించిన ఐసీసీ

### టీ20 వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టీ20 ప్రపంచకప్-2026లో ఆడబోమంటూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. భారత్‌లో జరిగే మ్యాచ్ లకు తమ జట్టు వెళ్లలేదని, భద్రతా ఆందోళనలు, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని బీసీబీ పోటీ నుండి తప్పుకుంది. దీంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్ ను టోర్నీలోకి తీసుకుంటున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) ప్రకటించింది. భారత్‌లో జరగాల్సిన తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బీసీబీ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తిరస్కరించింది. జనవరి 21న జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ అంశంపై చర్చించిన అధికారులు, భారత్‌లో భద్రతాపరమైన సమస్యలు లేవని, షెడ్యూల్ మార్పు సాధ్యం కాదని తేల్చిచెప్పారు. భారత్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్‌కు ఇచ్చిన గడువును కూడా బీసీబీ తిరస్కరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఢాకాలో బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లాం, క్రీడా సలహాదారు అసిఫ్ నజ్రుల్, ఆటగాళ్లు లిట్టన్ దాస్, నజ్ముల్ హొస్సేన్ షాంటో తదితరులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆటగాళ్లకు ప్రపంచకప్ ఆడాలనే ఆసక్తి ఉన్నప్పటికీ, ప్రభుత్వ నిర్ణయానికే కట్టుబడి ఉండాలని బీసీబీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఐసీసీతో చర్చలు కొనసాగిస్తామని, తమ వైఖరిలో మార్పు లేదని బీసీబీ అధ్యక్షుడు పేర్కొన్నారు. గతంలో ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి తప్పించినప్పటి నుంచి భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తాజా పరిణామం ఆ వివాదానికి కొనసాగింపుగానే క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. అయితే 2022లో ఐసీసీతో కుదిరిన ఒప్పందం ప్రకారం టోర్నీ నుంచి తప్పుకున్నా బీసీబీకి ఆర్థిక నష్టం ఉండదని బోర్డు వర్గాలు తెలిపాయి. ఇక గ్రూప్-సిలో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్, ఇంగ్లండ్, వెస్టిండీస్ వంటి జట్లతో తలపడనుంది. ఈ నిర్ణయం అంతర్జాతీయ క్రికెట్‌లో మరోసారి చర్చనీయాంశంగా మారింది.





## డా.రెడ్డీస్ త్రైమాసిక లాభం రూ.1210 కోట్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి సంబంధించిన లెక్కలు వెల్లడించింది. ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.8,726.8 కోట్ల ఆదాయం, రూ.1,210 కోట్ల నికర లాభం నమోదు చేసింది. ఒక్కో షేరుకు లాభం రూ.14.53గా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.8,358.6 కోట్లు, నికర లాభం రూ.1,413 కోట్లుగా ఉన్నాయి. దీనితో పోలిస్తే ప్రస్తుత త్రైమాసికంలో ఆదాయం 4.4 శాతం పెరిగినప్పటికీ, నికర లాభం 14 శాతం తగ్గింది. బ్రాండెడ్ ఔషధాల మార్కెట్లో బలమైన వృద్ధి కొనసాగినప్పటికీ, అమెరికాలో కీలక ఔషధమైన లెనాలిడోమైడ్ విక్రయాలు తగ్గడం, అలాగే కొత్త లేబర్ కోడ్ నిబంధనల అమలుతో ఏర్పడిన అదనపు ఖర్చులు నికర లాభంపై ప్రతికూల ప్రభావం చూపినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ ఫలితాల సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ సహ ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ మాట్లాడుతూ, "2025-26 మూడో త్రైమాసికంలో మా వృద్ధికి బ్రాండెడ్ వ్యాపారాల జోరు ప్రధానంగా సహకరించింది. విదేశీ మారక ద్రవ్య విలువలు మాకు మద్దతుగా నిలిచాయి. ఇది లెనాలిడోమైడ్ విక్రయాల తగ్గుదల ప్రభావాన్ని చాలా వరకు భర్తీ చేసింది. మా వాటాదారులకు దీర్ఘకాలిక విలువను సృష్టించేందుకు భవిష్యత్తు వ్యూహాల అమలు, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారిస్తున్నాం" అన్నారు.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
శుక్రవారం | హైదరాబాద్
23.01.2026
www.manasarkar.com



## మెగా బ్లాక్‌బస్టర్ బృందానికి శుభాకాంక్షలు

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

నాలుగు దశాబ్దాలకు పైగా సినీ ప్రయాణంలో మెగాస్టార్ చిరంజీవి ఎన్నో సంచలనాలు సృష్టించారు. తాజాగా 'మన శంకర వరప్రసాద్ గారు'తో మరోసారి సరికొత్త రికార్డులు నెలకొల్పారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రం, సంక్రాంతి కానుకగా ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ ప్రత్యేక పాత్ర పోషించడం విశేషం. మెగా అభిమానులతో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా మలిచిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం, బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపిస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, చిరంజీవి సినీ ప్రయాణంలో అతి పెద్ద విజయంగా నిలిచింది. ఈ నేపథ్యంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి చెందిన పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపింది. "మెగా బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి గారికి, అలాగే 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర యూనిట్ మొత్తానికి హృదయపూర్వక శుభాకాంక్షలు. నాలుగు దశాబ్దాలకు పైగా చిరంజీవి గారు ప్రజల హృదయాలకు అత్యంత దగ్గరగా నిలుస్తూ.. అదే తపన, అదే ఉత్సాహంతో తన నటన, హాస్యం, నృత్యాల ద్వారా ప్రేక్షకులను నిరంతరం అలరిస్తున్నారు.



## మరోసారి హిట్ కాంబో..

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

తమిళ చిత్ర పరిశ్రమలో విశాల్ సుందర్.సి కాంబో విజయవంతమైనది. వీరిద్దరూ మొదట 'మదగజరాజా' సినిమా చేశారు. కానీ దానికంటే ముందే వీరి కాంబోలో 'ఆంబళ' విడుదలైంది. ఆ తర్వాత యాక్షన్ సినిమాలో కలిసి పనిచేశారు. కానీ అది పెద్దగా విజయం సాధించలేదు. వీరిద్దరూ కలిసి పనిచేసిన మొదటి సినిమా 'మదగజరాజా' గతేడాది పొంగల్ పండుగకు విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్టయింది. పన్నెండేళ్ల నిరీక్షణ తర్వాత ఈ సినిమా విడుదలై విజయం సాధించడం విశేషం. 'మదగజరాజా' విజయం తర్వాత సుందర్.సి, విశాల్ మళ్లీ జతకట్టనున్నారని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వీరి కాంబినేషన్‌లో రాబోయే కొత్త సినిమాపై అధికారిక ప్రకటన వెలువడింది. ఈ కొత్త సినిమాను అవ్ని సినీ మాక్స్ బ్యానర్‌పై ఖుష్బూ, ఆమె కూతురు అనందిత నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు హిప్ హాప్ తమిళ సంగీతం అందిస్తున్నారు. దీనికి 'పురుషన్' అని పేరు పెట్టారు. చిత్ర బృందం ప్రోమోను కూడా విడుదల చేసింది. అందులో మొదట తమన్నా భర్తగా విశాల్ శాంతంగా ఇంటి పనులు చేస్తుంటాడు. ఆ తర్వాత యోగిబాబు ఇంటికి రాగా, టీ పెట్టడానికి వంటగదిలోకి వెళ్లి యాక్షన్ మోడ్‌లోకి మారతాడు. ఇంట్లోకి వచ్చిన రౌడీలను శబ్దం లేకుండా కొట్టి పడేస్తాడు. అది చూసి యోగిబాబు మాత్రమే షాక్ అవుతాడు. భార్య ముందు సాధువుగా ఉండే విశాల్, ఆమెకు తెలియకుండా ఎందుకు గొడవలకు దిగుతున్నాడు? విశాల్‌ను చంపడానికి వచ్చిన రౌడీలు ఎవరు? అనే విషయాలను యాక్షన్ కామెడీగా ఈ సినిమా చూపించబోతోందని ప్రోమో చూస్తే తెలుస్తోంది. దర్శకుడు సుందర్ సి చేతిలో ప్రస్తుతం ముక్కుత్తి అమ్మన్ 2 సినిమా ఉంది. ఈ సినిమాను ఐసరి గణేష్ నిర్మిస్తున్నారు. ఈ ఏడాది ముక్కుత్తి అమ్మన్ 2 సినిమా థియేటర్లలోకి రానుంది.

## చిరంజీవి గారితో వర్క్ చేయడం మైండ్-బ్లోయింగ్ ఎక్స్‌పీరియన్స్

డైరెక్టర్ అనిల్ రావిపూడి ఇంటర్వ్యూ...



మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి ల ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో అలరించారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రంలో నయనతార కథానాయిక నటించారు. శ్రీమతి అర్చన ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేశారు. సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా ఈనెల 12న విడుదలైన ఈ చిత్రం మెగా బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకొని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్ తో హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడితో ఇంటర్వ్యూ...

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

**పవన్ కళ్యాణ్ గారు ఈ చిత్రాన్ని అభినందించారు.. ఎలా అనిపించింది ?**

కళ్యాణ్ గారు అభినందించడం చాలా ఆనందాన్నిచ్చింది. అలాగే ఇండస్ట్రీలో డైరెక్టర్స్, హీరోస్ చాలామంది పర్సనల్ గా ఫోన్ చేశారు, మెసేజ్లు పెట్టారు. ఈ సక్సెస్ ని మాతో పాటు ఇండస్ట్రీ సెలబ్రేట్ చేసుకోవడం చాలా హ్యాపీనెస్ ఇచ్చింది.

**ఈ సినిమాలో చిరంజీవి గారు యంగ్ స్లీక్ లుక్ లో కనిపించారు కదా.. మీరు క్యారెక్టర్ చెప్పినప్పుడే ఇలా అనుకున్నారా?**

ఈ సినిమా కోసం ఆయనకి ఫస్ట్ ఫోటో షూట్ చేయగానే లుక్ చూసి స్టన్నింగ్ గా అనిపించింది. ఈ లుక్కు చాలా వావ్ ఫ్యాక్టర్ల ఉండబోతుందనిపించింది. చాలా గ్లామర్ గా ఉన్నారు. సన్నబడిపోయారు. ఈ లుక్కు సినిమా అంతా ఉంటే ఆడియన్స్ ఈ లుక్ కి ఫిదా అయిపోతారు అనిపించింది. ఆయన లుక్కు, స్క్రిప్ట్, టైమింగ్, బాడీ లాంగ్వేజు అన్నీ కుదిరాయి, వింటేజ్ చిరంజీవి గారిని చూసి అందరూ మెస్మరైజ్ అయ్యారు. వింటేజ్ మెగాస్టార్ ని చూపించే అవకాశం నాకు ఇచ్చినందుకు చిరంజీవి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**చిరంజీవి గారిని వెంకటేష్ గారిని ఒకే సినిమాతో తీసుకొచ్చారు కదా.. ఆ ఒత్తిడి మీద ఉండేదా?**

చిరంజీవి గారు వెంకటేష్ గారు కలిసి కనిపించబోతున్నారంటే కచ్చితంగా చాలా అంచనాలు ఉంటాయి. అందరికీ నచ్చేలా ప్రజెంట్ చేయడం కూడా పెద్ద టాస్క్. అయితే చిరంజీవి గారు వెంకటేష్ గారి మధ్య ఉన్న నేచురల్ ఫ్రెండ్షిప్ వల్ల నా వర్క్ ఈజీ అయింది. థియేటర్స్ లో చిరంజీవి గారు వెంకటేష్ గారి సీన్స్ చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ ఎంజాయ్ చేస్తున్నారు. చిరంజీవి గారితో పనిచేయడం మైండ్ బ్లోయింగ్ ఎక్స్పీరియన్స్. నేను ఆ ఇద్దరు స్టార్స్ ని చూస్తూ పెరిగాను.

**ఇందులో ప్రతి సీక్వెన్స్ అద్భుతంగా వర్కౌట్ అయింది కదా.. రైటింగ్ రైటింగ్ ప్రాసెస్ ఎలా సాగింది?**

శంకర్ వరప్రసాద్ క్యారెక్టర్ జర్నీ చూపిద్దాం అనుకున్నాను. సినిమా వన్ మ్యాన్ షోలా అనిపిస్తుంది. ప్రతి సీను ఆయన చుట్టూ చుట్టూతనే వెళ్ళాం. నేను ఏ స్క్రీన్ ప్లే అయితే రాసుకున్నాను దాని ప్రకారం చేయడం జరిగింది. అయితే శశిరేఖ లవ్ ట్రాక్ మాత్రం ముందు స్క్రిప్ట్ లో మధ్యలో వస్తే బాగుంటుంది అనుకున్నాను. కానీ స్క్రీన్ ప్లే ప్రకారం అది బిగినింగ్ వస్తేనే ఇంకా కనెక్టింగ్ గా ఉంటుందని దాన్ని ముందుకు తీసుకురావడం జరిగింది. అది ఇంకా అద్భుతంగా వర్క్ అయ్యింది.

**మందు కొట్టే సీన్ చాలా వైరల్ అయింది కదా.. దాని గురించి చెప్పండి?**

చిరంజీవి గారి ప్రతి సినిమాలో అలాంటి ఒక పెక్యులర్ సీక్వెన్స్ ఉంటుంది. మందు సీన్స్ లో ఆయన చేసే మ్యానరిజమ్స్ చాలా డిఫరెంట్ గా ఉంటాయి. ఆ సీక్వెన్స్ వెంకటేష్ గారికి ఆయనకి మధ్య ఉండే కనెక్షన్ ని కూడా రివిల్ చేస్తుంది. అది థియేటర్లో అద్భుతంగా పేలింది. ఇప్పుడు అందరు సరదాగా రీల్స్ చేస్తున్నారు. అయితే సినిమాలో ఏదో సరదాకి చేస్తాం. పిల్లలు మాత్రం ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని కోరుతున్నాను.

**చిరంజీవి గారికి కథ చేయడంలో చాలా కష్టం ఉంటుంది కదా.. ఆయనకి ఈ కథ చేసినప్పుడు మీ ప్రిపరేషన్ ఏమిటి?**

చిరంజీవి గారితో కచ్చితంగా సినిమా చేయాలనే కాన్ఫిడెన్స్ తో ఎక్స్ట్రా ఎఫర్ట్ పెట్టి ఈ కథని సిద్ధం చేశాను. చిరంజీవి గారిని నాకు నచ్చినట్టు చూపించాలనే తపన ఏమో కానీ రైటింగ్ అంతా చాలా స్మూత్ గా వెళ్ళింది. మేము అనుకున్నవన్నీ చక్కగా కుదిరాయి. ఈ కాన్ఫిడెన్స్ ఇచ్చింది కూడా చిరంజీవి గారే. నా కెరీర్ లో చాలా ఫాస్ట్ గా రాసిన స్క్రిప్ట్ ఇది. ఇలాంటి పాత్రలు ఆయనకి కొట్టినపిండి. ఆయన టైమింగ్ అద్భుతంగా ఉంటుంది.

**నయనతార గారు స్పెషల్ గా మీ సినిమా కోసం ప్రమోషన్ చేశారు.. అది ఎలా కుదిరింది?**

ఈ సినిమా కథ తనకు చాలా నచ్చింది. అలాగే నా వర్కింగ్ స్టైల్ కూడా నచ్చింది. బహుశా నేను ఇలాగే చేస్తానేమో అని చాలా పాజిటివ్ గా తీసుకుని ప్రమోషన్స్ లో కూడా భాగమవడం జరిగింది. రిలీజ్ నయనతార గారితో మాట్లాడాను. ఇంత పెద్ద సక్సెస్ అయినందుకు తను చాలా ఆనందంగా ఉన్నారు.

**గ్రౌండ్ లెవెల్ లో మీరు చాలామంది మెగా అభిమానుల్ని కలిశారు కదా .. వాళ్ళ ఫీడ్బ్యాక్ ఏంటి?**

అభిమానుల రెస్పాన్స్ మాటల్లో చెప్పలేను. నన్ను చూసి చాలా ఎమోషనల్ అయిపోయారు. ఎన్నో సంవత్సరాల నుంచి చిరంజీవి గారిని ఇలా చూడాలని వాళ్లు కోరుకున్నారు. ఈ సక్సెస్ ని వాళ్ళు సెలబ్రేట్ చేసుకున్నారు. థియేటర్స్ లో ఆడియన్స్ ని చూస్తున్నప్పుడు ఒక జాతర లాగా అనిపించింది. అన్ని ఏజ్ గ్రూప్ ప్రేక్షకులు ఈ సినిమాని సెలబ్రేట్ చేసుకున్నారు.

**రాజమౌళి గారి తర్వాత వరుసగా తొమ్మిది విజయాలు అందుకున్న దర్శకుడిగా రికార్డు సృష్టించారు.. మీ పదో సినిమాకి ఎంత జాగ్రత్త తీసుకోబోతున్నారు ?**

నిజానికి ఇది నాకు కాస్త క్రుషియల్ ఫేజ్. నెక్స్ట్ ఏం చేయాలనే దానికి గురించి ఒక రెండు పాజ్ ఇచ్చాను. మొన్న ఒక ఐడియా క్రాక్ చేసాము. ఈసారి టైటిల్ అనౌన్స్మెంట్ నుంచి ఒక విచిత్రమైన జర్నీ స్టార్ట్ కాబోతోంది. స్టోరీ లైన్ ఫిక్స్ అయ్యాను. ఇంకా యాక్టర్స్ ఫిక్స్ కాలేదు. జూన్, జూలైలో స్టార్ట్ చేయాలి. అది కూడా మంచి ఎంటర్టైనర్. నెక్స్ట్ సంక్రాంతికి వస్తారా? అని ప్రత్యేకంగా అడగాల్సిన అవసరం లేదు (నవ్వుతూ).

-ఎం.డి అబ్దుల్

## 'శ్రీ చిదంబరం' నుంచి కీరవాణి గాత్రం



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

శ్రీమతి. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం 'శ్రీ చిదంబరం'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన 'శ్రీ చిదంబరం' చిత్రం నుంచి ఇటీవల టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌కు వచ్చిన అనూహ్య స్పందన గురించి తెలిసిందే. కాగా ఈ చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి ఆలపించిన 'వెళ్లేదారిలో' అనే ఓ పాట బ్యూటిఫుల్ పాటను విడుదల చేశారు. సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి అభినందనలతో.. ఆయన సినిమాకు బెస్ట్ విషెస్ చెబుతూ పాటను విడుదల చేశారు. చందు రవి సంగీతం అందించిన ఈ పాటకు చంద్రశేఖర్ సాహిత్యాన్ని సమకూర్చారు. ఈ పాట ట్యూన్‌తో పాటు లిరిక్స్ అందరి హృదయాలను హత్తుకుంటున్నాయి. ముఖ్యంగా కీరవాణి గాత్రం ఈ పాటకు ప్రాణం పోసింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ.. కీరవాణి ఈ పాటలను ఆలపించడం ఎంతో సంతోషంగా ఉంది. ఆయన గాత్రంతో ఆ పాట ఎంతో గొప్పగా మారింది. సినిమా విషయానికొస్తే.. ఇదొక ఓ అందమైన ప్రేమ కథ, వింటేజ్ విలేజ్ డ్రామాలో పూర్తి కొత్తదనం నిండి ఉంటుంది. ప్రతి పాత్ర, ప్రతి విజువల్ ఎంతో సహజంగా ఉంటుంది.

## థియేటర్స్ లోకి 'కానిస్టేబుల్ కనకం'



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో నటించిన బ్లాక్ బస్టర్ సిరీస్ కానిస్టేబుల్ కనకం. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించారు. మేఘ లేఖ, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలు పోషించారు. కోవెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. ఈ సిరీస్ కి వచ్చిన రెండు సీజన్స్ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యాయి. తాజాగా మేకర్స్ బిగ్ అనౌన్స్ మెంట్ చేశారు. కానిస్టేబుల్ కనకం చాప్టర్ 3 కాల్ ఘాట్ సినిమాగా థియేటర్స్ లో రిలీజ్ చేయబోతున్నారు. అలాగే రెండు సీజన్స్ కలిపి థియేటర్స్ లో సినిమాగా రిలీజ్ చేయబోతున్నారు. కాల్ ఘాట్ చాప్టర్ 3 గ్లింప్స్ ని ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు, నిర్మాత అశ్విని దత్ లాంచ్ చేశారు. ఈ ప్రెస్ మీట్ లో దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు మాట్లాడుతూ... నేను అశ్విని దత్ కలిసి ఫస్ట్ ప్రిన్స్ మహేష్ బాబుని పరిచయం చేశాం. దానికి సాయిబాబానే ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా ఉన్నారు. తర్వాత పెళ్లి సందడి గంగోత్రి.. ఎన్నో సక్సెస్ఫుల్ సినిమాలు చేశాం.ఆ విజయాల్లో భాగం సాయిబాబా కి ఈటీవీ కి ఉంది. తన అనుభవాన్ని అంతా కలబోసి కానిస్టేబుల్ కనకం అనే సక్సెస్ఫుల్ ఫిల్మ్ చేశారు. వర్ష చాలా మంచి ఆర్టిస్ట్. తను చాలా బిజీ కాబోతోంది. 30 ఏళ్ల క్రితం శాంతినివాసం సీరియల్ తో ఈటీవీతో మా జర్నీ మొదలైంది. శాంతి నివాసానికి రాజమౌళి డైరెక్టర్. నేను అనుకున్న దాని కంటే అద్భుతంగా తీశాడు.



## చంటి పుట్టినరోజు 'పేటరౌడీ' పోస్టర్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

వీ కే క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెంబర్.2గా తెరకెక్కుతున్న చిత్రం 'పేట రౌడీ'. ఇటీవల ఈ చిత్రాన్ని జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. మాక్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని కళ్యాణి కర్తనాథ నిర్మిస్తున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మాస్ లవ్ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. హీరో చంటి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన స్పెషల్ బర్త్ డే పోస్టర్‌ను ఆనంద్ గ్రూప్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఎల్. ఆనంద్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫైట్ సీక్వెన్స్ షూటింగ్ పూర్తయ్యిందని, త్వరలోనే మూవీ గ్లింప్స్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి అదనపు స్క్రీన్‌ప్లే కేవీర్ అందించగా, మాటలు-పాటలు భావ్యశ్రీ రాశారు. సినిమాటోగ్రఫీని వై.ఎస్. కృష్ణ నిర్వహిస్తున్నారు. లైన్ ప్రొడ్యూసర్లుగా ఇటీకర్లపల్లి మహేష్ కుమార్, దంతులూరి పృథ్వీరాజ్ వ్యవహరిస్తున్నారు.

## విజయ్ దేవరకొండ చేతుల మీదుగా 'హ్యాపీ రాజ్' తెలుగు ప్రోమో

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



ఆసక్తికరమైన టైటిల్ అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి సినీ వర్గాల్లో చర్చల్లో నిలుస్తున్న చిత్రం 'హ్యాపీ రాజ్'. ప్రమోషన్స్ పరంగా వినూత్నంగా వెళ్తున్న చిత్ర యూనిట్ తాజాగా అధికారిక ప్రోమో విడుదల చేసింది. రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ చేతుల మీదుగా విడుదలైన తెలుగు ప్రోమో.. సినిమా స్టోరీ ఎలా ఉండబోతోందో చెప్పకనే చెప్పేసింది. డిఫరెంట్ స్టైల్ మేకింగ్ తో విడుదలైన కొద్ది సమయంలోనే సోషల్ మీడియా వేదికలో ఈ వీడియో వైరల్ అయింది. జయవర్ధన్ నిర్మిస్తున్న ఈ చిత్రం, బియాండ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.1గా రూపొందుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి మారియా ఎలాంచెజియన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ప్రోమోలో కనిపించే ప్రతి ఫ్రేమ్ కూడా వైవిధ్యంతో కూడి ఉంది ఆకర్షిస్తోంది. ఈ సినిమాలో జీవీ ప్రకాశ్ కుమార్ టైటిల్ పాత్రలో నటిస్తున్నారు. రిఫ్రెషింగ్ విజువల్స్, లైట్ హ్యూమర్, హాయిగా సాగే టోన్‌తో ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక మంచి సినిమా అనుభూతిని అందించబోతోందనే నమ్మకాన్ని ప్రోమో బలంగా కలిగిస్తోంది. ముఖ్యంగా ఈ రోజుల్లో అవసరమైన హ్యాపీనెస్‌ను అందించే సినిమాగా ఇది నిలవబోతోందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో జీవీ ప్రకాశ్ కుమార్ టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. శ్రీ గౌరి ప్రియా ప్రధాన పాత్రలో నటిస్తుండగా, చాలా కాలం తర్వాత అబ్బాస్ మళ్ళీ సినిమాల్లోకి తిరిగి రావడం విశేషంగా మారింది. ఇకపోతే ఈ చిత్రంలో జార్జ్ మరియం, ప్రార్థనా, అధిర్చి అరుణ్, మదురై ముత్తు, సోఫా బాయ్ రసూల్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతలను మారియా ఎలాంచెజియన్ నిర్వర్తించగా.. జైకాంత్ సురేష్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మదన్ క్రిస్టఫర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూర్చుతున్నారు. ఆర్‌కే సెల్వా ఎడిటింగ్, కుమార్ గంగప్ప ఆర్ట్ డైరెక్షన్, ప్రవీణ్ రాజా కాస్ట్యూమ్స్ బాధ్యతలు చేపట్టారు. మొత్తంగా, ప్రోమోతోనే మంచి అంచనాలను క్రియేట్ చేసిన 'హ్యాపీ రాజ్', ఓ కంప్లీట్ ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుందని చిత్ర బృందం చెబుతోంది.



## ఫిబ్రవరి 6న 'బరాబర్ ప్రేమిస్తా'

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

యాటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ హీరోగా వస్తున్న కొత్త చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. సంపత్ రుద్ర దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘన ముఖర్జీ హీరోయిన్‌గా నటించారు. అర్జున్ మహీ ("ఇష్టంగా" ఫేమ్) ప్రతినాయకుడిగా నటించారు. ఇప్పటి వరకు 'బరాబర్ ప్రేమిస్తా' నుంచి వచ్చిన పోస్టర్లు, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా యూత్‌ను బాగా అట్రాక్ట్ చేశాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్ అనౌన్స్మెంట్ ఈవెంట్ హైదరాబాద్ లోని బ్రిలియంట్ గ్రూప్ ఆఫ్ కాలేజీస్ లో నిర్వహించారు. స్టూడెంట్ తో డాన్సులు చేసిన హీరో హీరోయిన్.. ఆపై ఫిబ్రవరి 6న సినిమా రిలీజ్ డేట్ అని ప్రకటించి అందరిలో జోష్ నింపారు. ఈ సందర్భంగా హీరో చంద్రహాస్ మాట్లాడుతూ .. ''మా సినిమా ప్రమోషన్స్ ఈ కాలేజీ నుంచే స్టార్ట్ చేస్తున్నాం. మీ అందరినీ చూస్తుంటే చాలా ఎనర్జీ వచ్చేస్తోంది. ఫిబ్రవరి 6న బారాబర్ ప్రేమిస్తా సినిమాతో విక్టరీ కొట్టబోతున్నాం అని నమ్మకంగా చెబుతున్నా. అందరూ ఈ సినిమా చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు.

## 'హలో ఇట్స్ మీ' ఫస్ట్‌లుక్ రిలీజ్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



ప్రభుత్వ జూనియర్ కళాశాల చిత్రంతో హీరోయిన్ గా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న షగ్నశ్రీ వేణున్ దర్శకురాలిగా మారి రూపొందిస్తున్న సినిమా "హలో ఇట్స్ మీ". ఈ సినిమాలో వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్నారు. షగ్నశ్రీ హీరోయిన్ గా నటిస్తోంది. దర్శన్ మదమంచి మరో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎస్ 2 ఎస్ సినిమాస్, శ్వాస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై వీఎస్ కే సంజీవ్, వంగపల్లి సందీప్, వంగపల్లి సంకీర్త్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉన్న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ ను తాజాగా హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలో.. హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ నా రీసెంట్ ప్రాజెక్ట్ నయనం అందరి ఆదరణ పొందుతోంది. ఇటీవల వరుసగా థ్రిల్లర్స్ చేస్తూ వస్తున్నాను. అలాంటి టైమ్ లో హలో ఇట్స్ మీతో ఒక మంచి ఫ్యామిలీ, లవ్ మూవీ చేస్తున్నాను. ఇది క్లీన్ ఫ్యామిలీ మూవీ. యువతీ యువకులు ఒకరినొకరు అపార్థం చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అనేది షగ్న బ్యూటిఫుల్ గా ఈమూవీలో చూపించింది. ఆమె స్టోరీ నెక్స్ట్ లెవెల్ లో చెప్పింది. అప్పుడే డైరెక్టర్ గా ఆమెను నమ్మాను. షగ్న తప్పకుండా మంచి సినిమా చేస్తుందని బిలీవ్ చేశాను. నా రీసెంట్ ప్రాజెక్ట్ నయనం కూడా లేడీ డైరెక్టర్ స్వాతి చేశారు. నాకు హిట్ ఇచ్చారు. షగ్న కూడా ఆ సక్సెస్ ను కంటిన్యూ చేస్తుందని నమ్ముతున్నాను. నా మూవీస్ కొత్తబంగారు లోకం, హ్యాపీడేస్ సాంగ్స్ కు ఇప్పటికీ ఫ్యాన్స్ ఉన్నారు. అలాంటి ఆడియెను మిస్ అవుతున్నాను అనుకున్నాను. ఈ చిత్రంలోని పాటలతో ఆ కొరత తీరనుంది. ఈ మూవీ సాంగ్స్ ను కొన్నేళ్ల వరకు వింటూనే ఉంటారు. వంశీకాంత్ అంతమంచి ఆడియో ఇచ్చారు. ప్యాషనేట్ గా ప్రొడ్యూస్ చేస్తున్న మా ప్రొడ్యూసర్స్ సందీప్, సంజీవ్, సంకీర్త్ లకు ఈ సినిమా మంచి సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా. మీ అందరి సపోర్ట్ మా టీమ్ కు ఉండాలి అన్నారు.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**